అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 22-5-2023



28న కొత్త పార్లమెంట్ భవన్ ముట్టడి

- మహిళ మహా పంచాయత్ నిర్వహిస్తాం: రైతులు, ఖాప్ నేతలు
- మండుటెండలో రెజ్లర్ల ఆందోళన
- నేటితో నెల రోజులకు ఉద్యమం

వివరాలు 9లో..

సంపుటి : 9 | సంచిక : 90 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

పెరుగుతున్న నిరుద్యోగం




అంతా మోడీ వైఫల్యం

- ప్రకటనలకే పరిమితమైన ఎన్నికల హామీలు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నష్టపోతున్న యువత
- నైపుణ్య కొరతతోనూ నిరుద్యోగులుగా మారుతున్న వైనం
- భావితరాన్ని పూర్తిగా విస్మరించిన కేంద్రం

భారత జనాభాలో దాదాపు 54 శాతం మంది 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారే. దేశ భవిష్యత్తులో యువత పాత్ర చాలా కీలకం. అయితే, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాత్రం ఆ యువతను విస్మరిస్తున్నది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని యువతకు హామీనిచ్చి 2014లో కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆ హామీని గాలికొదిలేసింది. దీంతో దేశంలోని యువత తీవ్ర నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నది.

న్యూఢిల్లీ : నిరుద్యోగం విషయంలోనూ మోడీ సర్కారు సంబంధం లేకుండా వాదిస్తున్నది. దేశ జనాభా పెరుగుదల ఆందోళన కలిగిస్తోందని ఎర్రకోట నుంచి ప్రధాని చెప్పారు. ముస్లిం మైనారిటీల అధిక జననాల రేటు ప్రమాదకరమనీ, ఈ ప్రమాదాన్ని ఎదుర్కొంటామని చెప్పారు. పరోక్షంగా ఒక వర్గాన్ని నిందించటమే ఈ వ్యాఖ్యల సారాంశమన్నది బహిరంగ రహస్యమే. దేశ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సింది పోయి.. దేశ జనాభాను నిరుద్యోగానికి సమస్యగా చూపెడుతూ మోడీ సర్కారు తన తప్పును కప్పి పుచ్చుకొనే ప్రయత్నాలు చేస్తున్నదని మేధావులు, సామాజికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2015 నుంచి కేంద్రం నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన విషయంలో ఏమాత్రమూ సీరియస్‌గా వ్యవహరించలేదు.. "స్కిల్ ఇండియా" నినాదం.. ఒక నినాదంగానే ఉన్నది తప్పితే దేశ యువతకు ఎలాంటి లబ్ది చేకూరలేదు. దేశ జనాభాలో 62 శాతం కంటే ఎక్కువ మంది 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు గలవారున్నారు. ఇందులో పని చేసే వయస్సున్నవారు దాదాపు 54 శాతం మంది 25 ఏళ్ల లోపు వారే. రాబోయే దశాబ్దంలో 15-59 సంవత్సరాల వయస్సున్నవారి జనాభా పెరుగుతుందని ఒక అంచనా. అయితే, ...5లో



శ్రామికశక్తి ఉన్నా...

గత దశాబ్ద కాలంగా పని ప్రపంచం వేగంగా మారుతోంది. కోవిడ్-19 మహమ్మారి మార్పుల వేగాన్ని మరింత వేగవంతం చేసింది. వేగంగా మారుతున్న ఈ పని ప్రపంచం పూర్తిగా భిన్నమైన నైపుణ్యాలను కోరుతున్నది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే భారత్ భారీ జనాభా ప్రయోజనాన్ని అనుభవిస్తున్నప్పటికీ, దేశ శ్రామిక శక్తి నైపుణ్యాలు, శిక్షణలో నిరాశాజనకంగా వెనుకబడి ఉన్నది. మన శ్రామిక శక్తిలో కేవలం 5 శాతంమంది మాత్రమే ఏదైనా అధికారిక నైపుణ్య శిక్షణ పొందారు. ఇది యూకేలో 68 శాతం, జర్మనీలో 75 శాతం, యూఎస్‌లో 52 శాతం, జపాన్‌లో 80 శాతం, దక్షిణ కొరియాలో 96 శాతంగా ఉండటం గమనార్హం.

ఇక ప్రభుత్వ స్వంత అంచనాలను పరిశీలిస్తే.. 2022 నాటికి, మౌలికరంగంలో దాదాపు 1.5 కోట్ల మంది నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉంటుంది. ఆటో కాంపోనెంట్స్ ...9లో

ఉపాధిలేక...

ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2021 దేశంలో ఉన్న తిరోగమన పరిస్థితులకు అద్దం పడుతున్నది. ఈ సమాచారం ప్రకారం అధికారికంగా చదువుకున్నవారిలో ఉద్యోగావకాశాలు 50 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. బీటెక్‌లో 47 శాతం, ఎంబీఏలో 47శాతం, బీఏలో 43 శాతం, బీకామ్‌లో 40 శాతం, బీఎస్సీ గ్రాడ్యుయేట్లలో 30 శాతం మంది మాత్రమే ఉపాధి నైపుణ్యాలను కలిగి ఉన్నారు. డిగ్రీ హెూల్డర్లలో 22 శాతం మంది మాత్రమే ఉద్యోగావకాశాలు పొందుతున్నారు. ఐటీఐ గ్రాడ్యుయేట్లలో 75 శాతం మందికి ఉపాధి నైపుణ్యాలు లేకపోవటం గమనార్హం. ఫార్మా గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం 67 శాతంగా ఉన్నది. ఇతర రంగాలను కూడా కలుపుకుంటే, ప్రతి సంవత్సరం లేబర్ మార్కెట్‌లోకి ప్రవేశించే 1.5 కోట్ల మంది యువకులలో 65 శాతం నుంచి 75 శాతం వరకు నిరుద్యోగులే కావటం గమనార్హం. దేశంలో జూలై 2021 చివరి నాటికి నిరుద్యోగం రేటు 6.95 శాతానికి పెరిగింది. ఇది పట్టణ ప్రాంతాల్లో 8.3 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 6.4 శాతంగా ఉన్నది. ఇక కోర్ సెక్టార్లలోనూ ఇవే పరిస్థితులు ఉన్నాయి. తయారీ, మైనింగ్‌లో ఉద్యోగాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. అయితే, దేశ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపెట్టటం, అందుకు అవసరమైన నైపుణ్యాలను కల్పించటం వంటివి చేయాల్సిన మోడీ సర్కారు.. ఈ విషయంలోనూ జనాభా పెరుగుదలను సాకుగా చూపి, ఒక వర్గం వారిని అందుకు కారణంగా చూపుతూ.. వారిపై విద్వేషాలు పెంచే ప్రయత్నాలు చేయటం దేశ భవిష్యత్తుకు ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని మేధావులు, సామాజికవేత్తలు తెలిపారు.

తగ్గుతున్న నిరుద్యోగం

ఇది కేరళ విజయం

- 12 శాతం నుంచి 5 శాతానికి పడిపోయిన తీరు
- రెండేండ్ల పాలనపై సీఎం 'ప్రగతి నివేదిక'



తిరువనంతపురం : కేరళలో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. విజయన్ సర్కారు పనితీరుతో రాష్ట్రంలో నిరుద్యోగం 12 శాతం నుంచి 5 శాతానికి పడిపోయింది. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం గత రెండేండ్లలో సాధించిన విజయాలను తెలియజేస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రగతి నివేదికను విడుదల చేశారు. వచ్చే 25 ఏండ్లలో ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి కేరళలో జీవన ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి సూచించారు. గత ఏడేండ్లుగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ఈ లక్ష్యానికి చేరువ చేస్తున్నాయని ఆయన వివరించారు.కరళలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతూ ఇప్పుడు చాలా మంది వస్తున్నారు. వారిలో మహిళల నుంచి అధికంగా ఉండటం గమనార్హం. దాదాపు రూ. 8500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారు. దీని ద్వారా దాదాపు మూడు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని సీఎం వివరించారు.ప్రపంచంలోనే అత్యుత్తమ బిజినెస్ ఇంక్యుబేటర్‌గా కేరళ స్టార్టప్ మిషన్ ఎంపికైందన్నారు. కేరళ సొంత ప్రాజెక్ట్ కొచ్చి వాటర్ మెట్రో, రూ.1500 కోట్ల డిజిటల్ సైన్స్ పార్క్ ప్రాజెక్ట్, వివిధ ఐటీ పార్కులు కేరళ ప్రగతికి సూచికలు. బహుళజాతి కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని సీఎం పేర్కొన్నారు.

2016కు ముందు రాష్ట్రంలో తీవ్ర నిరాశే ఉండేదని వివరించారు. "ఇక్కడ ఎలాంటి మార్పు ఉండదనీ, ఎలాంటి మార్పును ఆశించకూడదని భావించేవారు చాలా మంది ఉన్నారు. దేశానికే గర్వకారణమైన విద్య ఆరోగ్య రంగాల వెనుకబాటుతనం, సంస్కృతిలో కుళ్లిపోవడం, అవినీతి కారణంగా ఇది జరిగింది. ఈ పరిస్థితి నుంచి నేటి కేరళ పునరుజ్జీవం పొందింది. అన్ని విపత్తులను తట్టుకుని కేరళ పురోగమిస్తున్నది. ఈ ఉద్యమాన్ని తక్కువ చేసేందుకు అసత్యాలను ప్రచారం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని విజయన్ పేర్కొన్నారు.

2016లో కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వివిధ పెన్షన్ పథకాల్లో రూ. 1473.67 కోట్లు బకాయిలు ఉన్నాయి. అప్పట్లో రెండేండ్లుగా పింఛను రాని వారు ఉన్నారు. విజయన్ సర్కారు పెన్షన్ మొత్తాన్ని 600 నుంచి 1600కి పెంచింది. రూ. 18997 కోట్ల మొత్తాన్ని సామాజిక పింఛన్‌గా పంపిణీ చేశారు. పేదల పట్ల నిబద్ధత కలిగిన ప్రభుత్వం కాబట్టి తమను మళ్లీ అంగీకరించారనీ, అదే ప్రభుత్వ విధానం అని సీఎం పేర్కొన్నారు. కేరళను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళి నవ కేరళకు సాధ్యపడాలని కోరుకుంటున్నాననీ, ఐక్యతతోనే దీనిని సాధించగలమని వివరించారు. కేరళలో గత ఆరేండ్లలో వచ్చిన మార్పులను దాచిపెట్టి కొందరు విమర్శలు గుప్పిస్తున్నారని పేర్కొన్నారు. కేరళ ఏ రంగంలోనూ వెనుకంజ వేయలేదనీ, ఎక్కడా ఆగిపోలేదని ఆయన స్పష్టం చేశారు.

కలిసికట్టుగా బీజేపీకి బుద్ధి చెబుదాం

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో నితీష్ భేటీ



న్యూఢిల్లీ : ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ ఆదివారం భేటీ అయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు నితీశ్ కుమార్ యత్నిస్తున్నారు. ఆపరేషన్ జోడో మిషన్ లో భాగంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు నితీశ్ కుమార్ పలువురు నేతలతో సమావేశమవుతున్నారు. దీనిలో భాగంగా న్యూఢిల్లీ చేరుకున్న నితీశ్ ...9లో

ధాన్యం కోనుగోళ్లలో జాప్యం

గోనే సంచులు దిగుమతి చేయాలని రోడ్డెక్కిన రైతులు

- హన్మకొండ జిల్లాలో అన్నదాతల ఆందోళన



నవతెలంగాణ - శాయంపేట

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోకపోవడంతో క్యూ లైన్‌లో వాహనాలు నిరీక్షించాల్సి వస్తుందని, వాహన యజమానులు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనికి తోడు అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు తడుస్తున్నాయని ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఈ ఘటన హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శాయంపేట, పరకాల, నడికూడ మండలాల నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని మండలంలోని పరకాల-హన్మకొండ ప్రధాన రహదారిలోని మాందారిపేట శివారు ...9లో

బెంగళూరులో వాన బీభత్సం

పలుచోట్ల ఈదురుగాలులతో కుంభవృష్టి

- జలదిగ్బంధనంతో జనం విలవిల
- కృష్ణా జిల్లాకు చెందిన మహిళ మృతి

బెంగళూరు : కర్నాటక రాజధాని నగరమైన బెంగళూరు ఆదివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి అతలాకుతలమైంది. గాలి, వాన బీభత్సం సృష్టించాయి. కొన్ని ప్రాంతాల్లోనూ వండగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తింది. రహదారులు ఈతకొలన్లను తలపించాయి. జలదిగ్బంధనంతో ప్రజలు విలవిల్లాడిపోయారు. వర్షానికి తోడు భారీగా ఈదురుగాలులు వీయడంతో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. సదాశివనగర్, కెఆర్ అండర్‌పాస్, కుమారకృప రోడ్డు, చిత్రకళా పరిషత్ వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు ముంచెత్తడంతో రాకపోకలపై ఆంక్షలు విధించారు.

విహారయాత్రకు వెళ్లి..విగతజీవిగా..

కెఆర్ సర్కిల్ వద్ద ఉన్న అండర్‌పాస్‌లో వర్షపు నీటిలో ఒక కారు చిక్కుకుపోవడంతో కృష్ణా జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భానురేఖ (22) చనిపోయారు. ఈ ఘటన జరిగినప్పుడు కారులో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారు. కొత్తవారు కావడంతో రోడ్డు మీద వాస్తవిక నీటి లోతును గుర్తించకుండా కారును ముందుకు పోనియ్యడంతో



అండర్‌పాస్‌లో కొత్తదూరం వెళ్లాక వాహనం మునిగిపోయింది. కారులో ఉన్నవారంతా అతికష్టం మీదకు బయటకు వచ్చినా..అప్పటికే వరద నీరు ఉధృతి పెరగడంతో చిక్కుకుపోయారు. 'రక్షించండి' అంటూ హాహాకారాలు చేశారు. స్థానిక ప్రజలు చీరలు, తాళ్ల వంటివి అందించినా ...9లో

పెట్టుబడులు పెడతాం

కేటీఆర్‌తో పలు కంపెనీల ప్రతినిధుల భేటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ఆసక్తిని వ్యక్తం చేశాయి. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కె.తారకరామారావు ఆయా కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, ప్రభుత్వ ప్రగతిశీల విధానాలను వివరించారు. ఇప్పటికే రాష్ట్రం బాట పట్టిన అంతర్జాతీయ సంస్థలకు సంబంధించిన విశేషాలను తెలిపారు.

హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్టు మాండీ హెూల్డింగ్స్ సంస్థ సీఇఓ ప్రసాద్ గుండు మొగుల తెలిపారు. దీంతో 2 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. స్టోరబుల్ సంస్థ హైదరాబాద్‌లో 100 మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లను నియమించుకోవడంతో పాటు పరిశోధనాభివృద్ధి కోసం మరికొంత మంది నిపుణులను తీసుకుంటామని ఆ కంపెనీ ప్రతినిధులు జోనాథన్ లూయిస్, నీల్ వర్మలు తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో పాటు స్థానిక విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తామని వారు ప్రకటించారు. సాఫ్ట్‌వేర్ సంస్థ రైట్ కంపెనీ హైదరాబాద్‌లో ప్రారంభించబోయే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానించింది. దీని ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ద్వితీయశ్రేణి నగరాలకు తమ సేవలను విస్తరిస్తామని వెల్లడించారు. తయారీ ప్లాంట్ ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు రేవ్ గేర్స్ సంస్థ ఆసక్తిని ప్రదర్శించింది. ప్రోడక్ట్ డెవలప్మెంట్, డిజైన్ థింకింగ్ కోసం హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు డిజిటల్ సొల్యూషన్స్, సప్లై చైన్ రంగంలో ...9లో

పేదల గుడిసెలపై పోలీసుల దాష్టీకం

తెల్లవారకముందే ప్రొక్లెన్లతో దాడి

- పోలీసులు, గుడిసె వాసుల మధ్య తోపులాట, ఘర్షణ
- వందమంది గుడిసె వాసులు అరెస్టు, విడుదల

నవతెలంగాణ-మహబూబాబాద్

తెల్లవారకముందే చీకట్లు వీడకుండానే పోలీసులు గుడిసె వాసులపై ప్రొక్లెన్లతో దాడి చేశారు. రియల్ ఎస్టేట్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసిన గుడిసెలను ఆదివారం తెల్ల వారుజామున పోలీసులు, మున్సిపల్ అధికారులు.. ప్రొక్లెన్లతో యథేచ్చగా కూల్చి వేశారు. ఈ అరాచకాన్ని పేదలు అడ్డుకొని ధర్నా చేశారు. పోలీసులతో జరిగిన ఘర్షణలో మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వందల సంఖ్యలో వచ్చిన పోలీసులు వందమంది పేదలను బలవంతంగా డీసీఎంలలో ఎక్కించి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ సమీపంలో ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఆక్రమించి ప్లాట్లుగా విభజించి విక్రయానికి పెట్టారు. రెవెన్యూ అధికారుల ...9లో



పోలీసు దాడి అమానుషం..: ఎస్ వీరయ్య

వివరాలు 9లో..

ఆస్ట్రేలియన్ పార్లమెంట్‌లో మోడీపై బీబీసీ డాక్యుమెంటరీ

- 24న కాన్‌బెర్రాలో ప్రదర్శితం
- కార్యక్రమాన్ని నిర్వహించనున్న ప్రవాస భారతీయ సంఘాలు

వివరాలు 9లో..

సంగీత సంచలనం రాజ్ ఇకలేరు



తెలుగు చిత్ర సీమకి తీరని లోటు...

వివరాలు 10లో..

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ప్రపంచ గమనం

జీ-7దేశాల 'విశ్వసనీయత'ను ప్రశ్నిస్తున్న చైనా



జీ-దేశాలు రుద్దుతున్న పశ్చిమ దేశాలకు అనుకూల నియమనిబంధనలను అంతర్జాతీయ సమాజం అంగీకరించదని, ప్రపంచపైన అమెరికా నాయకత్వంలోని కూటమి ఆధిపత్యాన్ని అనుమతించదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం నాడు ఒక ప్రకటనలో పేర్కొంది. "ఏవో కొన్ని దేశాలు బలవంతంగా రుద్దే నిబంధనలను చైనా ఎన్నటికీ అంగీకరించబోదు. భావజాలం, విలువల ఆధారంగా ప్రపంచాన్ని విడదీసే జీ-7 దేశాలలోగల పశ్చిమ ఐరోపా దేశాల ఆధిపత్యంతో రూపొందించిన నియమాలను అంతర్జాతీయ సమాజం అంగీకరించదు, అంగీకరించ జాలదు" అని చైనా ప్రకటించింది.

"అమెరికా ఫస్ట్" విధానాలను అమలుచేయటం కోసం ఒక గ్రూపు తన అభిప్రాయాలను ఇతరులపైన బలవంతంగా రుద్దటానికి ప్రయత్నిస్తోందని చైనావిదేశాంగ శాఖ ఆరోపించింది. ఏవో కొని పశ్చిమ దేశాలు ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ అంతర్జాతీయ వ్యవహారాలను తమకు అనుకూలంగా చక్కబెట్టుకునే రోజులు గతించాయి. అమెరికా, కెనడా, బ్రిటన్ ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాల క్లబ్ ని జీ-7 దేశాలు అని పిలుస్తారు. ఈ జీ-7 వార్షిక సమావేశాలకు యూరోపియన్ యూనియన్ కు ప్రాతినిధ్యంవహించే అధికారులు హాజరౌతూ ఉంటారు.

జీ-7 దేశాలు జపాన్ లోని హిరోషిమాలో సమావేశమై శనివారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఈ ప్రకటనలో చైనా సాంకేతిక పరిజ్ఞానాన్ని దొంగతనం చేస్తున్నదని, "ఆర్థిక బలత్కారాల"కు పాల్పడుతున్నదని, దేశంలో మానవ హక్కుల ఉల్లఘన చేస్తున్నదని ఆరోపించటం జరిగింది. అంతేకాకుండా తైవాన్, దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో ఏకపక్షంగా ఎటువంటి మార్పులు చేయటానికి ప్రయత్నించినా తాము వ్యతిరేకిస్తామని ఆ ప్రకటనలో చెప్పారు. ఈ ప్రకటనకు ప్రతిగా హంగ్ కాంగ్, క్జిన్జియాంగ్, టిబెట్ లు తమ ఆంతరంగిక విషయాలని, తైవాన్ స్వతంత్ర దేశంగా ఉండాలనే శక్తులకు జీ-7 దేశాలు తమ మద్దతునిస్తూ ఆ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగిస్తున్నాయని చైనా ఆరోపించింది. జీ-7 దేశాలకు తైవాన్ తో దౌత్య సంబంధాలు లేనప్పటికీ అమెరికా తైవాన్ కు అత్యంత ఆధునిక ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఇది చైనా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవటంతప్ప మరొకటికాదని చైనా విమర్శిస్తోంది.

ప్రపంచాన్ని రెండుగా విభజించవద్దు

- ఐరాస ప్రధాన కార్యదర్శి



ప్రచ్ఛన్న యుద్ధకాలంలో జరిగినట్టు ప్రపంచాన్ని అమెరికా, చైనా కూటములుగా చీల్చవద్దని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి, ఆంటోనియో గూటెరస్ జీ-7 దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఈలోపు పశ్చిమ దేశాలు తమ సంయుక్త సమావేశంలో అణ్వాయుధాల గురించి రష్యా, చైనాలపై ఆరోపణలను గుప్పించాయి. వాతావరణ మార్పు, అభివృద్ధి గురించి జీ-7 దేశాలకు, చైనాకు మధ్య 'క్రియాశీలమైన చర్చలు, సహకారం' ఉండాలని జపాన్ లోని హిరోషిమాలో సమావేశమైన జీ-7 దేశాలైన అమెరికా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్ లకు ఆయన హితవు పలికారు.

'ప్రపంచాన్ని రెండుగా విభజించాలనే ప్రయత్నాన్ని మానుకోవాలని, చర్చలు జరపటానికి అనుగుణమైన వాతావరణాన్ని సృష్టించాలని నేను భావిస్తున్నాను' అని ఆంటోనియో గూటెరస్ అన్నారు. ఈ మధ్య కాలంలో పశ్చిమ దేశాలకు, చైనాకు మధ్య ఒక ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొన్నదని, అమెరికా, చైనా దేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయని ఆయన చెప్పారు. తైవాన్ తో అమెరికా సంబంధాలు చైనాను రెచ్చగొట్టేవిధంగా ఉన్నాయనే విషయాన్ని ఇక్కడ ప్రత్యేకంగా గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది.

ఒకవైపు గూటెరస్ 'ప్రపంచాన్ని విభజించవద్దు' అని హెచ్చరిస్తుండగా, మరోవైపు జీ-7 దేశాలు తమ సంయుక్త ప్రకటనలో రష్యా అయుధ నియంత్రణ ఒప్పందాలను విస్మరిస్తూ 'బాధ్యతారహితంగా అణ్వాయుధాలను ఉపయోగిస్తా'నని ప్రకటిస్తున్నదని, చైనా ప్రపంచ , ప్రాంతీయ భద్రతలకు ప్రమాదకరంగా అణ్వాయుధాలను ఆధునీకరిస్తోందని పేర్కొన్నాయి. ఇదిలావుండగా డిప్లీటెడ్ యురేనియం మందుగుండును బ్రిటన్ ఉక్రెయిన్ కు సరఫరాచేయటాన్ని రష్యా తీవ్రంగా పరిగణిస్తోంది. గతవారం ఉక్రెయిన్ లోని ఖ్మెల్నిట్ స్కీ నగరంలో బ్రిటన్ సరఫరాచేసిన డిప్లీటెడె యురేనియం షెల్స్ గల గోదాముపైన రష్యా మిసైల్లతో దాడి చేసినప్పుడు ఏర్పడిన అణుమేఘం పశ్చిమ ఐరోపావైపు పయనిస్తోందని రష్యా భద్రతా మండలి కార్యదర్శి, నికొలాయ్ పత్రుషేవ్ ప్రకటించారు.

డిప్లీటెడ్ యురేనియం ఆయుధాలను ఉక్రెయిన్ కి సరఫరాచేస్తే బ్రిటన్ కు తీవ్రాతితీవ్ర పరిణామాలుంటాయని అంతకుముందే రష్యా హెచ్చరించింది. జపొరోజ్యే అణువిద్యుత్ ప్లాంటుపైన దాడిచేసి అణు ఉపద్రవాన్ని సృష్టించాలని ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని రష్యా ఆరోపిస్తోంది. ఈ అణువిద్యుత్ ప్లాంట్ మీద ఉక్రెయిన్ దాడి చేయటాన్ని విస్మరించి అది రష్యా నియంత్రణలోకి వెళ్లటాన్ని జీ-7 దేశాలు విమర్శిస్తున్నాయి.

కానిస్టేబుల్ తుది రాత పరీక్ష

- ప్రిలిమినరీ కీ విడుదల



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు నిర్వహించిన తుది రాతపరీక్ష ప్రిలిమినరీ కీ ని విడుదల చేసినట్టు టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఛైర్మెన్ వివి శ్రీనివాస్‌రావు ఆదివారం ప్రకటించారు. ఈ కీని తమ అధికారిక వెబ్‌సైట్‌లో సోమవారం 22వ తేదీ నుంచి అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. అలాగే, ప్రిలిమినరీ కీకి సంబంధించి ఏదైనా అభ్యంతరాలున్న పక్షంలో అభ్యర్థులు ఈ అధికారిక వెబ్‌సైట్‌లో తమ పాస్‌వర్డ్ ఆధారంగా కేటాయించిన స్థలంలో పొందుపర్చాలనీ, 24వ తేదీ వరకు ఈ అవకాశం ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. తమ అభ్యంతరాలకు సంబంధించిన ఆధారాలు కూడా సదరు అభ్యర్థులు పొందుపర్చాలని ఆయన చెప్పారు. దీని తర్వాత తుది కీని కూడా త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థలను
అమ్మే కుట్రలను తిప్పికొడదాం..



- కార్మికులకు కర్తవ్యాలను బోధించడం కోసమే మహాసభలు : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర 16వ మహాసభలు

నవతెలంగాణ-గోదావరిఖని:

కార్మికులకు కర్తవ్యాలను బోధించడం కోసమే సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర 16వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టి.రాజారెడ్డి అధ్యక్షత నిర్వహించన మహాసభలకు ఎం.సాయిబాబా హాజరై హాజరై మాట్లాడారు. నేడు దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ కారు చౌకగా అమ్మేస్తూ నష్టాల పేరుతో ఉన్నటువంటి సంస్థలను మూసి వేస్తూ లాభాలు వచ్చే సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారని తెలిపారు. అంతేకాదు, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో బొగ్గు పరిశ్రమల్లో కూడా ప్రభుత్వ రంగ వాటాలను అమ్ముకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ తరుణంలో 11వ వేతన ఒప్పందం రెండేండ్లు లేటుగా జరిగిందన్నారు. దీనికి కారణం ప్రభుత్వం ప్రతేడాదిలా అగ్రిమెంట్ చేయాలని డీపీఈ గైడెన్స్ ఫాలో కావాలని ఈ కోణంలో చర్చలు జరగడంలో ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ విధానాలను మొదటి నుంచి సీఐటీయూ వ్యతిరేకిస్తూ ఐదు జాతీయ సంఘాలను కలుపుకొని ఈ ఒప్పందం పూర్తిస్థాయిలో జరిగిందన్నారు. గౌరవ అధ్యక్షులు పి రాజారావు మాట్లాడుతూ.. దేశంలో అనేక పోరాటాల ఫలితంగా 1973లో జాతీయకరణ చట్టం ద్వారా ప్రయివేటు పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగ సంస్థలుగా మారాయన్నారు. 1974 నుంచి ఒకటవ వేతనం ఒప్పందం ప్రారంభమైనప్పుడు 11వ వేతన ఒప్పందం పూర్తి స్థాయిలో చేసుకున్నామని, కానీ అదే ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 2017లో పెరగాల్సి నటువంటి వేతన ఒప్పందం నేటికీ జరగలేదన్నారు. అనేక పరిశ్రమల్లో వేతన ఒప్పందాల ఊసే లేదని, అందుకే ఈ వేతన ఒప్పందం దేశంలోని బొగ్గు గని కార్మికుల విజయం అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమయిన బొగ్గు పరిశ్రమలను కాపాడుకోవటం కోసం ఐక్య ఉద్యమాలను ఏర్పాటు చేసి కార్మికులను చైతన్యపరిచి పోరాట ఆందోళన కార్యక్రమాల్లో పాలుపంచుకునే విధంగా తీర్మానాలు చేస్తారన్నారు. అందుకు సింగరేణిలో పనిచేస్తున్నటువంటి కార్మికులు, కార్మిక కుటుంబాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్, వై.యాకయ్య సీఐటీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.కుమారస్వామి, ఏ.ముత్యం రావు, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.సారయ్య, ఎం.శ్రీనివాస్, మూడు డివిజన్ల నాయకులు ఉల్లి మొగిలి, డి కొమురయ్య కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

- పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి
- ఈదులగూడెంలో సమస్యలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, నిరుపేదలైన వారందరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెంను ఆయన సందర్శించారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని వీధుల్లోనూ కలియదిరుగుతూ సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వేసిన బోరింగులు, పైపులైన్లు తప్ప కొత్తగా ఇక్కడ అభివృద్ధి ఏం జరగలేదని విమర్శించారు. విస్తీర్ణానికి అనుగుణంగా మంచినీటి నల్లాలు కూడా వేయలేదన్నారు. కనీసం ప్రజలకు అవసరమైన రోడ్లు, సదుపాయాలు కల్పించలేని పరిస్థితిలో పాలకులు, అధికారులు ఉన్నారని విమర్శించారు. అధికారులు వెంటనే చొరవ తీసుకొని పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కనీస వసతులు లేకుండా ప్రజలు అద్దె ఇండ్లలో అద్దెకట్టలేక అనేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని, అట్లాగే అర్హులైన వారికి పెన్షన్ ఇవ్వాలని, తెల్ల రేషన్‌కార్డు ఇవ్వాలన్నారు. ఈ విషయాలపై అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికర్ మల్లేశ్, వన్‌టౌన్ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రెమడాల పరశు రాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు గాయం రమణారెడ్డి, గాయం వీరారెడ్డి, బొల్లెంపల్లి పాపారావు, పాషా, మహిళ నాయకులు సూదిని కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలోనే మత్స్యకారుల అభివృద్ధి



- కేంద్ర పాడి, మత్స్యపరిశ్రమల శాఖ మంత్రి పురుషోత్తం

నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రధానమంత్రి మోడీ పాలనలోనే మత్స్యకారుల అభివృద్ధి జరిగిందని కేంద్ర పాడి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన సిద్దిపేటలో పర్యటించారు. రైస్ మిల్ అసోషియేషన్‌లో మత్స్యకారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.20వేల కోట్లతో పథకం ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. మత్స్య శాఖలో సౌకర్యాల కల్పన కోసం అదనంగా రూ.8 వేల కోట్లను కేటాయించారన్నారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం మాదిరి ప్రధాని మోడీ నీలి విప్లవానికి శ్రీకారం చుట్టి రూ.4 వేల కోట్లు కేటాయించారన్నారు. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో మత్స్య శాఖకు రూ.6 వేల కోట్లు కేటాయించారన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు మాదిరి మత్స్యకారులకు క్రెడిట్ కార్డు అందజేయనున్నట్టు తెలిపారు. వాటి ద్వారా ఎలాంటి సెక్యురిటీ లేకుండా రూ.1.60 లక్షల వరకు 4 శాతం వడ్డీతో అందజేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరుపున నాణ్యమైన చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు. దీనికి మత్స్యకార మహిళల కోసం, మత్స్య వ్యాపారం అభ్యున్నతి కోసం ఏ కార్యక్రమం అమలు చేయాలో ప్రాజెక్టు రూపొందించి అందజేస్తే కేంద్ర ప్రభుత్వం తరపున అమలు చేస్తానని హామీ నిచ్చారు. ఉదయం ఐదో వార్డులో ఓ కార్యకర్త ఇంట్లో టిఫిన్ చేయగా, బోయిగల్లిలోని గుండబోయిన కృష్ణ నివాసంలో కేంద్ర మంత్రి సహ పంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి, నాయకులు కొత్తపల్లి వేణుగోపాల్, ఉపేందర్ రావు, వంగ రామచంద్రారెడ్డి, సొప్పదండి విద్యాసాగర్, గుండ్ల జనార్ధన్, తోడుపూరి వెంకటేశం, మల్లేషం, బైరి శంకర్ పాల్గొన్నారు.

కార్మికులకు 'బలవంతపు' సెలవులు

సంక్షోభంలో సూరత్ వజ్రాల వ్యాపారం





సూరత్ : భారత వజ్రాల వ్యాపారానికి కేంద్రంగా ఉన్న సూరత్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా అశాంతే. వజ్రాన్ని తయారు చేసి, ప్రాసెస్ చేసి, పాలిష్ పట్టే పలు కంపెనీలు ఇప్పుడు తమ వద్ద పనిచేస్తున్న కార్మికులను రెండు వారాల 'సెలవు'పై పంపాయి. సెలవు కాలంలో వారికి ఎలాంటి వేతనాలు లభించవు. ఈ నెల రెండో వారం నుంచి ఈ 'బలవంతపు' సెలవులు మొదలయ్యాయి. మనకు ముడి వజ్రాలు ఆఫ్రికా నుంచి దిగుమతి అవుతాయి. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ముడి వజ్రాలు రాకపోవడంతో సూరత్‌లోని 20 శాతం కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేసి కార్మికులను సెలవుపై పంపాయి. సాధారణంగా సూరత్‌లోని వజ్రాల కంపెనీలలో దీపావళి పండుగకు, వేసవిలో సెలవులు ఇస్తారు. దీపావళికి 15-30 రోజులు, వేసవిలో 7-10 రోజుల సెలవు దొరుకుతుంది. కొన్ని కంపెనీలు మార్కెట్ పరిస్థితులు సరిగా లేకపోతే సెలవులు ఇస్తాయి. ఇప్పుడు ఆందోళన కలిగించే విషయం ఏమంటే సెలవులు ఇస్తున్న యూనిట్ల సంఖ్య అధికంగా ఉండటమే.

సూరత్‌లోని వజ్రాల వ్యాపారం ప్రపంచంలోనే పెద్దది. మన దేశం నుంచి జరిగే వజ్రాల ఎగుమతులలో 90 శాతం, ప్రపంచ పాలిష్ వజ్రాల ఎగుమతులలో 80 శాతం ఇక్కడ నుంచే జరుగుతాయి. అయితే వాణిజ్య పోటీ, కరెన్సీ ఒడిదుడుకులు, పర్యావరణ అంశాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి పలు కారణాల వల్ల గత కొన్ని సంవత్సరాలుగా వజ్రాల వ్యాపారం పలు సవాళ్లు ఎదుర్కొంటోంది. సూరత్‌లో 5,600 వజ్రాల కంపెనీలు ఉన్నాయి. వీటిలో ఏడున్నర లక్షల మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం 200 కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయని గుజరాత్ వజ్రాల కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు భవేష్ టాంక్ చెప్పారు. దీంతో సుమారు మూడు లక్షల మంది కార్మికులపై ప్రభావం పడిందని తెలిపారు. తరచుగా సెలవులు ప్రకటించడం, సామాజిక భద్రత లేకపోవడం వల్ల కార్మికులు అయోమయంలో ఉన్నారు. పైగా కొన్ని కంపెనీలు తమ పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వడంతో కార్మికుల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు తయారైంది. పైగా వజ్రాల పరిశ్రమ పూర్తిగా విదేశాలపై ఆధాపడి ఉంది. దీంతో ఇక్కడ కంపెనీల చేతిలో నియంత్రణ ఏమీ లేకుండా పోతోంది.

చైనాలో ఆర్థికాభివృద్ధి మందగించడం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి కారణాలతో స్థానిక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొంది. రష్యా నుంచి వజ్రపు రాళ్ల సరఫరా నెమ్మదించిందని, పైగా ఇప్పుడు అంతర్జాతీయంగా వజ్రాలకు డిమాండ్ లేకుండా పోయిందని కంపెనీల యజమానులు చెబుతున్నారు. అమెరికాలో బ్యాంకుల సంక్షోభం కూడా పరిస్థితిని మరింత దెబ్బతీసిందని వారు తెలిపారు. ఇలాంటప్పుడు కార్మికులకు సెలవులు ఇవ్వడం మినహా చేసేదేమీ లేదని అన్నారు. కొన్ని కంపెనీలు మాత్రం కార్మికులకు సగం వేతనం ఇస్తూ ఎలాగొలా నెట్టుకొస్తున్నాయి.

ఏపీలో బీఆర్ఎస్ ప్రధానకార్యాలయం

- గుంటూరులో ప్రారంభోత్సవం చేసిన ఆ పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు తోట చంద్రశేఖర్



గుంటూరు: గుంటూరులో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధిలోకి తీసుకెళ్లారని కొనియాడారు. దేశంలో బీజేపీని ఎదుర్కోగల నేత కేసీఆర్ మాత్రమేనన్నారు.ఏపీ ప్రజలు టీడీపీ, వైసీపీ పాలనతో విసిగిపోయారన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీలు కక్షలు, కార్పణ్యాలతో రాజకీయాలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఏపీ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. మోడీని ప్రశ్నించే దమ్ము వైసీపీ, టీడీపీలకు లేదన్నారు. ఇక్కడి పార్టీలు మోడీకి గులాంగిరీ చేస్తున్నాయన్నారు. దక్షిణ భారత దేశంలో ప్రధాని కాగల నాయకుడు కేసీఆర్ మాత్రమేనని ఆయన అన్నారు.

నలుగురిని బలిగొన్న అతివేగం

- జాతీయ రహదారి 44 రక్తసిక్తం



నవతెలంగాణ - నార్సింగి

వాహన చోదకుల అతివేగం.. అజాగ్రత్త పలువురిని బలి తీసుకుంటున్న సంఘటనలు జాతీయ రహదారి 44పై కలవరపెడుతున్నాయి. ఒక దుర్ఘటన మారవకముందే మరొకటి జరుగుతోంది. అన్ని సంఘటనల్లో అతివేగం, నిర్లక్ష్యమే కనిపిస్తున్నాయి. మెదక్ జిల్లా నార్సింగి మండల శివారు గ్రామమైన వల్లూరు సమీపంలో ఆదివారం ఉదయం 7.30 ప్రాంతంలో ఆటోను కారు ఢీకొన్న దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకరికి స్వల్పంగా గాయాలయ్యాయి.నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామం నుంచి గజ్వేల్ మండలం జగదేవపూర్‌లో బంధువుల దశదినకర్మకు జాతీయ రహదారిపై ఆటోలో ప్రయాణిస్తుండగా, వల్లూరు గ్రామ శివారుకు సమీపంలో వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. వేగంగా ఢీకొట్టడంతో ఆటో రోడ్డు పక్కకు ఎగిరి పడటంతో వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇప్ప శేఖర్(45), ఇప్ప యశ్వంత్(9), గుంటక బాల నరసయ్య(70), గుంటక మణెమ్మ(62) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అవినాష్‌కు స్వల్ప గాయాలు కాగా, కవిత తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉంది. పోలీసులు వారిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం చేర్పించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగి ఎస్ఐ నర్సింలు తెలిపారు.

దళిత బంధు అక్రమాలను
ఎత్తి చూపితే తప్పేంటి?

- అడ్వకేట్ ఉపేందర్‌పై దాడి అమానుషం : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత బంధు అక్రమాలను ఎత్తిచూపినందుకే అడ్వకేట్ ఉపేందర్‌పై అమానుషంగా బీఆర్ఎస్ గుండాలు దాడి చేశారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'బీఆర్ఎస్' అంటే 'బంధిపోట్ల-రాష్ట్ర-సమితి' అని పేర్కొన్నారు. నడిరోడ్డుపై దళిత న్యాయవాది కారు అద్దాలు పగలగొట్టి బీఆర్ఎస్ సంస్కారాన్ని ప్రదర్శించుకున్నారని విమర్శించారు.దళితుల హక్కుల కోసం వైఎస్ఆర్‌టీపీ పోరాడుతున్నదని తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- పీవైఎల్, పీఓడబ్ల్యూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రేషన్ డీలర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీవైఎస్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె కాశీనాథ్,కెఎస్ ప్రదీఫ్, డి స్వరూప,సిహెచ్ శిరోమణి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ముందు డీలర్ల సంఘాలుంచిన 11 డిమాండ్ల పరిష్కారం కోసం జూన్ 5 నుంచి సమ్మె చేస్తున్నట్టు ప్రకటించారనీ , దీనికి మద్దతు తాము ప్రకటిస్తున్నామని తెలిపారు.

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (సివిల్ ఇంజినీరింగ్) ఆన్‌లైన్ నియామక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 1,180 ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన ఈ పరీక్షల్లో పేపర్ వన్‌కు 13,405 (60.44 శాతం), 13,343 (60.17 శాతం) మంది హాజరయినట్టు టీఎస్‌పీఎస్సీ డిప్యూటీ సెక్రెటరీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉక్రెయిన్‌కు ఎఫ్-16లపై
రష్యా మండిపాటు



మాస్కో : ఉక్రెయిన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాలు అందచేయాలనే పశ్చిమ దేశాల నిర్ణయంపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉక్రెయిన్-రష్యా మధ్య సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయాలనే పశ్చిమ దేశాల కుట్రను ఈ నిర్ణయం మరోసారి వెల్లడిస్తుందని రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి అలెగ్జాండర్ గ్రుష్కో విమర్శించారు. ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాల సహాయం ఎంత ఉన్నప్పటికీ, ఉక్రెయిన్‌లో సైనిక చర్యకు సంబంధించి రష్యా తన లక్ష్యాలను సాధించడానికి అవసరమైన అన్ని మార్గాలను కలిగి ఉందని గ్రుష్కో తెలిపారు. ఉక్రెయిన్‌కు ఎఫ్-16లు అందించడంపై ఇటీవల అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ మాట్లాడుతూ 'ఎఫ్-16 వంటి అధునాత యుద్ధ విమానాలపై ఉక్రెయిన్ పైలట్లకు శిక్షణ ఇచ్చే ఉమ్మడి కార్యక్రమానికి వాషింగ్టన్ ఎప్పుడూ మద్దతు ఇస్తుంది' అని చెప్పారు. ఈ విమానాలను ఎప్పుడు సరఫరా చేయాలి, ఎన్ని చేయాలి అనే విషయంపై మా మిత్ర దేశాలతో కలిసి పని చేస్తామని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా స్పందిస్తూ అమెరికా తన సొంత లక్ష్యాలను సాధించుకోవడానికి 'నకిలీ మానవతా వాదం' ముసుగు వేసుకుందని విమర్శించారు.

నిల్వ నీడ లేదు..తాగేందుకు నీళ్లు లేవు..!

ఎండ తీవ్రతకు అల్లాడుతున్న 'ఉపాధి' కూలీలు

- కేంద్రం విధానంతో ఇబ్బందులు.
- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు
- మౌలిక వసతులపై దృష్టి సారించని యంత్రాంగం



నవతెలంగాణ-చివ్వెంల

వేసవి కావడంతో ఉపాధిహామీ కూలీలు ఎండల్లో మాడిపోతున్నారు. పని ప్రదేశాల్లో కాసేపు సేద తీరేందుకు నీడ.. తాగేందుకు నీళ్లు లేక.. కూలీలు అల్లాడుతున్నారు. కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైతే ప్రాథమిక వైద్యం కూడా అందని పరిస్థితి. ఇండ్ల నుంచే తాగునీరు పట్టుకెళ్లినా.. అవి అయిపోతే దప్పికతో ఇబ్బందులు పడాల్సిందే. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కూలీలు పని చేసే ప్రాంతాలవైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు. కొలతల్లో తేడాలుంటున్నాయని డబ్బుల్లో కోత విధిస్తున్న అధికారులు.. చట్టపరంగా వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై మాత్రం దృష్టి సారించడం లేదు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడుతున్నారు. కొందరు మృతి చెందుతున్న పరిస్థితీ ఉంది.

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల వ్యాప్తంగా 11 వేల పైచిలుకు ఉపాధికూలీలు ఉన్నారు. సుమారు 5 వేల మంది కూలీలు పని చేస్తున్నారు. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన నూతన నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం రెండు సార్లు కూలీల ఫొటోలు తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. అలా అయితేనే కూలీలకు రోజువారీ పూర్తివేతనం అందుతుంది. కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పని ప్రదేశంలోనే ఉండాల్సి వస్తోంది. ఆయా ప్రదేశాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్, ప్రాథమిక చికిత్స.. తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేకంగా మేట్లకు బాధ్యతలు అప్పగించేవారు. రెండేండ్ల కిందట కొంతవరకు ఈ సౌకర్యాలు బాగానే అమలైనా.. క్రమక్రమంగా ఈ చట్టానికి కేంద్రం నిధుల్లో కోతలు విధించుకుంటూ పోతుండటంతో సౌకర్యాలు కుంచించుకుపోతున్నాయి. పర్యవేక్షించాల్సిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పట్టించుకోకపోవడం.. ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించకపోవడం మూలంగా కూలీలు అవస్థలు పడుతున్నారు. పైగా మూడునెలలుగా కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కొందరికి బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింకు లేకపోవడంతో డబ్బులు చెల్లించడం లేదు.

పిట్టల్లా రాలుతున్న కూలీలు

రోజురోజుకు ఎండలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. 45 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో జనం ఇండ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. కానీ పేదలకు ఉపాధిహామీ పనులే ఆసరాగా నిలుస్తున్న ఫలితంగా ఎండ తీవ్రత ఉన్నప్పటికీ పనికి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఇప్పటి వరకు కేవలం చివ్వెంల మండలంలోనే సుమారు ఐదు నుంచి పది మంది వరకు వడదెబ్బ కారణంగా మృతి చెందారు. రెండురోజుల కిందట మోతెకు చెందిన సురేష్.. ఉపాధిహామీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి రాగానే అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఇప్పటికే ఆయా మండలాల్లో పలువురు మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఎండలో పనిచేస్తూ అనేక మంది అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్నా, మరణిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నిలిచిపోయిన అదనపు భత్యం..!

ఉపాధిహామీ పనుల కోసం అవసరమైన పరికరాలను ప్రభుత్వం ఇదివరకు సరఫరా చేసేది. గడ్డపారలు, పారలు, ఇనుప తట్టలు, గొడ్డళ్లు, కొడవళ్లను సైతం అందించేది. క్రమంగా వాటి సరఫరా నిలిపివేయడంతో కూలీలే సొంతంగా ఆయా పరికరాలను సమకూర్చుకుంటున్నారు. తాగునీటి కోసం గతంలో కూలీలకు రూ.5 చెల్లించేవారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల్లో పనిచేసే కూలీలకు 20శాతం అదనపు భత్యం కూడా చెల్లించేవారు. కానీ కేంద్రం ఇటీవల నూతన సవరణలు తీసుకొచ్చి ఈ రెండు ప్రయోజనాలను నిలిపివేసింది. దాంతో కనీస సౌకర్యాలు లేకపోవడం.. ప్రయోజనాలు దూరం కావడంతో కూలీలు సైతం పనులకు వెళ్లేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే ఉపాధి కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టేందుకు కారణమవుతోంది. ఉదయం పనులకు వెళ్తే సుమారు నాలుగు గంటలు ఎండలోనే పనిచేయాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, టెంట్, ప్రాథమిక చికిత్స పెట్టె.. లాంటి సౌకర్యాలు ఏమీ లేకపోవడంతో పనికి వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ వేతనాలను వెంటనే విడుదల చేయాలి. ఉపాధికూలీలకు వేసవి అలవెన్స్ కేటాయించాలి. పే స్లిప్పులివ్వాలి. పని ప్రదేశాల్లో టెంట్, ప్రథమ చికిత్స చేయటానికి సౌకర్యాలు కల్పించాలి. కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేయాలి.

వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి-మట్టిపల్లి సైదులు

త్వరలో పెండింగ్ బిల్లులు విడుదల



కేంద్రం ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ మార్చడంతో ఉపాధిహామీ అలవెన్స్‌లు రావడం లేదు. వేసవిలో పని ప్రదేశాల వద్ద ఉపాధి కూలీలు జాగ్రత్తగా ఉండాలి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పని పూర్తి చేసుకోవాలి. పెండింగ్ వేతనాలు త్వరలో విడుదలవుతాయి. సౌకర్యాలపై ఉన్నతాధికారులకు లేఖ రాస్తాం.

డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్

గ్రీన్ హైవే వద్దు.. బ్రౌన్ హైవే ముద్దు

- బైపాస్ వద్దంటూ రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

'గ్రీన్ హైవే వద్దు.. బ్రౌన్ హైవే ముద్దు' అంటూ జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం హాసకొత్తూర్ చౌరస్తా వద్ద 63వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ బైపాస్ రోడ్డు మార్గం ద్వారా వద్దని, ప్రస్తుతం ఉన్న ప్రతిపాదన ప్రకారమే రోడ్డు మార్గాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్ర రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇదివరకే రైల్వే లైన్, వరద కాలువ నిర్మాణం, పసుపు పరిశోధన స్థానం, హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం కాలువల కోసం, మండల కార్యాలయాల కోసం వందలాది ఎకరాల భూములు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిని బైపాస్ రోడ్డు మార్గం ద్వారా నిర్మాణం చేపడితే మరింత భూములు కోల్పోతామని ఆక్షేపించారు. ఈ భూములు పోవడం వల్ల జీవనాధారం కోల్పోతామని అన్నారు. మండల కేంద్రంలో వ్యాపారులు ఇప్పుడున్న రోడ్డు మార్గాన్ని వద్దని చెబుతూ, రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రతిపాదించిన అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మెన్ గడ్డం నర్సారెడ్డి, రైతులు వేముల గంగారం, సోంపేట రాజమల్లు, కొమ్ముల రాజా గంగారం, రెంజర్ల స్వామి, గడ్డం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారుల ఆర్థిక సహకారం రూ5లక్షలకు పెంచాలి

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వృత్తిదారులను ఆర్థికంగా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం ప్రకటించినందుకు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి రాజు నరేష్,పైళ్ల ఆశయ్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తర తరాలుగా సేవా వృత్తులను నమ్ముకొని లక్షలాది కుటుంబాలు చాకిరి చేస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు వీరి సంక్షేమాన్ని తగిన రీతిలో పట్టించుకోలేదని తెలిపారు.దీంతో వారు వెనుకబడి ఉన్నారని పలు ఆర్థిక సర్వేలు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహకారం లక్ష రూపాయలతో సరిపెట్టకుండా..ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్వారా ఉచిత విద్యుత్ పథకం, ఆధునిక ధోబీఘాట్‌ల నిర్మాణాలు, వృత్తిదారులకు ఉపాధికి అవకాశం కల్పించిందనీ, వీటితో పాటు రుణాలు ఇచ్చేందుకు విధివిధానాలు రూపొందించాలని కోరారు. వృత్తిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఐకేపీ వీవోఏల సమ్మెకు మద్దతుగా రేపు మండల కేంద్రాల్లో నిరసనలు

- సీఐటీయూ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 35 రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలకు మద్దతుగా మంగళవారం మండల కేంద్రాల్లో నిరసలను తెలపాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో భాగంగా ఉద్యోగులు రిలే దీక్షలు, నిరసనలు, వంటావార్పు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో సమ్మెలో ఉన్న ఉద్యోగులను అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొంది. ఆదివారం హైదరాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ. రమ, రాష్ట్ర కార్యదర్శి పి. శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్, కోటంరాజు, వై. సోమన్న తదితరులు విలేకర్లతో మాట్లాడారు. యూనియన్లకు అతీతంగా వీవోఏలు ఐక్యంగా సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామ సమాఖ్య సంపూర్ణ మద్దతునిస్తున్నాయని చెప్పారు. 19 ఏండ్లుగా పేదరిక నిర్మూలన పథకంలో ఉద్యోగులు కష్టపడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గౌరవ వేతనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.3,900 మాత్రమే చెల్లించి వారికి అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. సెర్ప్ అధికారులకు, ప్రభుత్వానికి పలు దఫాలుగా రాయబారాలు, విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలలో మూడు రోజులపాటు టోకెన్ సమ్మె చేసినప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. తక్కువ వేతనాలు, తీవ్ర పని భారం మోపిన నేపథ్యంలో అనివార్యంగా సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. న్యాయమైన డిమాండ్లను సానుభూతితో పరిష్కరించకపోగా రాష్ట్ర ప్రభుత్వమే ఈ ఉద్యోగులను సమ్మెలోకి నెట్టిందన్నారు. ఈ చట్టబద్ధ సమ్మె పట్ల సెర్ప్ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సమ్మెను విరమించాలంటూ అక్రమంగా నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పంచాయితీరాజ్ శాఖ మంత్రి చొరవ తీసుకొని సెర్ప్ ఉన్నతాధికారుల సమక్షంలో సమ్మె చేస్తున్న యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏలతోపాటు అన్ని రంగాల్లోని కార్మికులు ఈ నిరసనల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

డిమాండ్లు

- ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
- రూ. 10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి
- సెర్ప్ నుంచి ఐడి కార్డులు ఇవ్వాలి
- గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలి.
- జాబ్ చార్టులతో సంబంధం లేని ఆన్‌లైన్ పనులతో సహా ఇతర పనులు చేయించరాదు.
- వీవోఏల పైన మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలి
- ఎస్‌హెచ్‌జీ/ వీఏ లైన్ మీటింగ్స్ రద్దు చేయాలి
- అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్స్ కల్పించాలి.

జీవో 111పై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

- సీఎంకు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవో 111 ఎత్తివేతపై నిపుణులు, పర్యావరణవేత్తలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖరాశారు. 'ఎలాంటి పరిమితులు లేకుండా జీవో 111ను ఎత్తివేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీనిపై పర్యావరణవేత్తలు, ప్రజలలో తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి' అని తెలిపారు. ఈ జీవో ఎత్తివేత ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిధిలోనున్న లక్షల ఎకరాల పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని భావిస్తున్నారని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని అనేక ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీటిని, హైదరాబాద్‌కు త్రాగునీటిని అందిస్తున్నాయని గుర్తుచేశారు. అక్కడ నిర్మాణాలు చేపడితే జలశయాలు మురుగు నీటితో కలుషితం అయ్యే ప్రమాదం ఉన్నదని తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల నీటితో నింపుతామంటూ ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో .. సహజసిద్ధమైన పరివాహక జలాలతో కాకుండా ఇలా ఎత్తిపోయడం ద్వారా ఆయా జలాశయాలు సహజసిద్ధతత్వాన్నీ, పర్యావరణ సమతూల్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన.. తెలంగాణ బాలోత్సవ సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మే 5వ తేదీ నుంచి 21 వరకు 16 రోజుల పాటు నిర్వహించిన బాలోత్సవం ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు సమ్మర్ హాలిడేస్‌ను ఆనందించడమే కాకుండా అర్థవంతంగా మార్చుకున్నారని తెలిపారు. కొత్త కొత్త ఆలోచనలతో, కొత్త స్నేహితులతో సరికొత్త నైపుణ్యాలను నేర్చుకున్నట్టు చెప్పారు. మరి ముఖ్యంగా అమ్మాయిల్లో మనోధైర్యంతో పాటు ప్రశ్నించేతత్వాన్ని నేర్చారన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త కేఎల్ కాంతారావు మాట్లాడుతూ.. పిల్లల్లో మూఢనమ్మకాలు, సైన్స్‌పై అవగాహన అద్భుతంగా ఉందన్నారు. బాలల్లో దేశభక్తి పెంపొందించుకోవడం కోసం, విజ్ఞానం, వికాసం కోసం ఈ సమ్మర్ క్యాంప్ ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. తెలంగాణ బాలోత్సవం భావి భారత పౌరుల సమస్యలను బాధ్యతగా పట్టించుకుందని కొనియాడారు. పిల్లల కంటే ప్రపంచంలో మరేదీ విలువైంది లేదని చెప్పారు. బాలలే భావి భారత పౌరులని, బాల్యాన్ని సక్రమంగా వినియోగిస్తే దేశాన్ని బంగారు మయం చేయొచ్చు అని తెలిపారు. దీనికి తల్లిదండ్రులు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భూమిక మాసపత్రిక ఎడిటర్ కొండవీటి సత్యవతి, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎస్ సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, మమత, సుశీల, దూది పద్మావతి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది యుగంధర్‌ను ఫోన్లో పరామర్శించిన రేవంత్

- కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకుల దాడిలోగాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాది యుగంధర్‌ను టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం ఫోన్లో పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందనీ, భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆదివారం ఉప్పల్‌లో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, అధికార ప్రతినిధి సుధీర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రేవంత్‌తో మాట్లాడించారు.తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన న్యాయవాది యుగంధర్‌ను చంపేస్తామని బెదిరించి, దాడి చేశారని తెలిపారు. నడిరోడ్డు మీద కారు ఆపి పట్టపగలు దౌర్జన్యం చేసి తీవ్రంగా కొట్టారనీ, మరోసారి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను విమర్శిస్తే హతమారుస్తామని బెదిరించారంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అరాచకాలపై పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. సీఎం కేసీఆర్ తన ఎమ్మెల్యేలను అదుపులో పెట్టుకోవాలని కోరారు.

తూకం ఎక్కువేస్తున్నారని అడిగినందుకు..

వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతుపై దాడి



నవతెలంగాణ- మల్లాపూర్

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం నడికూడ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎక్కువ తూకం వేస్తున్నారని, హమాలీ చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన రైతు అప్పం చిన్నారెడ్డి ప్రశ్నించాడు. దాంతో కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న వ్యక్తి చిన్నారెడ్డిపై దాడి చేశాడు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ వడ్లు తూకం వేయడానికి ఎన్నో రోజులుగా ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో హమాలీ చార్జీలు క్వింటాకు రూ.40 రైతుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ఎక్కువ తూకం, హమాలీ చార్జీలు ఎందుకు ఎక్కువ వసూలు చేస్తున్నారని ప్రశ్నించగా తనపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ రైతులు విమర్శిస్తున్నారు. గాయపడిన చిన్నారెడ్డిని మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. రైతు చిన్నారెడ్డి వడ్ల కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సీఎం కేసీఆర్ ఆకాంక్ష నెరవేరాలి : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద స్థానాలు గెలవాలనే కేసీఆర్ ఆకాంక్ష నెరవేరాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ తిరుమల శ్రీవారిని వేడుకున్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటలో తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు.

మతతత్వ శక్తులకు గుణపాఠం

- "కర్నాటక ఎన్నికలు- పాటలు"పై రౌండ్ టేబుల్ సమావేశంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



నవతెలంగాణ-బంజరాహిల్స్

కర్నాటక ఎన్నికలు మతతత్వ శక్తులకు ఒక పెద్ద గుణపాఠం చెప్పాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. "కర్నాటక ఎన్నికలు - పాటలు" అనే అంశంపై హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజల పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. మతతత్వం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొడుతూ ఇతర మతస్థుల్లో, సమాజంలో తీవ్ర అశాంతి, అభద్రత రెచ్చగొట్టి, పాలన కొనసాగించాలనే విధానాలకు కర్నాటక ఎన్నికలు పాతిపెట్టాయని తెలిపారు. మతం పేరిట మెజారిటీ మతస్తుల్ని సమీకరించి పెట్టుబడిదారీ విధానాన్ని ఉద్ధరించే పాలనను తిరస్కరించారన్నారు. ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. కర్నాటక ప్రజలు బీజేపీకి ఎలాంటి బుద్ధి చెప్పారో, తెలంగాణలో ఇటు బీజేపీ, అటు తెలంగాణ ప్రజలకు అన్ని విధాల వ్యతిరేకంగా మారిన బీఆర్ఎస్ పార్టీకి కూడా అలాంటి బుద్ధి చెప్పాలన్నారు. ఆ రెండు పార్టీలు ప్రభుత్వ ఖజానాను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. మిగతా పాలక పార్టీలకు కూడా అవ లక్షణాలు ఉన్నాయని.. అయితే దేశంలో ప్రజల కర్తవ్యం తక్షణం బీజేపీని ఓడించడం అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షులు మురళీధర్, వివిధ పార్టీల నాయకులు సదేరా బేగం, రమ్యా రావు, వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, మైనార్టీ, ప్రగతిశీల పెద్దలు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాగితాలకే పరిమితమైన ఎన్నికలు

నామినేటెడ్ సభ్యులతోనే కాలం వెళ్లదీత

- న్యాయస్థానాలను ఆశ్రయించిన డాక్టర్లు, నర్సుల సంఘాలు
- మెడికల్, నర్సింగ్, డెంటల్ కౌన్సిల్లలోప్రాతినిథ్యం కోసం పోరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"మా వృత్తికి సంబంధించిన అవగాహన, పరిష్కరించే చిత్తశుద్ధి ఉన్న ప్రాతినిథ్యం లేకపోవడమే ఇందుకు కారణం. మా కోసం ప్రత్యేకంగా కౌన్సిళ్లు (తెలంగాణ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్, తెలంగాణ డెంటల్ కౌన్సిల్) ఉన్నప్పటికీ కేవలం నామినేటెడ్ చైర్మెన్, సభ్యులతోనే వాటిని సుదీర్ఘకాలం కొనసాగిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ పరిస్థితి మారాలి. నిబంధనల మేరకు ఆయా కౌన్సిళ్లకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలి. అప్పుడే ఆయా కౌన్సిళ్లలో మాసమస్యలపై చర్చ జరుగుతుంది. పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది.... " రాష్ట్రంలో మెడికల్ డాక్టర్లు, నర్సులు, డెంటల్ డాక్టర్లు సుదీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్ ఇది"తెలంగాణ మెడికల్ కౌన్సిల్ " డాక్టర్ల రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రజలకు శాస్త్రీయ వైద్యం అందించేందుకు ఉద్దేశించినది. దీనికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. నిబంధనల ప్రకారం 13 మందిని ప్రతి ఐదేండ్లకు ఒకసారి ఎన్నుకోవాల్సి ఉంటుంది. కానీ 2007 తర్వాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2019లో హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) హైకోర్టును ఆశ్రయించింది. 2021లో అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ విభజన సమయంలో 13 మంది స్థానంలో ఐదుగురికే అని నిబంధనల్లో చేర్చడంతో దానిపై తిరిగి కోర్టును ఆశ్రయించగా, 13 మందికి అవకాశమిస్తూ తీర్పునిచ్చింది. అయిన ఎన్నికలు జరిగింది లేదు. కేసు సుప్రీంకోర్టు వరకెళ్లగా తాజాగా మూడు నెలల్లో కౌన్సిల్ సభ్యుల ఎన్నిక కోసం పోలింగ్ నిర్వహించాలని తీర్పునిచ్చింది. రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది వరకు ఉన్న రిజిస్టర్డ్ డాక్టర్లు 13 మందిని ఎన్నుకోవాల్సి ఉంటుంది.తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ పరిస్థితీ ఇందుకు భిన్నంగా ఏమి లేదు. 1964లో ప్రత్యేక చట్టం ద్వారా కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నర్సులు తమ తరపున గొంతు విప్పేవారిని ఎన్నుకునే హక్కు కలిగి ఉన్నారు. అయితే 52 సంవత్సరాలైనా ఇంత వరకు ఒక్కసారి కూడా ఎన్నికలు నిర్వహించకపోవడం గమనార్హం. కేవలం ఆ హక్కు కాగితాలకే పరిమితమైంది. దీంతో నర్సింగ్ సంఘాలు పలుమార్లు ఎన్నికలు నిర్వహించాలని వినతిపత్రాలు సమర్పించాయి. తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. కౌన్సిల్‌లో 21 మంది సభ్యులు, వివిధ కమిటీలుంటాయి. ఇందులో నర్సులు మాత్రమే ఎన్నుకోవాల్సిన ఐదుగురిని మినహాయించి ప్రభుత్వ ఉద్యోగస్తులు ఉండే 16 మందిని మాత్రం ఎన్నుకుంటున్నారు. రాష్ట్రంలో దాదాపు లక్ష మంది నర్సులుండగా, ప్రతి ఏడాది ఎనిమిది వేల మంది వరకు ఉత్తీర్ణులై వస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడానికి తమ తరపున ప్రాతినిథ్యం లేకపోవడమే కారణమనీ, ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని నర్సింగ్ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

డెంటిస్ట్ యాక్ట్ 1948లో రూపొందిస్తే 2019 ఆగస్టు తొమ్మిదిన తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ఏర్పాటైంది. అయితే ఈ కౌన్సిల్‌లో ఎనిమిది మందిని డెంటల్ డాక్టర్లు ఎన్నుకోవాల్సి ఉన్నది. ఇప్పటికే రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అక్కడి డెంటల్ కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలో 10 వేల మందికి పైగా డెంటల్ డాక్టర్లున్నారు. నిరుద్యోగం, చిన్నపాటి క్లినిక్‌లతో నెట్టుకొస్తూ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వేసిన లక్ష ఉద్యోగాల్లో కేవలం 32 డెంటల్ పోస్టులను మాత్రమే ప్రకటించడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.వీటికి తోడు డెంటల్ విద్యార్థుల సమస్యలు.....పరిష్కారం కోసం మాట్లాడేందుకు తమ తరపున ప్రాతినిథ్యం వహించే వారుండాలని కోరుకుంటున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. తమ వృత్తిలో ఉండి, తమ చేత ఎన్నుకోబడిన వారు కౌన్సిళ్లలో ఉంటే తప్ప న్యాయం జరగదని భావిస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుకుంటున్నారు.

పనుల్లో వేగం పెరగాలి

- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై మంత్రి వేముల సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్‌లో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు, హైదరాబాద్ నలువైపులా నిర్మించనున్న ఆస్పత్రుల పనుల్లో వేగం పెంటాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బి కార్యాలయంలో అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్‌లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్ సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నమూనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. జూన్ 22న తాను వరంగల్ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించనున్నట్టు తెలిపారు. ఎల్బీనగర్‌లో వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను ఈనెల 26 వరకు ప్రారంభించాలని అధికారులకు, వర్క్ ఏజెన్సీకి మంత్రి స్పష్టం చేశారు. ఆ లోపు అన్ని రకాల టెక్నికల్ అంశాలు పూర్తి చేసుకోవాలనీ, 26న సైట్ విజిట్ చేసి వర్క్ ప్రోగ్రెస్ పరిశీలిస్తానని చెప్పారు. అల్వాల్‌లో 1200 పడకల ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను మొదలు పెట్టాలని వర్క్ ఏజెన్సీకి సూచించారు. ఈనెల 29 న అల్వాల్, సనత్‌నగర్ హాస్పిటల్స్ నిర్మాణ సైట్‌లను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని మంత్రి చెప్పారు.

బాల సాహిత్యానికి బడులే తావులు...!

బాలలకు మన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను వారసత్వంగా అందించేది బాల సాహిత్యమే. వేల ఏండ్ల కిందటి నుంచే తెలుగు నెలలో మౌఖికం ద్వారా బాల సాహిత్యం విలసిల్లింది. చాలామంది ప్రాచీన, ఆధునిక కవులు తమ బాల్యం నుండే రచనలు ప్రారంభించారు. పసి హృదయాలలో బాల సాహిత్యం ద్వారానే విజ్ఞాన బీజాలు మొలకెత్తుతాయి. భాషా పరిజ్ఞానం పెరుగుతుంది. తద్వారా అనేకమంది పిల్లలు తమ ఊహాశక్తికి పదును పెడుతూ రచనలు చేయడం జరుగుతుంది. ఇది బాల సాహిత్యంలో విప్లవాత్మకమైన పరిణామం. ఇదో నూతన వరవడిగా భావించవచ్చు.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, 9441561655

నేడు మన బడి పిల్లలు కవులుగా, రచయితలుగా పుస్తకాల రూపంలో అచ్చవుతున్నారు. బాల్యం నుండే బాల బాలికలలో బాల సాహిత్యం పట్ల అభిరుచిని కలిగించినట్లయితే భవిష్యత్తులో మంచి నడవడిక గల పౌరులుగా ఎదుగుతారనడంలో ఎలాంటి అనుమానం లేదు. అందుకుగాను పాఠశాలలే బాల సాహిత్యానికి కేంద్ర బిందువులవ్వాలి. బడిని కేంద్రంగా చేసుకొని బాల సాహిత్యం విస్తృతంగా సృజన జరిగి తీరాలి. అందుకుగాను పాఠశాల గ్రంథాలయాలు, బాలసభలు, బాల కవి సమ్మేళనాలు ప్రముఖ పాత్ర వహించాలి. అప్పుడే విద్యార్థుల్లో భాషాభిమానం పెరుగుతుంది.

సాహిత్యమే దోహదపడుతుంది

బాల సాహిత్యం రాస్తే ఏమొస్తది? అనే భావన ఇప్పటికీ సమాజంలో, చాలామంది ఉపాధ్యాయులలో నాటుకుని ఉంది. ఇది సరైన భావన కాదు. మంచి సమాజం రాణించాలన్నా విలువలు గల వ్యక్తులుగా ఎదగాలన్నా బాల సాహిత్యం అందుకు ఎంతగానో దోహదపడుతుంది. బడినే కేంద్రంగా చేసుకొని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో కృషి జరిగినప్పుడే బాల సాహిత్యం వర్ధిల్లగలదు. అందుచేత పాఠశాలలే వేదికలుగా, పాఠశాల విద్యా కమిటీ, సాహిత్యోపాధ్యా యులు, భాషో పాధ్యాయులు, బాల సాహితీవేత్తలు ముఖ్య భూమిక పోషించాలి.

జ్ఞానాన్ని పెంచే విధంగా

పిల్లల కోసం బాల సాహిత్యం ఎలా ఉండాలి? అని ఆలోచించాలి. పిల్లల తరగతి, వారి మానసిక, శారీరక పరిస్థితులు, అవగాహన స్థాయిలను పరిగణలోకి తీసుకుని వారికి జ్ఞానాన్ని పెంచే విధంగా రచనలు సాగాలి. పిల్లలు పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకూడదు. అలా విద్యార్థులను ఉపాధ్యా యులు పరిమితం చేయకూడదు. బాల సాహిత్యంలో ప్రక్రియలకు బొమ్మలు కూడా తగ్గట్టుగా ఉండాలి. భావ సౌందర్యం ఉట్టిపడేలా, పిల్లల హృదయాలు స్పందించేలా రచనలు జరగాలి. కథలు తక్కువ మాటల్లో నిడివి కలిగి ఉండాలి. విరివిగా రాసినంత మాత్రాన బాల సాహితీవేత్తలు కాలేరు. కొత్త ఆలోచనలతో సృజనాత్మకంగా రాసిన వాళ్లే రచయితలుగా నిలబడతారని గ్రహించాలి.

తెలుగు బాల సాహిత్యంలో చక్రపాణిని ఆద్యుడిగా చెప్పుకోవచ్చు. అతి తక్కువ ధరతో చిన్న పుస్తకాలను ముద్రించి ఆ రోజుల్లో అమ్మేవాడు. అయితే నేటి జనరేషన్‌కు తగ్గ కథలు రాసే రచయితలు తక్కువగా ఉండడం కొంత బాధగానే అనిపిస్తుంది. అవార్డుల కోసమే, పేరు కోసమే రాసే వాళ్ళు ఎక్కువగా ఉన్నారు. అమెరికా లాంటి దేశాలలో కూడా స్కూళ్లలో పిల్లలు పుస్తకాలు చదవడానికి ఎక్కువ ప్రధాన్యం ఇస్తున్నారు. కానీ అదే మన పాఠశాలల్లో అయితే పాఠ్య పుస్తకాలు, కథల పుస్తకాలు చించుతారని కొన్నిచోట్ల గ్రంథాలయాల్లోని పుస్తకాలు పిల్లలకు ఇవ్వకుండా నిరాకరిస్తున్నారు. దయ, కరుణ, ప్రేమ, స్నేహం, కలివిడి స్వభావం, సమానత్వ భావన, ధైర్యం, నిజాయితీ లాంటి మౌలిక భావనలు కథల ద్వారా పిల్లలకు కలగాలి. చివరకు చెడు ఓడిపోతుందని, ధర్మమే గెలుస్తుందన్న భావన రావాలి. ప్రతి పాఠశాలలో డిజిటల్ టీవీలు ఉన్నందున యానిమేషన్‌తో కూడిన బాలసాహిత్య ప్రక్రియలను ఆయా చానల్స్ ద్వారా పిల్లలకు చూపించగలగాలి. బాల సాహిత్యం వల్ల పిల్లలలో విలువలే కాకుండా, తార్కికశక్తి, ఊహాజనిత శక్తి, శ్రవణ శక్తి, పఠణా నైపుణ్యం కలుగుతాయి. నేటి తరం పిల్లల్లో ఉన్న అనేక మానసిక రుగ్మతలకు బాల సాహిత్యం ఒక రకమైన ధైర్యాన్నిస్తుంది. ఇదంతా మాతృభాష ద్వారానే సాధ్యమని ప్రముఖ భాషావేత్త "నోమ్ చోమ్ స్కీ" చెప్పిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలి.

ప్రతిభను వెలికి తీయాలి

విద్య అనేది ఒక జ్ఞాన ప్రవంతి. విద్య ద్వారానే విజ్ఞానం సాధ్యమవుతుంది. అందుచేత ప్రతి ప్రక్రియకు, ప్రతి సందర్భానికి, ప్రతి పరిణామానికి గురు శిష్యులే మూలస్తంభాలు. ఈ దిశగా మనం ఆలోచించినప్పుడు అసలు బాలలంటే ఎవరు? పాఠశాలలు బాల సాహిత్యానికి ఏ విధంగా వేదికలుగా దోహద పడుతున్నాయి? అందులో ఉపాధ్యాయుల పాత్ర ఏ విధంగా ఉంటుందన్న విషయం పరిశీలించినట్లయితే, ధారణశక్తి, గ్రహణశక్తి ఉండి 18 ఏండ్ల లోపు పిల్లలందరూ బాలలుగా పరిగణించవచ్చు. అట్టి బాలలు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో, సాన్నిత్యంలో అధ్యయనం చేయ పడతారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయబడే వారు ఉపాధ్యాయులు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక రకంగా



ప్రతిభా ప్రక్రియ దాగి ఉంటుంది. కాకపోతే వాళ్లలో దాగి ఉన్న అంతర్గత శక్తులను ఉపాధ్యాయులు వెలికి తీయగలగాలి. పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉండే సృజన నైపుణ్యాన్ని తట్టి లేపాలి.

పిల్లల అభ్యసన అభివృద్ధి కొరకు

వాస్తవానికి తల్లే బాల సాహిత్యానికి తొలి రూపకర్త. ఆమెనే బాల సాహిత్యాన్ని పలకరించింది. లాలి పాటలు, జోల పాటల ద్వారా తొట్టెలలో తమ పిల్లలకు చిలకరించింది. ఆ తర్వాత భాషావేత్తలు అనేక మంది బాల సాహిత్య రంగంలో కర్తలుగా, సేకర్తలుగా పని చేశారు. చందమామ, జాబిల్లి, బాలమిత్ర, బాల భారతం లాంటి పుస్తకాలు బాల సాహిత్యాన్ని పండించాయి. బాల సాహిత్య వికాసం కొరకు విశేషంగా కృషి చేశాయి. ఆకాశవాణి కూడా "బాలానందం" పేరిట బాల సాహిత్యాన్ని పరిచయం చేసింది. అంతే కాకుండా బాలల అకాడమీ కూడా అద్భుతమైన కృషి కొనసాగించింది. అదేవిధంగా చాలా సంస్థలు, సాహితీ వేత్తలు, భాషాభిమానులు, ఉపాధ్యాయ లోకం పిల్లల అభ్యసన అభివృద్ధి కొరకు దోహదపడే బాల సాహిత్యాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా బాల సాహిత్యం కొంతమేరకు జిల్లాలవారీగా కృషి జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినంక నూతన పాఠ్యపుస్తకాల్లోనూ, హైదరాబాద్ లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ బాల సాహిత్యానికి పెద్దపీట వేశారు. అయినప్పటికీ బాల సాహిత్యం అనుకున్నంత స్థాయిలో పిల్లలకు చేరువవుత లేదనే విమర్శ కూడా ఉంది. అందుకు పాఠశాలలు, ఉపాధ్యాయులు ఇంకా బాధ్యతగా వ్యవహరించాలి.

> **బాల సాహిత్య అంశాన్ని బోధించిన తర్వాత ఆ ప్రక్రియకు సంబంధించిన విషయాన్ని సేకరింపజేయడం, రాయమనడం ద్వారా విద్యార్థుల్లో అంశం పట్ల ఆలోచన రేకెత్తించవచ్చు. విద్యార్థులు రాసిన, సేకరించిన అంశాలను ప్రదర్శింప జేయాలి. విద్యార్థులు రాసిన కథలు, కవితలు, గేయాలు, పద్యాలు, నాటికలు, చిత్రాలు, పుస్తక సమీక్షలు వంటి అంశాలను పత్రికలకు పంపడం గానీ, పుస్తక రూపంలో ముద్రితం చేయడం గానీ జరిగినప్పుడు విద్యార్థులు తమ రచనలను చూసి మురిసి పోతారు. మరింతగా ముందుకు వస్తారు.**

ఓర్పు, నేర్పు ఉండాలి

తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం బోధిస్తున్నప్పుడు పాఠ్యాంశాన్ని అన్వయం చేస్తూ సోదాహరణంగా బాల సాహిత్య ప్రక్రియపై అవగాహన కల్పించాలి. అందుకుగాను మొదట ఉపాధ్యాయులకు ఓర్పు, నేర్పు ఉండాలి. అప్పుడే విద్యార్థులకు ఆసక్తి కలుగుతుంది. బాల సాహిత్య అంశాన్ని బోధించిన తర్వాత ఆ ప్రక్రియకు సంబంధించిన విషయాన్ని సేకరింపజేయడం, రాయమనడం ద్వారా విద్యార్థుల్లో అంశం పట్ల ఆలోచన రేకెత్తించవచ్చు. విద్యార్థులు రాసిన, సేకరించిన అంశాలను ప్రదర్శింప జేయాలి. విద్యార్థులు రాసిన కథలు, కవితలు, గేయాలు, పద్యాలు, నాటికలు, చిత్రాలు, పుస్తక సమీక్షలు వంటి అంశా లను పత్రికలకు పంపడం గానీ, పుస్తక రూపంలో ముద్రితం చేయడం గానీ జరిగినప్పుడు విద్యార్థులు తమ రచనలను చూసి మురిసిపోతారు. మరింతగా ముందుకు వస్తారు. బాల సాహిత్యం అన్నప్పుడు భాష పైన, భావం పైన ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి. విద్యార్థుల్లో ఊహాశక్తిని పెంపొందిం చాలి. పూర్తి స్వేచ్ఛనిచ్చి, అవకాశాలు కల్పిస్తే విద్యార్థులు అద్భుతంగా రాణిస్తారు.

సృజన దిశగా కృషి జరగాలి

పిల్లలే స్వతహాగా తమ భావాలని అక్షర రూపంలో వ్యక్తపరిస్తే, ఉపాధ్యాయులుగా వారిని సరైన పద్ధతిలో పయనించేలా చేయడం భాషాభిమానుల, బాషో పాధ్యాయుల ముఖ్యమైన బాధ్యత. బాల సాహిత్యం పరిఢవిల్లాలంటే సాహిత్యాభిమానులైన ఉపాధ్యాయులుంటే సరిపోదు. దానికి తోడు పాఠశాలల్లో ఇతర ఉపాధ్యాయుల సహకారం, ప్రధానోపాధ్యాయుల ప్రోత్సాహం తప్పకుండా ఉండాలి. పాఠశాల గ్రంథాల యంలోని పుస్తకాలు వినియోగించే పద్ధతిలో పాఠశాల ఉండి తీరాలి. కాల నిర్ణయ పట్టికలో లైబ్రరీ పీరియడ్ కచ్చితంగా ఉండడమే కాకుండా ప్రతిరోజూ అమలయ్యేలా చూడాలి. పుస్తకాలచే పిల్లలను ఆస్వాదింప చేయాలి. ఆనందింప చేయాలి. సృజన దిశగా పాఠశాల కృషి జరగాలి. బాల సాహిత్య వికాసానికి పాఠశాలలే ముఖ్యమైన తావు లుగా మారాలి. అవి నిరంతరం వికాస కేంద్రాలుగా రూపొందించబడాలి. అప్పుడే బాల సాహిత్యం పట్ల ప్రేరణ కలిగి బాలలకు ఆసక్తి కలుగుద్ది.

(ఈ నెల 24, 25 తేదీలలో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే బాల సాహిత్య సమ్మేళనం సందర్భంగా....)



మనోమథనం

ఒక విషయాన్ని తన కోణం నుండే చూడడం
అర్థం చేసుకోవడం
ఆలోచించడం
నిర్ణయం తీసుకోవడం
అన్నీ వ్యక్తి తనవైపు నుండే చేసేస్తూ భుజాలెగరేస్తుంటాడు
తాను అనుకునే న్యాయాన్ని
త్రాసులో తూకం వేసి
తనను తానే న్యాయదేవత వారసుడనుకుంటాడు

ఒక్కోసారి తన కళ్లే అయినా
మోసం చేస్తుంటాయి
కొన్నిసార్లు తన చెవులే తికమక పడుతుంటాయి
అప్పుడప్పుడు మనసు తనదే కానీ
కలగాపులగమై ఉల్టాపల్టా అయితుంటది
చాలదన్నట్లు
చెప్పుడు మాటలు తోడు కూడా అవుతుంటాయి
చిటపటలు ప్రాణమూ పోసుకుంటాయి
అవి ఒక్కసారి పుట్టాయంటే
నష్టాలకు ఎర్రతివాచి పరిచినట్టే

ఎదుటి వ్యక్తి కోణం
సన్నివేశం, పరిస్థితి
వేటితోనూ ప్రమేయం లేనప్పుడు
సత్యం అసత్యమవుతుంది
అసత్యం సత్యమూ అవుతుంది
ఒక్కసారి తన అంతర్ నేత్రం నుండి
మనోమథనం చేస్తే
ఉల్లిపొరల్లా మనసు తెరలు విడిపోయి
అసలేమిటో తేటపడుతుంది

- ఉప్పల పద్మ, 9959126682

గాథ!

బొక్కల కోసం
కుక్కల అరుపుల ఆకలి..

చీకటి పుంజం
వెలుతురును మింగే
సంభోగ భ్రాంతి

వేళ్ళ భుజాలు మారే
సిగరెట్ శవం

దేహమే ఖేదభూమి

చిట్టచివరి చుక్కకు
పాటను తాపాక
ఈ తనువును చాలిస్తాను

నేను అమరున్నని
ఆమె ప్రకటిస్తుంది

- కొత్తపల్లి సురేష్

సాహితీ వార్తలు

'తానా' సిరివెన్నెల సాహితీ పురస్కారం

ఉత్తర అమెరికా తెలుగుసంఘం (తానా) సాహిత్య విభాగం, తానా ప్రపంచసాహిత్యవేదిక ఆధ్వర్యంలో ప్రముఖకవి, పద్మశ్రీ సిరివెన్నెల సీతారామ శాస్త్రి సంస్మరణలో తెలుగు పద్య కావ్యాలు / గేయ కావ్యాలలో పోటీలు నిర్వహించనున్నారు. ఎంపికైన విజేతకు లక్ష రూపాయల నగదు పురస్కారం ఉంటుంది. 1. సమకాలీన సామాజికసమస్యలు-పరిష్కారాలు; 2. మానవసంబంధాలు-కుటుంబ విలువలు; 3. ప్రకృతి-పర్యావరణం; 4. యువతరం-భవిష్యత్తు; 5. దేశభక్తి-జాతీయవాదం అంశాలలో ఏదైనా ఒక అంశం తీసుకుని పద్యకావ్యం లేదా గేయ కావ్యం 60 పేజీలకు (ఎ4 సైజులో) మించకుండా ఉండేలా పంపాలి. ఆసక్తి కలిగిన వారు మే 31, 2023లోగా tanasirivennela@gmail.com ఈమెయిల్ కు గాని +1-972-591-1208 నంబరుకు వాట్సాప్ గాని పంపవచ్చు. ఫలితాల ప్రకటన జూన్ 30, 2023 లోపు ఉంటుంది. వివరాలకు తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు - డా. ప్రసాద్ తోటకూరను +1-817-300-4747లో గాని, లేదా prasadthotakura@gmail.com ద్వారా గాని సంప్రదించవచ్చును.

సాహితీ కిరణం జాతీయ స్థాయి కవితల పోటీ

సాహితీ కిరణం ఆధ్వర్యంలో కవి, రచయిత నేమాన సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీలో గెలుపొందే ఆరు కవితలకు సమాన బహుమతులు రూ. 1000 చొప్పున అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు పోస్ట్ / కొరియర్ ద్వారా మే 31 లోగా నేమాన సుబ్రహ్మణ్యశాస్త్రి స్మారక జాతీయ కవితల పోటీ, ఎడిటర్, సాహితీ కిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం. 3, హైదరాబాద్ - 500102 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9490751681 నంబరు నందు సంప్రదించవచ్చు.

"నీటి గింజల పంట" ఆవిష్కరణ

కంచరాన భుజంగరావు కవితా సంపుటి "నీటి గింజల పంట" ఆవిష్కరణ శ్రీకాకుళంలోని గ్రాండ్ హోటల్‌లో మే 27 శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షతన కె. శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. జి లక్ష్మి నరసయ్య ముఖ్య అతిథిగా, పుప్పాల శ్రీరాం, అనిల్ డ్యాని సమీక్షకులుగా, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ తిరుమల చైతన్య, గంటేడ గౌరునాయుడు, కొప్పల భానుమూర్తి తదితరులు హాజరు కానున్నారు.

- సిక్కోలు బుక్ ట్రస్ట్, శ్రీకాకుళ సాహితి.

రిటైర్డ్ ఐ.జి రావులపాటి సీతారామారావుకు డా. రాళ్ళబండి కవితాప్రసాద్ పురస్కారం

సహృదయ సంస్థ ప్రముఖ ద్విశతావధాని, పరిపాలనదక్షుడు డా. రాళ్ళబండి కవితాప్రసాద్ స్మృత్యంకంగా 2023 ఏడాదికి గానూ ప్రముఖ రచయిత, రిటైర్డ్ ఐ.జి రావులపాటి సీతారామారావు, ఐపిఎస్ కు అందజేస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గన్నమరాజు గిరిజా మనోహరబాబు డా.ఎన్.వి.ఎన్.చారి ప్రకటించారు. ఆయన జయంతి రోజున వనం లక్ష్మీకాంతరావు, కుందావఝల కృష్ణమూర్తిల సౌజన్యంతో ఈ పురస్కారం అందిస్తున్నారు.



ఆట గాయపడింది

ఆవుతోలు కప్పుకున్న మృగాలకు
ఆటైనా ఒక్కటే
పాటైనా ఒక్కటే

మేక వన్నె పులుల మధ్య
ఆట గాయపడాల్సిందే
పాట గాయ పడాల్సిందే

న స్త్రీ స్వాతంత్ర మర్హతి !

తన బాదల్ని
ముఖాల మీద చల్లుతూ
తన గాదల్తో
మెదడు మొద్దుబారుస్తూ
మనసు ద్వారాలు మూసుకున్న
ఒక మౌన మనువు
ఏక పక్ష నాలుక
చెలరేగుతుంటే
గంతలు కట్టుకున్న గాంధారి
ధ్యానంలో
ఆట
ఢిల్లీ గుండెల మీద కూర్చుంది

ఆర్థికంలా
ఆడతనం
అనాధరోదనైనప్పుడు
ఆటస్థలం
నడి వీధిలోకి వచ్చింది

ఓ కవచమయ్యే
నలుగురిలో నిలబడి
దిక్కుల్ని అర్థిస్తున్నప్పుడు -

"భేటీ బచావో భేటీ బచావో
చెద పురుగులు
వ్యాపించాయి దేశమంతా
భేటీ బచావో భేటీ బచావో "

ఆకాశంలోంచి అరుస్తున్నారు
చేతుల్లో
చెరో తుపాకీతో
హీరాబెన్...ఫూలన్ దేవి

- వడ్డెబోయిన శ్రీనివాస్

ఆధిపత్యంపై సూపుడు వేలు "జమిడిక"

కవి ఐన వాడు ముందుగా మంచి మనిషై ఉండాలి. తనదైన వ్యక్తిత్వ విలువలతో సామాజిక చలనాలకు, సంఘర్షణలకు స్పందించే గుణం కలిగి ఉండాలి. తాను ఏ కాలం జీవిస్తున్నాడో ఆ కాలిక స్పృహ కలిగి ఉండాలి. మంచి మనిషిగా, మానవీయ భావజాలంతో ఇటీవల నన్ను ఆకర్షించిన కవి కందుకూరి అంజయ్య.



- డా. రాధేయ

మా పరిచయం అనుకోని విధంగా, ఆశ్చర్యంగా విజయవాడలో జరిగింది. ఈ మేడే రోజు నేను విజయవాడలో సాహితీ మిత్రులు నిర్వహించిన కవితా -2022 ఆవిష్కరణ సభకు నేను అతిథిగా వెళ్ళాను. ఈ సభకు ఉభయ రాష్ట్రాల ప్రముఖ తెలుగు కవులు వచ్చారు. అలా కరీంనగర్ నుంచి గాజోజు నాగభూషణం, విలాసాగరం రవీందర్, తొప్పెట ఓబయ్య, కందుకూరి అంజయ్య వచ్చారు. వీరందరూ నాకు పరిచయం ఉన్న కవులే.

శ్రీరామ్ కందుకూరి అంజయ్యను నాకు పరిచయం చేశాడు. ఆ క్షణంలోనే తన మాటలతో, మంచితనంతో నన్ను ఆకట్టుకున్నాడు. కవిత్వం మనుషుల్ని కలపడమే కాదు. మనసుల్ని మరింత దగ్గరగా జేస్తుంది.

ఉభయ తెలుగు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయి తొమ్మిది ఏండ్లు గడిచి పోయాయి. కుటిల రాజకీయాల మూలంగా ప్రాంతీయ భేషజాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి కొనసాగడమే రాజకీయ మనుగడ అని మనం భావించవచ్చు.

జమిడిక ప్రత్యేకించి ఒక వాద్య విశేషం. ముఖ్యంగా అమ్మవారి జాతర్లలో, గ్రామదేవతల బోనాల పండుగల్లో ఈ వాద్యగాళ్లు మైమరచి పోయి, గానం చేస్తూ అమ్మవార్ని ఆవాహన చేస్తారు. ఈ వాద్యం రాయలసీమలోని జాతర్ల లోనూ కన్పిస్తుంది. ఈ జమిడికనే పుస్తకం శీర్షికగా ఎంచుకున్నాడు కవి. అంజయ్య తన మొదటి కవితా సంపుటి కట్టె పల్క (2013) తర్వాత పదేళ్ల విరామంతో ఈ జమిడిక వచ్చింది.

అది నేను చదవలేదు గానీ ఈ సంపుటిలోని కవిత్వం మాత్రం వస్తువులో, అభివ్యక్తిలో, విస్పష్ట భావ ప్రకటనలతో పాఠకుణ్ణి ఆలోచింపజేస్తుంది. తెలుగు వారికందరికీ ఇష్టమైన పండుగ ఉగాదితో నిష్ఠూరంగా పల్కుతాడు


ఉగాదీ !
నీకు నాకు ఎంత దూరం
నీకు నాకు అందనంత దూరం
మా వాడకురా
మా గుండె గూటికి రా
మాకు నీడగా రా
మాకు తోడుగా రా..
(పుట 10)

గడీలల్లో తిరగబడ్డ నాగళ్ళను గురించి రాస్తాడు. ఈ దేశంలో మనుషులు పుట్టలేదు, వర్ణాలు పుట్టినయి అంటూ..

మా చెమట పునాదుల మీదనే కదా
ఆధిపత్యపు సప్తవర్ణాల సౌధాలు నిలబడ్డది
కావ్య జగత్తుకు కవి రారాజని నీకు తెలుసు
కవి స్వేచ్ఛను కట్టడి చేయడం
సాధ్యం కాని ముచ్చట
వర్ణ సంకరాన్ని ధర్మాన్ని ధిక్కరించి
తాపసిగా మారి తామసాన్ని ఎదిరించిన
శంభూకులం
అన్ని అసమానత పీడనలను రూపుమాపే
చూపుడు వేలు సూరులం (పుట:17)

రాజకీయ గుంటనక్కల నైజాన్ని ఎండగట్టాడు

వాడు తోడేలు గుంపులో ఉండి
మేకల మెడలు కొరికిన వాడు
గొర్ల కాపరినని గొంతు



> **జమిడిక ప్రత్యేకించి ఒక వాద్య విశేషం. ముఖ్యంగా అమ్మవారి జాతర్లలో, గ్రామదేవతల బోనాల పండుగల్లో ఈ వాద్యగాళ్లు మైమరచి పోయి, గానం చేస్తూ అమ్మవార్ని ఆవాహన చేస్తారు. ఈ వాద్యం రాయలసీమలోని జాతర్ల లోనూ కన్పిస్తుంది. ఈ జమిడికనే పుస్తకం శీర్షిక గా ఎంచుకున్నాడు కవి.**

చించుకుంటుండు
(పుట:22)

ఉమ్మ నీటిలో చందమామలకు అలల ఊయలు కట్టినట్లున్న ఇంద్రావతిని అభివర్ణించాడు. అడవి బిడ్డలకు అడవి మీద హక్కు కోసం శృతి కలిపాడు. తన ఊరును మాట్లాడిస్తాడు. మట్టిని మాట్లాడిస్తాడు. పోరు విత్తనాలు చల్లిన ఏరు బిడ్డల గురించి మాట్లా డుతాడు. మూగ వేదనను అనుభ వించిన మాగాణంలో మురళీ గీతిక పాడినట్లు మానేరు ముచ్చట్లను మనతో పంచుకుంటాడు కవి. వసంతం వల విసిరిన చిగురించ డానికి చెట్టు లేదని బాధపడతాడు. పచ్చదనాన్ని మింగిన నల్లతాచు రోడ్లు గురించి మాట్లాడుతాడు.

వేములవాడ పురవీధులన్నీ
వెన్నెల జాగారం చేసినయి
పూలరథమై కదులుతున్న
నీ పార్థివ దేహాన్ని చూసి
పూల వర్షం కురిసింది (పుట:85)

తన తల్లి లక్ష్మి యాది చేసుకుంటాడు.

అవ్వా! నువ్వు
ఎంత ఆత్మ గల దానివి
కలిగినోని ఇంట్లబుట్టినా
కలిలోనికి గింజలు లేనోని
ఇంట్లమెట్టినా
కాలాన్ని నమ్ముకున్నవు
కష్టాన్ని నమ్ముకున్నవు
మగ్గంలో నాడే లాగా
నీ కాళ్లు చేతులు రికాం లేకుండ ఆడేవి
కష్టాలు మనిషికొస్తాయి గానీ
మానికొస్తాయా?

జమిడిక వాద్యాన్ని ఒక కవితలో చాలా గొప్పగా వివరిస్తాడు. కన్నెర్ర జేసిన పోచమ్మను సల్లబరుస్తాడు. మంత్ర ముగ్ధులను జేసే ఈ వాయిద్య విన్యాసానికి పోచమ్మే పరవశించి పోతుంది.

డప్పు దరువులతోని జత కట్టిన
జమిడిక జతులకు
చచ్చుపడ్డ కాళ్లకు ప్రాణం వస్తది
కఠిన శిలలు కాల్పని జగత్తులో విహరిస్తయి
గ్రామ దేవతలను కొలిసే
ఊరి గొడుగులు
పాట చెలిమెలు జమిడికలు
(పుట:106)

జమిడికను తెలంగాణా సాంస్కృతిక వైభవ విశేషంగా వర్ణించారు.

ఉత్తరప్రదేశ్లో ఇప్పటికీ మనిషి మలాన్ని ఎత్తి పోస్తున్న వార్తను ఈ కవి చదివి ఎంతో చెల్లించి పోయి పరిశుద్ధులు అనే పేరుతో ఒక మంచి కవితను రాశాడు.

వేకువ జామున వెలివాడ నుండి
బయలుదేరే వెలుతురు పాదాలను
చూసి ఊరు ఉలికి పడుతది
అప్పటివరకు అలజడి లేని
మనస్సరోవరం అల్లకల్లోలం అయితది
బకెట్, చీపురు, రేకు,
నొసటిరాతను మార్చుకున్నా
నోటికాడికి బుక్కెడు బువ్వను తెస్తాయి
అశుద్ధాన్ని శుద్ధి చేసేవారి ఆయుధాలే
చీపురు, రేకు, బకెట్
ఇంట్లో పళ్లెంలోని మెతుకులు
పెంటకుప్పలాగే కనిపిస్తది
కంపును మరిగిన నాసికాలు
ఇంపును కూడా కంపుగానే కలగంటై
(పుట:115)

అణచివేతే అయుధమైనప్పుడు అలుకు పిడచ కూడా ఆయుధ మైతుందని, ఆధిపత్యం నెత్తికెక్కి నపుడు చుక్కలు చూపించుడే రీతి హెచ్చరికలు జారీ చేస్తాడు. గుడిసె కొప్పు మీద విముక్తి జెండాను ఎగుర వేస్తాడు. ఆకాశం అరుగు మీద ఎన్నెల కాయిస్తడు.



మంత్రి పువ్వాడకు టీడబ్ల్యూజేఎఫ్ కృతజ్ఞతలు

- రూరల్ జర్నలిస్టులకూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి
- విధివిధానాలు ప్రకటించాలి..తదుపరి ప్రక్రియ వేగవంతం చేయాలి..
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కృతజ్ఞత సభకు సంఘీభావం

నవతెలంగాణ - ఖమ్మం

ఖమ్మం జిల్లా కేంద్రం జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల పంపిణీకి 23 ఎకరాలు కేటాయించి, మంత్రివర్గం ఆమోదం పొందేలా కృషి చేసిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కృతజ్ఞతలు తెలిపింది. గ్రామీణ జర్నలిస్టులకూ ఇళ్ల స్థలాలు ఇచ్చేలా దృష్టి సారించాల్సిందిగా మంత్రిని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ వినతిపత్రం సమర్పించింది. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో జడ్పీ మీటింగ్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మంత్రి అజయ్‌కు జర్నలిస్టుల కృతజ్ఞత సభకు టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాకారానికి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి ప్రక్రియను కూడా అత్యంత వేగంగా పూర్తి చేసి త్వరగా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసేలా కృషి చేయాల్సిందిగా కోరారు. ఇళ్ల స్థలాల పంపిణీపై ఇప్పటికీ రకరకాల ఊహాగానాలు ఉన్నాయి. ఇవి నివృత్తి అయ్యేలా ముందుగా విధివిధానాలను ప్రకటించాలని విన్నవించారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఉన్న జర్నలిస్టుల అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హామీ మేరకు వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. వ్యత్యాసాలు లేకుండా అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని విన్నవించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు సాతుపాటి రామయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు శాబాదు కరుణాకర్‌రెడ్డి, వి.అంజయ్య, బంక వెంకటేశ్, కె.శివారెడ్డి, చేబ్రోలు నారాయణ, డి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

యువకులు క్రీడల్లోనూ రాణించాలి

నవతెలంగాణ-కొణిజర్ల

యువకులంతా చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని తహసీల్దార్ దొడ్డారాపు సైదులు ఎస్ఐ జె.శంకర్‌రావులు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో గడల సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన కూమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడైన గడల భాస్కరరావు గ్రామస్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నీని ప్రారంభించేందుకు ముఖ్యతిథిలుగా తహశీల్దార్ దొడ్డారాపు సైదులు, ఎస్ఐ జె శంకర్ రావులు హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు యర్రా బాబు, వార్డు సభ్యులు సైదా చాట్ల భాస్కరరావు, క్రికెట్ టోర్నీ కన్వీనర్ పొట్లపల్లి గోపీ, మేకల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో

నవతెలంగాణ-చింతకాని

గ్రామాల్లో చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చింతకాని ఎంపీడీవో శ్రీనివాసరావు గ్రామస్తులకు సూచించారు పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని వందనం, కొదుమూరు, రాఘవపురం చెరువులను ఎంపీడీవో ఆదివారం పరిశీలించారు చెరువుల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ చెత్తాచెదారం వేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉందన్నారు తక్షణమే చెరువులో ఉన్న వ్యర్థాలను ప్లాస్టిక్ తొలగించాలని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, ఈశ్వరచారి, జ్యోతి ఏపీఓ కోటయ్య, మేట్ నాగరాజు పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

నవతెలంగాణ- ఎర్రుపాలెం

మండల పరిధిలోని పెగళ్లపాడు కట్టలేరు వద్ద గుర్తు తెలియని రైలు నుండి కింద పడి వ్యక్తి మరణించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు మేరకు గుర్తు తెలియని వ్యక్తి ట్రైన్‌లో ప్రయాణం చేస్తూ జారి కింద పడి ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడు ఎర్రుపాలెం- తొండ్ల గోపవరం మధ్యన కట్టలేరు రైలు బ్రిడ్జి పట్టాలపై ఎగువకు వెళ్ల గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు కుడి చేతిపై కృష్ణ భగవానుడు పచ్చ బొట్టు కలదు. ఫోటోలో గల వ్యక్తిని గుర్తించిన ఎడల ఈ 9963641484, 9010226679 నెంబర్లకు తెలపాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఎకరానికి 30 క్వింటాలు కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ముదిగొండ

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 30 క్వింటాలు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎకరానికి 25 క్వింటాలే కొనుగోలు చేయాలనే నిబంధనాలను రాష్ట్ర ప్రభుత్వం సడలించాలన్నారు. ఎకరానికి 25 క్వింటాలు కాటా వేస్తే, మిగిలిన మొక్కజొన్నలను రైతులు ప్రైవేటుగా విక్రయించుకుంటే మద్దతు ధర రాదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో కౌలు రైతుల ఖాతాల్లోకి పంటల నగదు జమ చేయాలన్నారు. పట్టాదారు ఖాతాలలో జమ చేస్తే కౌలు రైతులు ఇబ్బందులకు గురవుతారన్నారు. ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న పంటల కౌలు రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతుల గోస

అకాల వర్షానికి తడిసిన పంటలు, నేలకూలిన విద్యుత్ పోల్స్

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి అకాల గాలి భారీ వేగంతో వర్షం కురిసి కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసి పోయి రైతులకు కన్నీరు మిగిల్చాయి. వృక్షాలు, విద్యుత్ పోల్స్ నేలవాలాయి. తీగలు తెగిపడ్డాయి. ఇండ్లలో ఉన్న పైకప్పు గాలికి ఎగిరి కొట్టుకొని పోయాయి. ఇప్పటికే పలు దఫాలుగా కురిసిన ఆకాల గాలి వర్షాలకు పంటలు ఆగమై రైతులు లబోదిబోమంటున్నారు. ఇండ్ల పైన వృక్షాలు పడి ఇంట్లో ఉన్న వస్తువులు ధ్వంసమై సిమెంట్ రేకులు పగిలిపోయినాయి. ప్రహరీ గోడలు సైతం నేలమట్టమయ్యాయి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను రైతులు ఆదివారం ఆరతిసి ఎండబెట్టారు. విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది విద్యుత్ పోల్స్ తీగలను మరమ్మతులు చేసి గ్రామాలకు విద్యుత్ సరఫరాను అందజేశారు. సాయంత్రం పంటలను తడవకుండా రైతులు పట్టాలు కప్పి కల్లాల దగ్గర బిక్కుబిక్కుమంటు రైతులు కాలం గడుపుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు హరి గోస పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజుల నుండి ధాన్యం పోసిన కాటాలు వేసే బస్తాలను ఎగుమతి చేసే పరిస్థితి లేదు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులుగా పోసి ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటుగా రైతులు నేషనల్ హైవే రోడ్లపై పోసి ధాన్యంను వేగవంతంగా కొనుగోలు చేసి, గోకినేపల్లి కొనుగోలు కేంద్రాల్లో పంటలను కొనుగోలు ఆలస్యం చేస్తూ ఉండటంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది. కొనుగోలు నిర్వాహకులు రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారు. పంట నష్టపరిహారం కోసం రైతులు పడిగాపులు కాస్తూ రెండు నెలల నుంచి ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం రైతులకు త్వరతగతిన మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఆశించి కాదు...ఆలోచనతో చేశా

- జర్నలిస్టు కుటుంబాల్లో వెలుగులు నింపాలనుకున్నా
- జర్నలిస్టు కాలనీకి రూ.రెండు కోట్ల నిధుల కేటాయింపు
- అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం
- టీయుడబ్ల్యూజె (ఐజెయు) అభినందన సభలో మంత్రి అజయ్
- మంత్రికి ఘన స్వాగతం పలికిన జర్నలిస్టులు, భారీ ర్యాలీ



నవతెలంగాణ- ఖమ్మం

ఏదో ఆశించి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కృషి చేయలేదని, వారి కళ్లల్లో ఆనందం చూడాలని, వారి దశాబ్దాల కలను నెరవేర్చాలని పట్టుదలతో పనిచేసి 23 ఎకరాలు కేటాయింపజేయడం జరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. దశాబ్ద కాలంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా జర్నలిస్టుల ఇబ్బందులను అతి దగ్గర నుంచి చూశానని, వారి రెండు దశాబ్దాల కోరికను నెరవేర్చేందుకు సహక రించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రులు కేటిఆర్, హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అజయ్ తెలిపారు. ఆదివారం టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో మంత్రి అజయ్‌కు కృతజ్ఞతా పూర్వక అభినందన సత్కార సభ జరిగింది. సభకు తొలుత అజయ్‌కు జర్నలిస్టులు ఘన స్వాగతం పలికారు. ఇల్లందు క్రాస్ రోడ్డు సమీపం నుంచి కోయ నృత్యాలు, డప్పు బృందాలతో వందలాది మంది జర్నలిస్టులు పూలాభిషేకం చేస్తూ సభా వేదిక వద్దకు తీసుకువచ్చారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు మంత్రి అజయ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నగర కమిటీ అధ్యక్షులు మైసా పాపారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మంలో అనేక దశాబ్దాలుగా పనిచేస్తున్న జర్నలిస్టులు కనీస స్థలానికి నోచుకోకపోవడం ఇబ్బందిగా భావించానని, ఎలాగైనా నివాస స్థలాన్ని ఇప్పించాలని గత సంవత్సర కాలంగా వివిధ రూపాల్లో ప్రయత్నించానన్నారు. బిపిఎల్ కింద నివాస స్థలాలను కేటాయిస్తే కేవలం 70 గజాలు మాత్రమే వస్తుందని, అందుకనే దూరదృష్టితో కేసిఆర్ పేరిట సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తొలి దశలో ఐదు ఎకరాలను కేటాయించామని, ముఖ్యమంత్రి కేసిఆర్ ఖమ్మం బహిరంగ సభలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు మంత్రులు కేటిఆర్, హరీష్‌రావు సహాయ సహకారాలతో ఈనెల 18న కేబినెట్‌లో 23 ఎకరాల కేటాయింపునకు ఆమోదం లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతాకుమారి, రెవెన్యూ ఇరిగేషన్ ఉన్నతాధికారులు కూడా పూర్తి సహాయ సహకారాలను అందించారని తెలిపారు. కేసిఆర్ తన మంత్రివర్గంలో తనకు స్థానం కల్పించడం వల్లే ఈ కార్యక్రమాన్ని నెరవేర్చగలిగానని ఆయన తెలిపారు. ఇండ్ల స్థలాల కోసం మూడు దశాబ్దాలుగా టియుడబ్ల్యూజె (ఐజెయు) చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పలుమార్లు ఐజెయు నాయకులు ఇండ్ల స్థలాల సమస్యను తన దృష్టికి తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. సుడా నిధుల నుంచి రెండు కోట్ల రూపాయలను జర్నలిస్టుల కాలనీకి కేటాయిస్తున్నామని, కార్పోరేషన్ నుంచి మౌళిక వసతుల కల్పన జరుగుతుందన్నారు. నిరభ్యంతరంగా జర్నలిస్టులు ఇండ్లు నిర్మించుకోవచ్చునని ఆయన తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని అజయ్‌కుమార్ కోరారు. ఖమ్మం నగరాన్ని అభివృద్ధిపథంలో నడిపించామని, అనేక అవాంతరాలను అధికమించి అసాధ్యాలు అనుకున్న అనేక పనులను సుసాధ్యం చేశామన్నారు. భవిష్యత్తులో సైతం ఖమ్మం నగరాభివృద్ధిలో ఇదే రీతి కొనసాగుతుందని, జర్నలిస్టులకు అన్ని విధాలా ఈ ప్రభుత్వం అండగా నిలబడు తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా జర్నలిస్టులకు 23 ఎకరాలు కేటాయింప జేయడం అది తన నియోజక వర్గంలో జరగడం అత్యంత సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఖమ్మం నగర అభివృద్ధికి అన్ని విధాలా జర్నలిస్టు మిత్రులు సహాయ సహకారాలను అందించాలని ఆయన కోరారు.

టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణ మాట్లాడుతూ అసాధ్యాన్ని మంత్రి అజయ్ కుమార్ సుసాధ్యం చేశారని, యావత్ జర్నలిస్టు సమాజం ఆయనకు రుణపడి ఉంటుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ జర్నలిస్టులకు ఈ విధమైన భూకేటాయింపు జరగలేదని, తెలంగాణ ఏర్పాటు తొలిసారి ఖమ్మం జిల్లా జర్నలిస్టులకు దక్కడం వెనక మంత్రి అవిరళ కృషి, నిరంతర శ్రమ దాగి ఉన్నాయని, తాము ఆందోళనలు చేశామని, గతంలో ఏ ప్రభుత్వం, ఏ మంత్రి కూడా ఈ విధంగా స్పందించ లేదన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) మంత్రికి అన్ని వేళలా వెన్నంటి నిలుస్తుందని, జీవిత కాలం గుర్తుంచుకుంటామని తెలిపారు. అనంతరం మంత్రి అజయ్ కుమార్‌ను, రాష్ట్ర ఉపాధ్య క్షులు రాంనారాయణను జర్నలిస్టులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా ఛైర్మన్ బచ్చు విజయకుమార్, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, అక్రిడేషన్ కమిటీ సభ్యులు గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పరిటాల సత్యనారాయణ, యూనియన్ జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, కెమెరామెన్ అసోసియేషన్ నాయకులు అప్పారావు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, టియుడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు రైతులకు నీరందిస్తాం

మూడవ జోన్‌ను రెండవ జోన్‌గా మార్చటానికి కృషి చేస్తాం

మధిరపై ఎర్రజెండా ఎగురు వేస్తాం

సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ ఇన్చార్జి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ- ఎర్రుపాలెం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు రైతులకు మూడవ జోన్ నుండి ఎర్రుపాలెం మండలానికి సాగు నీరు పంపిణీ చేస్తున్నా, రైతుల పొలాలు సాగు చేసు కోవటానికి నీరు అందడం లేదని, మూడవ జోన్‌ను రెండవ జోన్‌గా మార్చాలని దాని కోసం సిపిఎం ఆధ్వర్యంలో కృషి చేస్తామని మధిర నియోజకవర్గం ఇన్చార్జి పాలడుగు భాస్కరరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బనిగండ్లపాడు జోన్ పరిధిలో గల మామునూరు గ్రామంలో షేక్ లాల్ అధ్యక్షతన జరిగిన సిపిఎం జోన్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలడుగు భాస్కర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కట్టలేరు ప్రాజెక్టు కింద నాలుగు వేల ఎకరాల వరి పంటను రైతులు సేద్యం చేస్తున్నప్పటికీ ప్రాజెక్టు నీటి సామర్థ్యం పెంచే విషయంలో కుడి, ఎడమ కాలవలను మరమ్మత్తుల విషయంలో ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆయకట్టు రైతులకు చివరి వరకు సాగు నీళ్లు అందక చివరి దశలో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. అటువంటి పరిస్థితి కలగకుండా నిరంతరం రైతులకు సాగు నీళ్లు అంతే విధంగా కృషి చేస్తామని అన్నారు. కామ్రేడ్ స్వర్గీయ మాజీ మధిర శాసన సభ్యులు, శాసన సభ ప్రతిపక్ష నాయకుడు బోడెపుడి వెంకటేశ్వరరావు ఏ రీతిగా నాగార్జునసాగర్ కాలువల వెంట తిరిగి పంట పొలాలకు నీరు అందించారో, రైతుల పంటలు కొనుగోళ్ల కోసం కృషి చేసినట్లు ఆయన అందించన సేవల రీతిగా సిపిఎం ఆధ్వర్యంలో తాను రైతులకు అండగా ఉంటానని అన్నారు. మతతత్వ బిజెపి పార్టీని అధికారంలోకి రాకుండా ఆపడం సిపిఎం ధ్యేయం అని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామని, బిజెపికి వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలతో కలిసి పని చేస్తామని అన్నారు. త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికలలో మధిర నియోజకవర్గంలో సిపిఎం తప్పక పోటీ చేస్తుందని అన్నారు. మధిరలో మరొకసారి ఎర్రజెండా ఎగరవేయడం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సగుర్తి సంజీవరావు, బేతి శ్రీనివాసరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, బండారు ఉపేంద్ర, పెరుమళ్ళ రోహిత్, షేక్ కరీం, కృష్ణ, వెంకటేశ్వరరావు, గురవారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్ప్రింగ్ లీఫ్, టెండర్ రూట్స్ పాఠశాలల 'సమ్మర్ క్యాంప్' ముగింపు వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం

ప్రతీయేటా తమ విద్యాసంస్థల్లో నిర్వహించే వేసవికాల శిక్షణా తరగతులు (సమ్మర్ క్యాంప్) ఈ సంవత్సరం కూడా చిన్నారులు ఆహ్లాదకరంగా, ఆనందంగా పూర్తిచేసుకున్నారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలకు డాక్టర్ చందన, ఐ.ఐ.ఎమ్. ప్రొఫెసర్ డాక్టర్ స్ఫూర్తి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ప్రింగ్స్, టెండర్‌రూట్స్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ చిన్నారులకు మంచి ఉపయోగాన్ని చేకూర్చిందన్నారు. వేసవిలో పిల్లలు టీవీలకు, సెల్ఫోన్లకు సమయాన్ని కేటాయించకుండా పిల్లలకు ఉపయోగపడే స్కేటింగ్, సంగీతం, చేతిరాత, డ్యాన్సులు, పాటలు, ఈత మొదలగు విషయాలు నేర్చుకోవడం తమ భవిష్యత్ చదువులకు ఎంతో ఉపయోగకరమన్నారు. వేసవిలో పిల్లలు ఎండబారిన పడి అనారోగ్యాలు తెచ్చుకోకుండా ఇటువంటి క్యాంపులు ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని వారు అభినందించారు. హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు చదువుకు, ఆటపాటలకు దూరం కాకుండా, తమ ఆధ్వర్యంలో స్ప్రింగ్లీఫ్ స్కూల్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్నారుల్లో కళానైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ శిక్షణ, సౌందర్యాత్మక సాధనకోసం నృత్యసాధన, మేధాశక్తి, వ్యూహాత్మక శక్తి పెంపొందించడానికై చదరంగం, సృజనాత్మకత పెంపొందించేందుకు చిత్రలేఖనం, చక్కని చేతివ్రాతకై 'క్యాలీగ్రఫీ'లో శిక్షణ, మెదడుకు పదునుపెట్టే విధంగా 'గణిత బోధన', శ్రావ్యమైన గాత్రానికి మెరుగుదిద్దేలా శిక్షణ, ఫంక్షనల్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్‌లో అవగాహన, శారీరక, మానసిక వికాసానికై యోగా వంటి పలు విషయాలను చిన్నారులకు నేర్పించడం జరిగిందన్నారు. ఏప్రిల్ 25వ తేదీ నుండి ఈనెల 31వ తేదీ వరకు వేసవి శిక్షణా శిభిరాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. సుమారు 200 మంది చిన్నారులు స్ప్రింగ్లీఫ్, టెండర్ రూట్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 'సమ్మర్ క్యాంపు'కు హాజరయ్యారన్నారు. ముగింపు వేడుకల్లో చిన్నారులు సుమారు నెల రోజులపాటు నేర్చుకున్న పలు అంశాలను ప్రదర్శించారు. చిన్నారులు సంగీతం, పాటలు, డ్యాన్సులు, యోగా చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సింగ్లిఫ్ పాఠశాల సిబ్బంది, టెండర్ రూట్స్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మధు విద్యాలయం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నవతెలంగాణ-వైరాటౌన్



మధు విద్యాలయం నందు 1993- 94 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను ఆనందోత్సాహాలతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు మాట్లాడుతూ తమ విద్యాలయంలో చదివిన అనేకమంది విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో ఉన్నత స్థాయిలో ఉండటం సంతోషకరంగా ఉందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన ఉత్తమ విద్యను మధు విద్యాలయం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని అన్నారు. పలు దేశాలలో వివిధ హెూదాలలో పని చేస్తున్న పూర్వ విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో సమాజానికి, పేద విద్యార్థులకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు తమ పాత జ్ఞాపకాలను పంచుకొని ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి దేశ, విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మధు విద్యాసంస్థల కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్, ఉపాధ్యక్షులు మల్లెంపాటి ప్రసాదరావు 1993-94 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

4న జరిగే ప్రజాగర్జను జయప్రదం చేయండి

నవతెలంగాణ-చింతకాని

దేశ ప్రజలను దగా చేస్తున్న అసమర్థత నరేంద్ర మోడీ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని కార్పొరేట్ దిగ్గజాలకు తొత్తుగా మారి దేశ సంపదను దోచిపెడుతూ, మతం, కులం పేరుతో ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బిజెపికి 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలు చివరి ఎన్నికలని , కర్ణాటక ఎన్నికల ఫలితాలతో బిజెపికి పతనం ప్రారంభమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జూన్ 4న జరిగే ప్రజా గర్జన జయప్రదం కోరుతూ ఆదివారం మండల పరిధిలోని బస్వాపురం, కోదుమూరు, నాగిలిగొండ, నేరడ, ప్రొద్దుటూరు గ్రామాలలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జానిమియా, ఏపూరి రవీంద్ర బాబు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్, సహాయ కార్యదర్శులు దుసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, జిల్లా సమితి సభ్యులు రాసాలా మోహన్‌రావు, కూచిపూడి రవి, సర్పంచ్ సుజాత, మండల నాయకులు మార్గం శ్రీను, నక్కనబోయన కృష్ణ, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ రహదారి వంతెన అలైన్మెంట్ మార్చాలి

రైతులకు స్థానిక ప్రజలకు అనుకూలంగా జాతీయ రహదారి వంతెన అలైన్మెంట్ మార్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేషనల్ హైవే అధికారులకు సూచించారు. చింతకాని మండలం కొదుమూరు ఖమ్మం నగర శివారు అల్లిపురం ప్రాంతంలో సూర్యాపేట దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. గతంలో ఉన్న ఆర్అండ్‌బి రహదారికి అనుసంధానంగా వంతెన నిర్మాణం చేపట్టకుండా ఎన్‌హెచ్ అధికారులు వారికి అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో వంతెన నిర్మాణం చేపడుతున్నారని కొదుమూరు రాఘవపురం లచ్చగూడెం గ్రామస్తులు అభ్యంతరం తెలిపి పనులు ఆపివేశారు. మండల పర్యటనలో ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావుకు రాఘవాపురం గ్రామ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు సమస్యను తెలిపారు అక్కడే ఉన్న నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులతో కూనంనేని మాట్లాడారు ఎన్‌హెచ్ ఈఈతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. అల్లిపురం, కొదుమూరు గ్రామాల మధ్య నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేసి ఉందని దానికి అనుగుణంగా వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. రైతులకు స్థానికులకు ఇబ్బందులు జరిగేలా రహదారి నిర్మాణం చేపడితే ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. వంతెనకు సంబంధించి అలైన్మెంట్ మార్చిన తర్వాతే చేపట్టాలని ఆయన ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు.



ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గర్జన

బోనకల్ : రాష్ట్రంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కరించడం కోసమే ప్రజా గర్జనను చేపట్టినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలం లోని బ్రాహ్మణపల్లి, రాయన్నపేట, మోటమర్రి గ్రామాల్లో సాంబశివరావు ఆదివారం విస్తతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో నిరుపేదలకు ఇల్లు అందించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దష్టికి తీసుకువెళ్లడానికి జూన్ 4న కొత్తగూడెంలో ప్రజా గర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తోట రామాంజనేయులు, బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, మండల నాయకుల పాల్గొన్నారు.


అనునిత్యం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం 22 మే 2023

షరతులు లేకుండా తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-బోనకల్
మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన మొక్కజొన్నలను ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్, లక్ష్మీపురం, గార్లపాడు, తూటికుంట్ల గ్రామాల్లో కురిసిన అకాల వర్షాల వల్ల రైతులు కల్లాలలో ఆరబోసిన తడిసిన మొక్కజొన్నలను ఆదివారం లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అకాల వర్షాల వలన సాగునీటి సమస్య వలన మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు అన్నారు. లక్ష్మీపురం సొసైటీ పరిధిలో సుమారు ఇప్పటికే 80 వేల బస్తాలు వచ్చాయని వీరభద్రరావు తెలిపారు. నేటి వరకు లక్ష్మీపురం సొసైటీ ద్వారా 9 లారీల ద్వారా 5,572 బస్తాలు, సుమారు మూడు వేల క్వింటాలు గోడౌన్లకు తరలించినట్లు తెలిపారు. ఈ సొసైటీ పరిధిలో ఇంకా రైతుల వద్ద సుమారు పదివేల బస్తాలు కల్లాలలో ఉన్నాయని తెలిపారు. ఈ సొసైటీ పరిధిలో గల రైతుల అందరి మొక్కజొన్నలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని లక్ష్యంతో లక్ష్మీపురం సొసైటీ ఉన్నట్లు తెలిపారు. అకాల వర్షాల వలన తడిసిన మొక్కజొన్నలు కొనుగోలు చేయడానికి తమ సొసైటీకి మార్క్ ఫెడ్ అధికారులు ఎటువంటి షరతులు విధించకుండా అనుమతులు మంజూరు చేయాలని ఆయన కోరారు. లక్ష్మీపురం సొసైటీ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటుందని ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం కృషి చేస్తానని మాదినేని వీరభద్రరావు హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ తుళ్లూరి రమేష్, సొసైటీ డైరెక్టర్ షేక్ మదార్, పొన్నం అనంతమ్మ, తాత వీరయ్య, సొసైటీ సీఈఓ నిమ్మగడ్డ పుల్లారావు, సొసైటీ సిబ్బంది కొత్తపల్లి రవి, సిహెచ్ నాగేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చుదాం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపు సుధాకర్

నవతెలంగాణ-తల్లాడ
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చుదామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపు సుధాకర్ పిలుపునిచ్చారు. తల్లాడలోని మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కటిక కిరణ్, వెర్రి కృష్ణారావు, బలవంతపు రవీంద్ర నాగిరెడ్డి, తాళ్ల వెంకటేశ్వర్లు, బి.అంజయ్య, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, షేక్ జమాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో మహిళ మృతి



నవతెలంగాణ-కల్లూరు
మండల పరిధిలోని ముచ్చవరం గ్రామ పంచాయతీ శివారు బాలాజీ నగర్‌లో చింతపల్లి రామలక్ష్మి (45) విద్యుత్ షాక్ తో ఆదివారం ఉదయం మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చింతపల్లి రామలక్ష్మి ఉదయం 6 గంటల సమయంలో ఇంటి వెనక పెరట్లో ఉన్న బావికి మోటారు ఏర్పాటు సర్వీస్ వైరు వేశారు. అ సర్వీస్ వైర్‌కు బట్టలు ఆరేసుకున్న వైర్ తగలడంతో విద్యుత్ సరఫరా అయింది. వైర్‌కి మృతురాలి చేయి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడ మృతి చెందింది. గమనించిన భర్త సత్యనారాయణ కాపాడుకునే ప్రయత్నంలో అతనికి కూడా షాక్ కొట్టింది. భర్తకు ఎలాంటి గాయాలు కాలేదు. భర్త ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి చేశారు. ఆమె మృతితో బాలాజీ నగర్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



ఎమ్మెల్యే సండ్రకు వీఆర్ఏలు సన్మానం

నవతెలంగాణ-కల్లూరు
వీఆర్ఏల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యను ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్ఏలు ఘనంగా సత్కరించారు. వీఆర్ఏల క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో హర్షిస్తూ తెలంగాణ రాష్ట్ర జేఏసీ నాయకులు ఫలించిన వారి స్వప్నం పట్ల వీఆర్ఏల హర్షం తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెలంగాణ సర్కార్‌లో పరిష్కారం లభించిందన్నారు. రెవెన్యూ శాఖలో అరకొర వేతనంతో ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్న వారికి సీఎం కేసీఆర్ దీపమయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరుతో నిర్మించిన నూతన సచివాలయంలో మొట్టమొదటి ఉద్యోగుల వీఆర్ఏల సమస్యలను తీర్చటం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విఆర్ఏ కమిటీ కో చైర్మన్ రమేష్ బహదూర్, కన్వీనర్ దాదేమ్మ, షేక్ రఫీ, వంగూరు రాము, ఉమామహేశ్వర్, షేక్ ఆజాద్, జాన్మియా, జానీ, భూక్య శ్రీను తదితరులు ఉన్నారు.

తల్లాడలో ఫోన్ పే మోసం

నవతెలంగాణ-తల్లాడ
తల్లాడలో ఈ నెల 18న బస్ స్టాండ్ దగ్గరలోని ఓ బంగారు షాప్‌లోనికి ఇద్దరు వ్యక్తులు వచ్చి మాది రాజమండ్రి వైరాలో గిఫ్ట్ ఇవ్వాలి, బంగారు చైన్ చూపించమని షాప్ యజమానిని కోరారు. యజమాని చైన్ చూపించి 64 వేల రూపాయలకు ధర నిర్ణయించి వ్యక్తులకు ఇచ్చారు. వారు ఫోన్ పే చేస్తున్నామని 64 వేల రూపాయలు ఫోన్ పే చేశారు. సదరు బంగారు చైన్ ను తీసుకొని ఇద్దరు వ్యక్తులు వెళ్లిపోయారు అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో ఖాతాలో జమ చేసిన 64వేలు కనిపించలేదు. షాపు యజమాని బ్యాంకులో సంప్రదించగా నగదు ఫ్రీజ్ అయినట్లు సమాచారం ఇచ్చారు. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే అగంతకులు కొనిజర్ల పోలీస్ స్టేషన్లో తమ ఫోన్ పోయిందని అందులో 64000 వినియోగించారని, ఫిర్యాదు చేయడం విశేషం. తాను మోసపోయానని గమనించిన షాప్ యజమాని తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతికి ఎమ్మెల్యే నివాళి

నవతెలంగాణ-కల్లూరు
మండల పరిధిలోని, రఘునాథగూడెం గ్రామానికి చెందిన జానపాటి వెంకటేశ్వర్లు పెనుబల్లి పోలీస్టేషన్లో రైటర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఏసీపీ రామానుజం, సీఐలు హనూక్, కరుణాకర్, పెనుబల్లి, కల్లూరు ఎస్సైలు సూరజ్, రఘు, ఆదివారం కల్లూరు బొమ్మరిల్లు టౌన్ షిప్‌లోని వారి నివాస గృహానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతి పట్ల తీవ్ర సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు మాట్లాడుతూ... వేంకటేశ్వర్లు మృదు స్వభావనీ, తన విధులను నిబద్ధతతో కొనసాగించేవారని, రైటర్‌గా అందరి మన్ననలు పొందారని వారి సేవలను కొనియాడారు. భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీలు కట్టా అజయ్ కుమార్, చెక్కిలాల మోహన్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, రైతు సమన్వయ సమితి ప్రతినిధులు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చంద్రరావు, పెనుబల్లి మండలం నాయకులు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు, లక్కినేనీ వినీల్, జెడ్పీ, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ ఇస్మాయిల్, ఎస్కె కమ్లి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కాటంనేని వేంకటేశ్వర రావు, మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, మండల సెక్రెటరీ కొరకొప్పు ప్రసాద్, నాయకులు మేకల కృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఉబ్బన వెంకటరత్నం, బొక్కా వెంకటేశ్వర్లు, సర్పంచ్ రావి సూర్య నారాయణ, కుక్కా ఆంజారావు, గొల్లమందల ప్రసాద్, మందడపు అశోక్, పాస్టర్లు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-మధిర



ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఎం పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాయపట్నం గ్రామంలోని జోనల్ సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చిన ప్రజలకు ఎన్నో మాయమాటలు చెప్పిందని చెప్పిందొకటి చేసేది మరొకటి.. ప్రయివేటు వ్యక్తులకు గవర్నమెంట్ స్థలాలను విచ్చలవిడిగా అమ్మేసింది.. ప్రభుత్వం అన్ని స్థలాలను కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తంగా అమ్మేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్య గాని, ఇళ్ల స్థలాల సమస్యలు గానీ, రేషన్ కార్డులు, పెన్షన్ సమస్యలు అన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. లేని పరిస్థితుల్లో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం జిల్లా నాయకులు శీల నరసింహారావు, మధిర మండల కార్యదర్శి మందా సైదులు, మధిర మండల నాయకులు మద్దాల ప్రభాకర్, వడ్రానపు మధు, సిపిఎం మండల నాయకురాలు చేగొండి వెంకాయమ్మ, సంపసాల గోపాలరావు, రాయపట్నం శాఖ కార్యదర్శి చేగొండి వీరయ్య గోపి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



- వైరా వ్యవసాయ మార్కెట్ ఎదుట రహదారిపై రైతులు నిరసన
- కొనుగోలు తీవ్ర జాప్యం వల్ల ధాన్యం, మొక్కజొన్న రైతులకు ఇక్కట్లు
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు,
- కాంగ్రెస్ నాయకులు మాలోత్ రాందాస్ నాయక్

నవతెలంగాణ-వైరా
ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో తీవ్ర జాప్యం వల్ల రైతులు ఇక్కట్లు పడుతున్నారని, శనివారం రాత్రి కురిసిన అకాల వర్షంకు కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం, మొక్కజొన్న తడిసి పోయిందని, తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంట ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ వైరా వ్యవసాయ మార్కెట్ ఎదుట రహదారిపైన రైతులు రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మాలోత్ రాందాస్ మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో తీవ్ర జాప్యం వలన రైతులు ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. 20 రోజుల తర్వాత కూడా ధాన్యం కాటాలు కావడం లేదని, మిల్లుల దయాదాక్ష్యం పైన ఆధారపడి ధాన్యం కొనుగోలు జరుగుతుందని అన్నారు. ఎండలు తీవ్రత మూలంగా తేమశాతం చాలా తక్కువ నమోదు అవుతున్న ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో ఎందుకు ఆలస్యం అవుతుందని ప్రశ్నించారు. వ్యవసాయ మార్కెట్లో ఉన్న ధాన్యం వర్షంకు తడిసినా అధికారులు కనీసం మార్కెట్ కు రాలేదని, అధికారులు హామీ ఇచ్చే వరకు రైతులు ఉద్యమం చేస్తామని రాస్తారోకో నిర్వహించడంతో మార్కెట్ చైర్మన్ రత్నం రైతులు ఆందోళన వద్దకు చేరుకుని రైతులు ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. వైరా శాసనసభ్యులు రాములు నాయక్ దృష్టికి సమస్యలు వివరించారు. జిల్లా అధికారులతో మాట్లాడి తడిసి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, రైతు సంఘం పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, నల్లమోతు వెంకటనారాయణ, పైడిపల్లి సాంబశివరావు, వడ్లమూడి మధు, కామినేని రవి, చిత్తారు మురళి, పుచ్చకాయల రామయ్య కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి, పాలేపు నరసింహారావు, చపిడి వెంకటేశ్వరరావు, పమ్మి అశోక్, రైతులు సైదులు, శ్రీనివాసరావు, మల్లికార్జున్, వెంకట్, ఉసెన్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన తాతా భాస్కర్ రావు

తల్లాడ : తల్లాడ మండలం కల కుడిమ గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేషరతుగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజనాపురం ఉపసర్పంచ్ కృష్ణయ్య, ఆదూరి జీవరత్నం, పాపకంటి లాజరు ముత్తయ్య, వడ్డే రమేష్, ఆదర్శ వెంకటి రైతులు పాల్గొన్నారు.



దేశానికి ఐటీ విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్ గాంధీ

నవతెలంగాణ-వేంసూరు
దేశంలో ఐటీ రంగాన్ని తీసుకువచ్చి విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చిన ఘనత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేనిని మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి పుచ్చకాయల సోమిరెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని మర్లపాడులో ఆదివారం రాజీవ్ గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాఘవరెడ్డి బుచల్లు అశోక్ పుల్లారావు సత్యనారాయణ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-మధిర
మాజీ కేంద్ర మంత్రివర్యులు రేణుకా చౌదరి ఆదేశాల మేరకు జవ్వాజి ఆనందరావు అధ్యక్షతన మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దోర్నాల వెంకట రవి ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిలుగుమాడు గ్రామ పెద్దలు దోర్నాల ఏసు పాదం, దోర్నాల రాములు యూత్ నాయకులు కోటా శ్రీను, దోర్నాల వీరస్వామి, కుటుంబరావు, పెసరవెల్లి కృష్ణ, సహదేవ్, మనోహర్, మోహన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి పురస్కరించుకొని మాజీమంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు సంభాని చంద్రశేఖర్, కల్లూరు మండలం రామకృష్ణాపురంలో వారి క్యాంప్ కార్యాలయం నందు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి మనోహర్ నాయుడు, కల్లూరు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కీసర శ్రీనివాసరెడ్డి, తల్లాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల నాగిరెడ్డి, యరమల రవీంద్ర రెడ్డి, ఆవుల నాగేశ్వరరావు, పోతురాజు నరేంద్ర, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

రాయితీపై జీలుగు విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-వేంసూరు
తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతే రాజు అనే విధంగా తీసుకురావాలని ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ధాన్యం కొనుగోలు రైతులకు బీమా, రైతు బంధు సబ్సిడీపై విత్తనాలు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఎకరాకు నీటిని అందించేందుకు ప్రణాళిక ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, తాసిల్దార్ నారాయణమూర్తి, ఎంపీడీవో రమేష్, డిసిసిబి డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, సర్పంచ్ ఫైజుద్దీన్ నాయుడు, వెంకటేశ్వరావుతో పాటు పలువురు సొసైటీ అధ్యక్షులు సర్పంచులు సిబ్బంది అన్నారు.

మెగా జాబ్ ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

- మొత్తం 150 కంపెనీలు, 8200 ఉద్యోగాలు
- పలువురికి నియామక పత్రాలు అందజేసిన పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం
ఖమ్మం జిల్లా నిరుద్యోగుల కోసం జిల్లా పోలీస్ శాఖ అధ్వర్యంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతో ఎస్బీఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. మొత్తం 150 వివిధ రంగాల కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపట్టారు. ఆయా కంపెనీలలో వివిధ హొదాల్లో ఉన్న 8200 ఉద్యోగాలకు గాను 15వేల మంది నిరుద్యోగులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలు కంపెనీలలో ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ జాబ్ మేళాలో 5వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించనున్నారని అన్నారు. విద్యను పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం పొందలేరని, అలాంటి వారికోసమే జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐటి రంగంలో ఖమ్మం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించుకుందన్నారు. విదేశాల్లో ఉన్న ఐటి దిగ్గజాలు అయిన ప్రవాస భారతీయులతో మంత్రి కేటిఆర్ ఖమ్మం ఐటి హబ్ గూర్చి ప్రస్తావించడం మనకు గర్వకారణం అన్నారు. పోలీస్ శాఖ భద్రతతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌ని సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, ఎస్బీఐటి విద్యా సంస్థల చైర్మన్ ఆర్జేసి కృష్ణ, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ట్రైనీ ఐపిఎస్ అవినాష్, వివిధ కంపెనీల సిఈవో లు, డైరెక్టర్ లు, హెచ్ఆర్ మేనేజర్ పాల్గొన్నారు.



చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ-వేంసూరు
గ్రామాలలో చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఆదివారం మండల పరిషత్ ఆవరణలో లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మండలంలో 100 కోట్లతో అభివృద్ధి చేశానని మరో 50 కోట్ల మంజూరు చేయించాలని ప్రతి గ్రామపంచాయతీలో చేసిన అభివృద్ధి పనుల బోర్డులు ఏర్పాటు చేయాలని సర్పంచులను ఆదేశించారు. అభివృద్ధి చేయాల్సిన దానికంటే రెట్టింపు చేశానని సంతృప్తి ఉందని మిగిలినది ఒక్కటే పేదలకు పక్కా గృహాలను మంజూరు చేయించే ఓట్లు అడుగుతానని అన్నారు. దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వం లోనే జరుగుతుందని కొన్ని గ్రామాల్లో నాయకులు అపోహలు చెందుతున్నారని ప్రజల్లో లేదనేది గ్రహించాలని చాప నీటిలో నుండి బయటికి వస్తే ఏ విధంగా ఉంటుందో కార్యకర్త అనేవాడు ప్రజల్లోనే ఉండాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణమూర్తి, ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జి రమేష్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, గుత్తా శ్రీనివాసరావు, సర్పంచ్ ఎండి ఫైజుద్దీన్, ఎంపీటీసీ నాయుడు వెంకటేశ్వరరావు, డిసిసిబి డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, మందపాటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



సీసీ రోడ్లను ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-ఖమ్మం
నగరపాలక సంస్థ పరిధిలో సుడా నిధులు రూ.57 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో ప్రతి డివిజన్‌లో నాణ్యమైన రోడ్లను నిర్మిస్తున్నామని, 5వ డివిజన్ బాలాజి నగర్‌లో రూ.20 లక్షలు, 6వ డివిజన్ ఖానాపురం హవేలీలో రూ.37 లక్షలతో విడిఎఫ్ టెక్నాలిజీతో సి.సి రోడ్లను నిర్మించి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రతి డివిజన్‌లో సి.సి రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపర్చుకొని పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం జరిగిందన్నారు. దీన్ని ప్రజలందరు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచి వాతావరణంతో ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం, మున్సిపల్ కార్పొరేటర్‌లు నాగండ్ల కోటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు రమేష్, తొట్టి కొమరయ్య, జోగుపర్తి ప్రభాకర్, కంచర్ల దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ వెంటనే ప్రారంభించి నగదు బదిలీ చేయాలి

- నేడు కలెక్టరేట్ ధర్నా
- జిఎంపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతలచెర్వు కోటేశ్వరావు, తుశాకుల లింగయ్య



నవతెలంగాణ-ఖమ్మం
గొర్రెలు ఎప్పుడిస్తారో స్పష్టమైన తేదీ చెప్పకుండా ప్రభుత్వం యాదవ్, కురుమల చేత డీడీలు కట్టిస్తూ రేపు, మాపు అంటూ గత జూన్, 2022 నుండి ప్రభుత్వం మభ్య పెడుతుందని, ప్రకటనలు పక్కన పెట్టి పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కొత్త కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా చేస్తున్నట్లు జీఎంపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతలచెర్వు కోటేశ్వరావు, తుశాకుల లింగయ్య పిలుపునిచ్చారు. డీడీ కట్టిన వారు, ఇతర సమస్యలు ఉన్న వారందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చెప్పారు. ఆదివారం ఖమ్మంలోని జీఎంపీఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలస్యం చేసినకొద్ది ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిచ్చారు. 10 నెలల క్రితం డిడిలు తీసి ఖమ్మం జిల్లాలో 40 కోట్ల రూపాయలు కట్టించి ఇప్పటి వరకు గొర్రెలివ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు ఈ నెల రోజుల్లో మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా హడావిడిగా వేలాది మందిని డి.డి.లు తీయించారని, ఎన్ని నిధులు ఉన్నాయో చెప్పడం లేదని, ఏ జిల్లాలో ఏ గ్రామంలో ఎవరికి ముందు పంపిణీ చేస్తారనే కనీస ప్రణాళిక లేకుండా అందరిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పాత పద్ధతిలోనే దళారులతో గొర్రెలు పంపిణీ చేయిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా మిగిలిపోయి ఉన్న 3.5లక్షల మంది డి.డి.లు తీయిస్తే ఎన్నికలు వచ్చేలోపు గొర్రెల పంపిణీ సాధ్యపడదన్నారు.
మునుగోడులో చేసినట్లు రాష్ట్ర వ్యాప్తంగా నగదు బదిలీ చేసి గొర్లకాపరులకు నచ్చినచోట ఇష్టమొచ్చిన గొర్రెలు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అడిగినప్పుడల్లా త్వరలో ప్రారంభిస్తామని చెప్పడం విశ్వాసం కోల్పోతున్నారన్నారు. ఇప్పటికే దశలవారిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు, శాసన సభ్యులకు మెమోరాండాలు ఇచ్చామని ఎలాంటి స్పందన లేదన్నారు. మరో వారం రోజుల్లో గొర్రెల పంపిణీ ప్రారంభించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనికి తోడు ప్రతి ఒక్కరూ కుల ధ్రువీకరణ పత్రం, సొసైటీ అధ్యక్షుల లెటర్లు, చనిపోయిన వారికి డెత్ సర్టిఫికెట్, నామినీ వివరాలు అప్ లోడ్ పేరుతో ఇంకా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో 9000 మంది పైగా డిడిలు తీయగా ఇప్పటికీ 2000 మంది దరఖాస్తులు మాత్రమే అప్ లోడ్ చేసినట్లు అధికారులు చెప్తున్నారని, ఇది తతంగమంతా చూస్తే ఇప్పట్లో గొర్రెల పంపిణీ పూర్తవుతుందనే నమ్మకం లేదని అన్నారు. ఈ సమావేశంలో జీఎంపీఎస్ జిల్లా నాయకులు మామిళ్ళ వెంకటేశ్వర్లు, గుమ్మా నర్సింహారావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, అంగిరేకుల నర్సయ్య, యడ్ల తిరుపతి రావు, గజ్జి సూరిబాబు, భట్టు నర్సింహారావు, దొడ్డ లింగస్వామి, గాయం తిరుపతి రావు, రాజబోయిన సైదులు, చీర్ల రాధాకృష్ణ మొర్రి మేకల అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేస్తాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్
- పార్టీ జిల్లా కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-ఖమ్మం
రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్ రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ హత్య అనంతరం దేశం విచ్ఛిన్నకర పరిస్థితులు ఎదుర్కోవాల్సి రావడంతో ఎంతోమందిని మేధావులు రాజీవ్ గాంధీతో మంతనాలు జరిపి ఆయన్ను పార్టీకి దేశానికి నాయకత్వం వహించవలసిందిగా కోరడంతో ఆయన రాజకీయా రంగ ప్రవేశం చేశారని తెలిపారు. విజన్ 2020 పేరుతో అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని ప్రపంచంలో అగ్రభాగాన నిలిపారని కొనియాడారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆనాడు వేసిన పునాదులే నేటి యువత దేశ విదేశాలలో టెక్నాలజీ రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం గాంధీ నగరం లోని రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసినారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, వైరా ఎల్డీఎం కో ఆర్డినేటర్ మద్దినేని రమేష్, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య బాలాజీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు చోటా బాబా, ఖమ్మం నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఏలూరి రవి కుమార్, నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నగర సేవాదళ్ అధ్యక్షులు గౌస్, కొట్టెముక్కల నాగేశ్వరావు, గడ్డం వెంకటయ్య, అవేజ్, హనుమంతరావు, మహమూద్, ముజాహిద్, బండి నాగేశ్వరరావు, నాగటి చంద్రం, ఎస్ కె బాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం 22, మే 2023



ఆకాశవాణిలో ఉగ్రవాద వ్యతిరేక ప్రతిజ్ఞ

నవతెలంగాణ-కొత్తగూడెం

జాతీయ ఉగ్రవాద దినోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తగూడెం రేడియో కేంద్రంలో ఉగ్రవాద వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. 1991 మే 21 మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో ఉగ్రబాంబు దాడిలో బలైనారు. ఈ రోజును జాతీయ ఉగ్రవాద దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం మే 21న ఉగ్రవాద వ్యతి రేక దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా రేడియో స్టేషన్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించరాదని, ఉగ్రవాద నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటు పడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు బైరి శ్రీనివాసన్, కొలిపాక శంకర్‌రావు, సుదర్శన్, దాసరి వెంకటేశ్వరరావు, సింగిరాల శ్రీనివాస్, కట్టా రామకృష్ణ, రవి, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

- మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 20,400 మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బయటికి వెళ్తున్నారని, మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత మూడేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులకు స్వస్తి పలుకుతున్నారని అన్నారు. యస్సీ, యస్టీ, బీసీ లకు గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసిన విధంగానే , మైనారిటీలకు కూడా గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చెయ్యాలని, ఇట్టి విషయాన్ని ముఖ్యమంత్రికి లేఖ ద్వారా తెలియచేయడం జరిగిందని అన్నారు.

ప్రజా గర్జన సభను జయప్రదం చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జూన్ 4వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రాయిగట్టు గ్రామంలో ప్రజా గర్జన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అర్హులైన ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు చేయాలని ప్రతి కుటుంబానికి సంక్షేమ పదకాలు చేరువ చేయాలనే పలు డిమాండ్లతో కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే ప్రజా గర్జన సభకు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు నోముల రామిరెడ్డి, బల్లా సాయికుమార్, తాటిపూడి రమేష్, వీరమ్మ, సతీష్, రాధ, వంశీ, లక్ష్మీ, జానికమ్మ, వీరయ్య, వెంకటేష్, సమ్మక్క, వెంకటమ్మ తిరుపతమ్మ నర్సమ్మ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని మాదారం శివారు అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3500 నగదును స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృత్తిదారుల ఆర్థిక సహకారం రూ.5లక్షలు పెంచాలి

- ఆర్థిక సహకారం ప్రకటింనందుకు ప్రభుత్వానికి అభినందనలు
- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ-పాల్వంచ



వృత్తిదారుల ఆర్థిక సహకారం రూ"5లక్షలు పెంచాలని తెలంగాణ రాజకీయ వృత్తిదారుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి చిటికెన మునలయ్య కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వృత్తిదారులను ఆర్థికంగా ఆదుకోవడానికి, సహకారం ప్రకటించినందుకు, ప్రభుత్వానికి, అభినందనలు. తర తరాలుగా సేవ వృత్తులను నమ్ముకొని లక్షలాది కుటుంబాలు, వేలాది సంవత్సరాలుగా వెలకట్టలేని చాకిరి చేశారు. గత ప్రభుత్వాలు సంక్షేమ పరంగా ఆర్థిక పరంగా పట్టించుకోకపోవడంతో సామాజికంగా ఆర్థికంగా వృత్తిదారులు అత్యంత వెనుకబడి ఉన్నారని అనేక గణాంకాలు తెలిపాయి. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహకారం ఒక్క లక్ష రూపాయలతో, ఇప్పుడున్న, ఆదునిక, సమాజంలో లక్ష రూపాయల పెట్టుబడితో, స్వయం, ఉపాధీ, ఆదునికరణ పెట్టుబడికి, సరిపోదు. ఆ ఆర్థిక సహకారాన్ని, 5 లక్షల వరకు పెంచి వృత్తిదారులను ఆదుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది. ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం, ఆధునిక ధోబీఘాట్‌ల నిర్మాణాలు కొంత ఉపాధికి అవకాశం కల్పించిందని, అదేవిధంగా రుణాలు వృత్తిదారులందరికీ ఇవ్వాలి. విధి విధానాలను పెంచి రాష్ట్ర ప్రభుత్వం వృత్తిదారుల సంఘాలతోటి సమావేశాలు జరిపి సమాచారాన్ని, అభిప్రాయాలు, తీసుకోవాలన్ని, ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాము. జిల్లా అధ్యక్షులు ముదిగొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాత బతుక్కి భరోసా

నవతెలంగాణ-మణుగూరు



అందమైన గుండ్రని చేతిరాత బంగారుబతుక్కి భరోసానిస్తుందని భరోసా గౌరవ అధ్యక్షులు ఎం.లింగ బాబు అన్నారు ఆదివారం పీవీ కాలనీ భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత హ్యాండ్ రైటింగ్ శిక్షణ తరగతులు పూర్తి అయిన సందర్భంగా 65 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సర్టిఫికెట్ల పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే బోధనలను ఏకాగ్రతతో ఆకళింపు చేసుకోవడం ఒక ఎత్తైతే ఆకళింపు చేసుకున్న అంశాన్ని అందమైన గుండ్రని చేతిరాతతో అక్షర రూపం ఇచ్చి తమ భావాన్ని వ్యక్తీకరిస్తే పరీక్షలలో చక్కని ఫలితాలు వస్తాయని అన్నారు. విద్యార్థిని విద్యార్థుల ఉన్నతికి అందమైన గుండ్రని చేతిరాత ఎంతగానో దోహదపడు తుందనీ అన్నారు. కూనవరం సర్పంచ్ ఏనిక ప్రసాద్ మాట్లాడుతూ తమతో పాటు తన చుట్టూ ఉన్న సమాజం కూడా బాగుండాలని కోరుకోవడం తమ శక్తి మేరకు చక్కటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులను ఆయన అభినందించారు. మణుగూరుకు చెందిన ప్రముఖ హ్యాండ్ రైటింగ్ (చేతిరాత) శిక్షకులు షేక్ మహబూబ్ హుస్సేన్‌ను సభలో శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూనవరం సర్పంచ్ ఏనిక ప్రసాద్, భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎండి అమీనుద్దిన్, బి.స్వరూప రాణి, బి.శశికిరణ్, జహీర్ ఖాన్, దీపక్, పి.విల్సన్ రాజ్, ఎండి ముజఫర్, జయకర్, యాకూబ్ పాషా, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి బంగారం నేత్రాలు, కల్యాణ బొట్టు వితరణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని నడికుడి గ్రామంలో గల శ్రీ మహంకాళి చాముండేశ్వరి అమ్మవారికి రిటైర్డ్ ఎస్ఐ మల్లుల వెంకటరామారావు, చంద్రకళ దంపతులు బంగారపు నేత్రాలు, కళ్యాణ బొట్టు, పట్టు చీరను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు యశ్వంత్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు అప్కా శంకర్, రత్తమయ్య రాముడు, కల్లూరి వెంకటరమణ, తిరుపతిరావు, సోయం కోటేశ్వరరావు, కొమరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రేగా

నవతెలంగాణ-మణుగూరు



సీఎం కేసీఆర్‌ను ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రేగా కాంతారావు పలు సమస్యలను సీఎం కేసీఆర్ ముందుఉంచగా పరిష్కారానికి తక్షణ ఆదేశాలు ఇచ్చారని అన్నారు. పినపాక నియోజకవర్గం పులుసు బొంత ప్రాజెక్ట్ పెండింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారని తెలిపారు. కరకట్ట నిర్మాణానికి సుమారు రెండువేల కోట్లతో అంచనాలు పూర్తయ్యాయని, త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులకు సీఎం ఆదేశించారన్నారు. వరద బాధితుల పెండింగ్ సాయం 2.5 కోట్లు తక్షణం విడుదల చేయాలని ఆదేశించారని తెలిపారు. పినపాక నియోజకవర్గం చెక్ డ్యాములు మరికొన్ని మంజూరు చేయాలని వారు విన్నవించగా సీఎం సానుకూలంగా స్పందించి తక్షణమే మంజూరు చేయాలని సీఎంవో కార్యదర్శి స్మిత సబర్వాల్‌ను ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్-4 పరీక్ష నిర్వహణకు

పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ పాల్వంచ

జూలై 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న గ్రూప్ 4 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు, కేంద్రాల్లో సౌకర్యాలపై ప్రతిపాదనలు అందచేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రూప్ 4 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాలు ఎంపికపై ఆదివారం రెవిన్యూ, విద్యా, డిపిఓ, డిఆర్ డిఓ, జడ్పి సీఈఓ, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, యంపిడిఓలు, ఎంపివోలు తదితరులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంపిడిఓ, యంపిఓ, తహసిల్దార్, యంఈఓలు పరీక్ష నిర్వహణకు ఎంపిక చేయాల్సిన కళాశాలలు, పాఠశాలలు పరిశీలన చేసి నివేదిక అందచేయాలని చెప్పారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, మణుగూరు, ఇల్లందు, భద్రాచలంలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలకు దాదాపు 30 వేల మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నదని చెప్పారు. పేర్కొన్న మండలాల్లో కళాశాలలు, పాఠశాలలు తనిఖీ చేపట్టి జారీ చేసిన చెక్ లిస్టు ప్రకారం ధృవీకరణ నివేదికలు అందచేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలు



ఏర్పాటు చేయనున్న కేంద్రాల్లో విద్యుత్, కుర్చీలు, ఫ్యాన్లు, ప్రహరిగోడలు, సిసి కేమేరాలు, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలను నివేదికలో తెలియచేయాలని చెప్పారు. ఎంపిక చేసిన కేంద్రాల చిరునామా పకడ్బందిగా తెలియచేయాలని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టిక్కెట్లులో పరీక్షా కేంద్రం చిరునామా ప్రచురించనున్నందున, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలు సులభంగా తెలుసుకోవడానికి వీలుగా చిరునామా స్పష్టంగా తెలియచేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలు ఏర్పాటుకు ఎంపిక చేయనున్న పాఠశాలలు, కళాశాలలను తహసీల్దార్లు, విద్యా యంపిడిఓలు, యంపిఓలు సంయుక్తంగా తనిఖీ చేసి రేపటి వరకు 22వ తేదీ సోమవారం వరకు నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ప్రతిపాదించిన పాఠశాలలు, కళాశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేపించాలని పంచాయతీ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో డీఈఓ సోమశేఖరశర్మ, డిపిఓ రమాకాంత్, డిఆర్డిఓ మధుసూదన్ రాజు, జడ్పి సిఈఓ విద్యాలత, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు రఘు, అంకుష్ వలి, ఉమా మహేశ్వరావు, ఆయా మండలాల మండలాల తహసిల్దార్లు, ఎంపిడివోలు, యంపిఓలు తదితరులు పాల్గొన్నారు.


గుండెపోటుతో వామపక్ష వాది

తాళ్లూరి కృష్ణమూర్తి మృతి

నవతెలంగాణ-మణుగూరు



కార్మిక పక్షపాతి సౌమ్యుడు, వామపక్ష వాది తాళ్లూరి కృష్ణమూర్తి (67) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం మరణ వార్త తెలుసుకున్న కార్మిక సంఘాల నాయకులు, సీపీఐ(ఎం), సీపీఐ వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభిమానులు ప్రముఖులు ఆయన మృతికి సంతాప సానుభూతి తెలిపారు. తాళ్లూరు కృష్ణమూర్తి ఏన్కూరు మండలం పోరాటాల గడ్డ ఉద్యమాలకు పుట్టినిల్లు లచ్చగూడెం గ్రామంలో తాళ్లూరు కోటయ్య అన్నపూర్ణమల రెండవ సంతానం. ఆయన తోడ ఒక అక్క, నలుగురు చెల్లెలు, భార్య సంధ్యారాణి, కుమారులు రాము, రఘు ఉన్నత చదువులు అనంతరం వివిధ ఉద్యోగాలలో స్థిరపడ్డారు.



కృష్ణమూర్తి తండ్రి కోటయ్య స్వతంత్ర సమరయోధులు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలలో పాల్గొన్నారు. అనేకసార్లు నిర్బంధాల గురయ్యారు. గుల్బర్గా జాల్నా లలో జైలు జీవితం అనుభవించారు. కృష్ణమూర్తి పెదనాన్నలు కోదండరామయ్య, కాంతయ్యం కూడా రజాకార్లకు వ్యతిరేకంగా వివిధ పోరాటాలలో పాల్గొన్నవారు. కోదండరామయ్య తూతక లింగన్నపేటలో ఎన్కౌంటర్ గురయ్యారు. కృష్ణమూర్తి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌లో క్రియాశీలక సభ్యులు అభిమాని ఆయన లేని లోటు తీర్చలేనిదని సిఐటియు సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, నంద ఈశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, నాయకులు పుల్లారెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు (కె.వి.రావు), టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఊకంటి ప్రభాకర్‌రావు కృష్ణమూర్తి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలిపారు.

నాకు తెలియకుండానే పంట పొలంలో మట్టి తోలకాలు

- న్యాయం చేయాలంటూ వేడుకుంటున్న బాధిత రైతు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



సీతమ్మ సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు కరకట్టల నిర్మాణ పనుల కోసం పనులు దక్కించుకున్న ఎల్ఎన్‌టి సంస్థకు చెందిన గుత్తేదారు తనకు తెలియకుండానే తన పంట పొలంలో మట్టి తోలకాలు సాగించారని ఆరోపిస్తూ చిన్నబండిరేవు గ్రామానికి చెందిన పిట్టా పూర్ణచంద్రరావు అనే భాదిత రైతు ఆదివారం విలేకరులకు తెలిపాడు. పెద్దనల్లబల్లి రెవిన్యూ విలేజ్ పరిధిలోని పెద్దనల్లబల్లి గ్రామంలో గల 62/అ సర్వే నెంబర్‌లో 3 ఎకరాల పంట సాగు భూమి ఉందన్నారు. అట్టి పట్టా పొలంలో తనకు తెలియకుండా సుమారు అర ఎకరం భూమిలో 10 అడుగులు ఎత్తు, 12 అడుగుల వెడల్పు, 300 మీటర్లు వెడల్పు విస్తీర్ణంలో నా పంట పొలం నుండి సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కరకట్టల నిర్మాణం కోసం మట్టి తోలకాలు సాగించినట్లు స్థానిక రైతుల ద్వారా తనకు తెలిసిందన్నారు. దీంతో పాటు పంట పొలంలో ఉన్న సుమారు 20 తాటి చెట్లను సైతం తొలగించారని భాదిత ఆరోపించాడు. తనకు తెలియకుండి తన పట్టా పొలంలో మట్టి తోలకాలు సాగించిన ఎల్ఎన్‌టి సంస్థ నుండి తనకు తగు పరిహారం అందించే విదంగా ప్రభుత్వం అధికారులు న్యాయం చేయాలంటూ భాదిత రైతు వేడుకుంటున్నాడు.

ఆయిల్ ఫాం మొక్కలు పరిశీలించిన క్వారంటైన్ బృందం

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఈ ఏడాది వ్యవసాయ అదును సమయం దగ్గర పడటంతో త్వరలో నూతన సాగుదారులకు ఆయిల్పెడ్ మొక్కలు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో మొక్క పెరుగుదల, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడానికి ఉద్యాన నిపుణుల బృందం ఆదివారం స్థానిక ఫాం ఆయిల్ కేంద్రీయ నర్సరీని సందర్శించి మొక్కలును పరిశీలించారు. పీపీఈ రాహుల్ మిశ్రా, డిఐఎ ఉమాదేవి, పీపీఓ రామక్రిష్ణా రెడ్డిలు ఫాం ఆయిల్ మొక్కలు ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసారు. పంపిణీ సమయంలో మొక్కలు పాట్లు తీసుకోవాల్సిన పలు భద్రత చర్యలను ఆయిల్పెడ్ డి.ఓ బాలక్రిష్ణకు వివరించారు. ఈ కార్యక్రమంలో మీ ఫైనాన్స్ ఎక్జిక్యూటివ్ రాధా క్రిష్ణ, ఏరియా ఆఫీసర్ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌లు ఉన్నారు.

మట్టిలో మాణిక్యం డాక్టర్ మానస...

నెరవేరిన కళ



ప్రభుత్వ నిర్వాకం

2016లో నవతెలంగాణలో వెలువడిన కథనం



- పట్టుదలతో ఉన్నత స్థాయికి
- నవతెలంగాణ కధనాలు, కోర్టు ఆదేశాలతో కోల్పోయిన ఎంబిబిఎస్ సీటు సాధించిన ఘతన
- నేడు సులానగర్ వైద్యశాలలో డాక్టరమ్మగా విధుల్లో
- సంతోషంలో కుటుంబం, అభినందిస్తున్న ప్రజలు

> చదవాలనే పట్టుదల ఉండాలేకాని పేదరికానికి చదువు అడ్డుకాదు. పట్టుదల ఉంటే సాధించలేనిదేమి లేదు. మనిషి జీవితంలో ఓదార్పు పట్టుదల గెలుపుకు సోపానాలని నిరూపించింది డాక్టర్ మానస. పేదరికంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే ఎంసెట్ రాసి ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు పొందింది. అంగాహనా లోపంతో సీటు కోల్పోయింది. ఎంతో కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు కోల్పోయినప్పటికీ ప్రధానంగా నవతెలంగాణ దినపత్రిక కథనాలు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సహకారం, హైకోర్టు ఆదేశాలతో మళ్ళీ ఎంబిబిఎస్ సీటు సాధించి కోర్సు పూర్తి చేసింది. తాజాగా టేకులపల్లి మండలంలోని సులానగర్ ప్రాథమిక వైద్యశాలలో డాక్టర్‌గా ఉద్యోగం పొందింది. అందరికీ స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం.

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని అప్పటి హమాలి బస్తీ (నేడు ఆర్ఆర్ కాలనీ)లో మద్ది జయప్రకాష్, కళావతి దంపతులకు నలుగురు సంతానం. ముగుర్గు కూతుళ్ళు, ఒక కొడుకు ఉన్నారు. వారంతపు సంతలో కూరగాయలు అమ్మడం, తల్లి కళావతి ఉన్న ఒక్క బర్రె పాలు పిండి వచ్చే డబ్బుతో కుటుంబాన్ని నడిపించేవారు. పేద కుటుంబం. అయినప్పటికీ పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. పెద్ద కూతురు మద్ది శిరీష కేంద్రీయ విద్యాలయంలో 6 నుండి ఇంటర్ వరకు చదివింది. ఇంటర్‌లో జిల్లా స్థాయి ర్యాంకు సాధించింది. ఐఐటి కౌన్సెలింగ్‌కు కొద్ది రోజుల ముందు విధి వక్రీకరించింది. తన స్నేహితురాలి వివాహానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా పాలేరు సమీపంలోనే బస్సు ఢీ కొట్టడంతో మృత్యువాత పడింది. మద్ది మానస రెండవ కూతురు. చురుకుదనం. డాక్టర్ కావాలనే చిన్నప్పటి నుండి కోరిక. ప్రయివేటు స్కూల్స్‌లో చదవాలంటే అధిక ఫీజులు. మోయలేని భారం. మంచి ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలలో చదివితే డాక్టర్ కావచ్చనే ఆలోచన వచ్చింది. దీంతో కేంద్రీయ విద్యాలయం నిర్వహించిన పరీక్ష రాసింది. తన అక్క శిరీష చదివిన ఖమ్మం జిల్లా పాలేరు కేంద్రీయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం పొందింది. ఇంటర్‌లో 86 శాతం మార్కులతో జిల్లా ర్యాంకు సాధించింది. పట్టుదలతో ఎంసెట్‌కు ప్రిపేర్ అయ్యింది. 160 మార్కులకు 136 సాధించింది. 1,355 ర్యాంక్ వచ్చింది. కల ఫలించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. సెప్టెంబర్ 24న జాయిన్ అయ్యింది. కళాశాల ఫీజు 10,500, ట్యూషన్ ఫీజు రూ.12,815, హాస్టల్ ఫీజు రూ.15,000 కట్టింది. మూడు రోజులు ఓరియంటేషన్ క్లాసులకు హాజరయ్యింది. అయితే ఇల్లందు నుంచి మహబూబ్‌నగర్ చాలా దూరంలో ఉండటంతో రెండవ కౌన్సిలింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఇంకా దగ్గరలో సీటు వస్తుందని భావించింది. దీంతో రెండవ కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్‌లో ఆప్షన్‌లు ఇచ్చుకుంది. ఆదిలాబాద్ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. మహబూబ్‌నగర్ కన్నా ఆదిలాబాద్ ఇంకా దూరంలో ఉండటంతో ఆ సీటు వద్దు అనుకొని మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలకే వెళ్లింది. ఓరియంటేషన్ క్లాస్‌లకు హాజరవుతోంది. ఇలా ఉండగా మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల విద్యార్థిని తండ్రి జయప్రకాష్‌కు ఫోన్ వచ్చింది. విద్యార్థుల ఫైనల్ లిస్ట్ వచ్చింది. అందులో ' మీ అమ్మాయి' పేరు లేదని, యూనివర్శిటీకి వెళ్లి కనుక్కోండని చెప్పారు. దీంతో జయప్రకాష్ హైదరాబాదులోని కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్శిటీకి వెళ్లి రిజిస్ట్రార్, వైస్ ఛాన్సలర్‌లను కలిసి సమస్య వారి దృష్టికి తీసుకెళ్లాడు. 'మీ అమ్మాయి రెండవ ఆప్షన్ పెట్టుకుంది. దీంతో ఆదిలాబాద్‌లో మెడికల్ సీటు వచ్చింది. మీకు ఇష్టం లేకపోతే అక్కడికి వెళ్లి రిపోర్టు చేయాల్సింది. చేయలేదు. దీంతో ఆదిలాబాద్‌తో పాటు మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలోనూ సీటు కూడా కోల్పోయింది. జాబితా కూడా ఎంసీఐకి పంపాం. ఏమి చేయలేం' అని చెప్పడంతో జయప్రకాష్ కన్నీంటిపర్యంతమయ్యాడు.

ప్రభుత్వ నిబంధనలు తెలియక, మెడికల్ కళాశాలల తీరుతో ఎంబీబీఎస్ విద్యార్థిని తనకు లభించిన సీటు కోల్పోయింది. ప్రధానంగా నవతెలంగాణకు విషయం చెప్పడంతో పలు కథనాలు జిల్లా, మెయిన్ పేజీల్లో ప్రచురితమయ్యాయి. దీంతోపాటుగా పలు పత్రికలు, ఛానళ్ళలో వారం రోజులపాటు మారుమోగింది. మానవతా దృక్పథంతో తనకు వచ్చిన సీటు ఇప్పించాలని స్థానిక అప్పటి ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, అధికారులను, జిల్లా కలెక్టర్, మంత్రులు, సీఎంను, వేడుకుంది. సీపీఐ(ఎం)తో పాటుగా పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు మానసకు బాసటగా నిలిచి పేద విద్యార్థినికి మెడికల్ సీటు ఇవ్వాలని ప్రభుత్వ దృష్టికి సమస్య తీసుకెళ్ళారు. దీంతో హైకోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. అందరి కృషి ఫలించింది. మద్ది మానసకు కోల్పోయిన మెడికల్ సీటు తిరిగి ఇవ్వాల్సిందిగా నాటి ఎంసిఐ(మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)ను హైకోర్టు ఆదేశించింది. దీంతో నవంబర్ 2016లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు లభించింది. కోర్సు పూర్తి కావడంతో నేడు టేకులపల్లి మండలంలోని సులానగర్ ప్రాథమిక వైద్యశాలలో డాక్టర్‌గా ఉద్యోగం పొందింది. అందరికీ స్ఫూర్తిగా నిలిచింది. పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

కూతురు డాక్టర్ కావడం ఆనందకరం : తల్లిదండ్రులు మద్ది జయప్రకాష్ కళావతి

మేము ఉన్నత చదువులు చదవలేదు. నా కూతురు డాక్టర్ అయ్యిందంటే ఎంతో గర్వంగా ఉంది. పిల్లలు ప్రయోజకులైతే ఎక్కడా లేని ఆనందం. నా జీవితం సార్ధకమైంది. తల్లిదండ్రుకులకు మంచి పేరు తెచ్చిపెట్టింది. చిన్నప్పటి నుండి పట్టుదలతో చదివింది. డాక్టర్ కవాలనే ఆశయం నెరవేరింది.

పేదలకు సేవ చేస్తా : సహకరించిన అందరికీ కృతజ్ఞతలు... డాక్టర్ మద్ది మానస

నా చిన్నప్పటి కల నెరవేరింది. డాక్టర్‌ను కావడానికి తల్లి దద్రులు, కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. ఎంతో కష్టపడి తల్లిదద్రులు చదివించారు. కోల్పోయిన ఎంబిబిఎస్ సీటు మళ్లీ తిరిగి పొందడానికి సహకరించిన మీడియాకు, ఉన్నత న్యాయస్థానానికి తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. వారి ఆశయాలు నెరవేరుస్తాను. పేదలకు సేవ చేయడమే ధ్యేయం. భవిష్యత్తులో నిరుపేదలకు, రోగులకు సేవ చేయడం, ఆర్థికంగా సహాయసహకారాలు అందిచడానికి పాటుపడతాను.



లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా భీమవరపు వెంకటరెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం టౌన్

లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం 2023 నుండి 2024 సంవత్సరం గాను లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా భీమవరపు వెంకటరెడ్డి, గుండి శరత్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు కోశాధికారిగా భరత్ కుమార్ ఉపాధ్యక్షులుగా భోగాల శ్రీనివాస్ రెడ్డి, కంభంపాటి సురేష్, పిఆర్ఓగా బిల్లిపల్లి రంగారెడ్డి సాయి కార్యదర్శిగా ఆడబల వెంకటేశ్వర్లను ఆదివారం లయన్స్ క్లబ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భీమవరపు వెంక రెడ్డి మాట్లాడుతూ భద్రాచలానికి ప్రతి సంవత్సరం వరదల సమయంలో క్లబ్ ఆఫ్ భద్రాచలం చేసే సేవలను కొనసాగిస్తూనే భద్రాచలం పట్టణవాసులు కావలసిన సదుపాయాలను కల్పించేందుకు క్లబ్ భద్రాచలం కృషి చేస్తుందని తెలియజేశారు. లయన్స్ క్లబ్ భద్రాచలం చేస్తున్నటువంటి సేవ కార్యక్రమాలను మరింత విస్తృతపరిచి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు కలెక్టరేట్ ఎదుట వీఓఏలు ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్రంలో గ్రామస్థాయి వీఓఏలు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని చాలాసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చాము కానీ పనికి తగిన గుర్తింపు గానీ వేతనంగానే ఇవ్వడం లేదు. రోజురోజుకీ పని భారం పెంచుతూ పని భద్రత కల్పించకుండా ఐకెపివీఎల్‌ను ప్రభుత్వం విస్మరిస్తున్నది. ప్రభుత్వం ఐకెపి వీవోఏలకు కనీస వేతనం అమలు చేయాలని సమస్యలు పరిష్కరించాలని 2023 ఏప్రిల్ మూడవ తేదీ నుండి ఏప్రిల్ 16 వరకు ఆన్లైన్ పనులు బంద్ చేశారు. ఏప్రిల్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహించారు. సమ్మె సందర్భంగా గత 30 మూడు రోజులుగా వివిధ రూపాలలో సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు నిర్వహించాము. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఏ మాత్రం స్పందన లేదు. సమ్మె డిమాండ్ల పరిష్కారం తక్షణమే ప్రభుత్వం చర్చలకు పిలవాలని సిఐటియు డిమాండ్ చేసింది. రాష్ట్రంలో వచ్చిన ఎనిమిదేళ్ల దాటిన బతుకులు ఏమి మారలేదు కేవలం 3900 మాత్రమే చెల్లిస్తున్నారు. కొత్త కొత్త సర్వేలు చేపిస్తున్న పని భారం పెంచుతూ ఎప్పటికీ కనీస వేతన ఇవ్వమని పోరాటం చేస్తున్న వివోఏల పట్ల ప్రభుత్వం కనీస దృక్పథం లేకుండా ప్రభుత్వ వైఖరి ఉంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మా కడుపు కొట్టొద్దు

- తోగ్గూడెం గిరిజనులు ఆవేదన



నవతెలంగాణ-మణుగూరు

50 ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్నా పట్టా భూములలో ఫారెస్ట్ అధికారులు ట్రంచ్ కొట్టడం దారుణమని సాగుభూములు లాక్కోవడం వలన జీవన ఉపాధిని కోల్పోతున్నామని, మా భూములను ఫారెస్ట్ అధికారులు తీసుకోవద్దని, మా కడుపులు కొట్టొద్దని ఆ భూములు గ్రామానికి చెందిన రైతులకు చెందినవని సర్పంచ్ బొగ్గం రజిత, గ్రామ పెద్ద ఊకె వీరయ్య అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో 30 మంది గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ గతంలో గ్రామంలోని భూములేని పేదలందరూ 146 ఎకరాలు పోడు కొట్టుకున్నారన్నారు. ఫారెస్ట్ అధికారులు మొత్తం ఆక్రమించుకొని 12 ఎకరాలు మాత్రమే పోడు సర్వే నిర్వహించి పట్టాలించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నదన్నారు. గత మూడు రోజులుగా అనేక వదంతులు పుకార్ల కారణంగా ఫారెస్ట్ అధికారులు 50 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న పట్టా భూములలో అనుమతులు లేకుండా ట్రంచులు కొట్టారన్నారు. పోడు భూములు, పట్టా భూములకు మధ్య రెండు కిలోమీటర్ల దూరంలో పోడు భూములు ఉన్నాయన్నారు. సర్వేనెంబర్ 203లో ఎనిమిది ఎకరాలు సాగు భూమిలో ట్రెంచ్ కొనడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మాకు అండగా ఉండి, మాకు భూములు దక్కేవరకు మాతో కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో ఆదినారాయణ, బండారి సీత, మడకం గోపమ్మ కొమరం విజయ, తాటి లక్ష్మి, మీడియం తిరుపతమ్మ, తెల్లం శ్రీదేవి, బుచ్చిబాబు సుమారు 30 మంది ఆదివాసి మహిళలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలంటే జీవన శైలిలో మార్పు రావాలి

నవతెలంగాణ-మణుగూరు

పర్యావరణంలో అభివృద్ధి కావాలంటే ప్రపంచ వ్యాప్తంగా మానవ జీవన శైలిలో మార్పు రావాలని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. ఆదివారం మణుగూరు ఏరియా జీఎం ఆఫీస్‌లో పర్యావరణహిత జీవనశైలి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేట్ ఆదేశాల మేరకు మణుగూరు ఏరియా జిఎం కార్యాలయం లోఏరియా మెయిన్స్, విభాగాల అధిపతులు, అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మణుగూరు ఏరియా జిఎం దుర్గాం రామచందర్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఏరియా కన్వీనర్ అధికారి జే.శ్రీనివాసరావు, మిషన్ లైఫ్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిఎం ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవనశైలి గురించి తెలుసుకొని తమ జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్టెప్ ఫ్యామిలీ క్లబ్ రోజు అందరూ విధిగా వాహనాలలో కాకుండా నడుచుకుంటూ క్లబ్బుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమం నందు ఎస్‌ఓటిజిఎం లలిత్ కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జి.నాగేశ్వరరావు, శ్రీనివాస చారి, ఏరియా ఇంజనీర్స్ జి.నర్సిరెడ్డి, ఏరియా కన్విరాన్మెంట్ అధికారి జే.శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్లు ప్రాజెక్ట్ ఇంజనీర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పట్టణ మాజీ కార్యదర్శి రాములు మృతి



నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు సీపీఎం పార్టీ నిర్మాతల్లో ఒకరు, పార్టీ పట్టణ మాజీ కార్యదర్శి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) లో ముఖ్యులు అల్లా దుర్గం రాములు (రాములు మేస్త్రి) (80) అనారోగ్యంతో ఆదివారం జగదాంబ సెంటర్ సమీపంలోని వారి గృహంలో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే సిపిఎం, సిఐటీయు నేతలు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, తాళ్ళూరి కృష్ణ, ఎండి. అబ్బాస్, కార్యకర్తలు, అభిమానులు, బంధువులు పార్ధీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 1980 నుండి రెండున్నర దశాబ్దాల పాటు సిపిఎం పార్టీ, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. పేదలు, కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్మించారు. 1987లో ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఎం పార్టీ ఘనవిజయానికి కృషి చేశారు. వారి అంత్యక్రియలు మంగళవారం ఉదయం 10గంటలకు ఇల్లందులోని జగదాంబ సెంటర్ వారి స్వగృహం నుండిప్రారంభం కానున్నట్లు మండల కార్యదర్శి అబ్దుల్ నబీ తెలిపారు.

ఇక రిటైర్మెంట్ తీసుకోండి ఎమ్మెల్యే వనమా

- నాలుగు నెలలు గడిస్తే అంతా సెట్ అవుతుంది
- డాక్టర్ జిఎస్ఆర్ ట్రస్టు ఫౌండర్, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు



నవతెలంగాణ-కొత్తగూడెం

తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇంకెన్ని రోజులు ప్రజలను బెదిరిస్తారని, నాలుగునెలలు గడిస్తే అన్ని సెట్ అవుతాయని, 80 ఏండ్లు వచ్చాయి ఇక సెలవు తీసుకోండి పెద్దాయన అని డాక్టర్ గడల శ్రీనివాసరావు మాటలు హీట్ పెంచాయి. డాక్టర్ జిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వాలీబాల్ టోర్నమెంట్స్ నిర్వహించారు. గెలుపొందిన క్రీడా జట్లకు మెంమోంటో, ప్రశంసా పత్రాలు అందజేశరు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడారు. ఆయన చేసిన కామెంట్స్ తొలిసారి రాజకీయాల్లో వేడిపుట్టించాయి. సేవా కార్యక్రమాలకు వచ్చే వారిని బెదిరింపులకు పాల్పడం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. గత ఎన్నికలే నాకు లాస్ట్ అని... ప్లీజ్ ఒక్కసారి గెలిపించండీ అని ప్రజలను వేడుకున్న ఆయన ఈ సారి మళ్లీ పోటీలో ఉంటానని చెప్పాడం విడ్డూరంగా ఉందన్నారు. పెద్దాయన ఇక రెస్టు తీసుకో....80 ఏండ్లు వచ్చాయి... రిటైర్డ్ మెంట్ తీసుకో అని సూచించారు. ఇంకా ఎంత కాలం వృద్ధాప్యంలో కష్టపడుతారు...అని సూచించారు. ఉల్వనూరు గ్రామంలో వాలీబాల్ పోటీల సందర్భంగా డాక్టర్ గడల హాట్ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.

నేను మంచి చేయడానికి వస్తే...నావాళ్లని అడ్డుకుంటారా....? ఇది మంచి పద్ధతి కాదాని హితవు పలికారు. ఫోన్‌చేసి బెదిరింపులు చేయడం సరికాదాని హెచ్చరించారు. ఆదివాసీ ప్రాంతాల్లో తన తండ్రి 50 ఏళ్ళు ఆయుర్వేదిక్ డాక్టర్‌గా తిరుగుతూ సేవ చేసేవారన్నారు. ఆదివాసీలు తమను గుండెల్లో పెట్టుకున్నారని వారి ఋణం తీర్చుకోలేనిదన్నారు. మరో 4నెలలు ఓపిక పట్టండి అన్నీ సెట్ అవుతాయన్నారు. కొత్త కొత్తగూడెంను చూద్దామని, కొత్త కొత్తగూడెం నిర్మించుకుందామని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన టీంలకు బహుమతులు అందజేశారు.



బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఆత్మ కమిటీ చైర్మెన్ భద్రయ్య

నవతెలంగాణ-పినపాక

బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆత్మ కమిటీ చైర్మన్ భద్రయ్య పిలుపునిచ్చారు. జానంపేట గ్రామపంచాయతీ నందు బూత్ నెంబర్ 51 సమన్వయ బత్తుల నంద ఆధ్వర్యంలో 51 బూత్ నంబర్ ఇంచార్జ్ బీయల మురళీ నియమించడం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆత్మ కమిటీ చైర్మన్ పటేల్ భద్రయ్య నాయుడు తెలిపారు. అనంతరం జానంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ భద్రయ్య మాట్లాడుతూ భవిష్యత్తు కార్యాచరణ గురించి తగు సూచనలు బూత్ కమిటీ వారికి ఇవ్వడం జరిగింది. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు గడపగడపకు చేరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డాక్టర్ రవి శేఖర్ వర్మ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ పటేల్ కామేశ్వరరావు, ఎంపీటీసీ కాయం శేఖర్, అమరారం సర్పంచ్ మొగిలిపల్లి నరసింహారావు, బెడద శ్రీను, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడింది

- మాజీ ఎమ్మెల్యే జలగం



నవతెలంగాణ-దమ్మపేట

దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని ప్రతిపక్షం అనేదే లేదని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు స్పష్టం చేశారు. ఆదివారం దమ్మపేట మండలం, పట్వారిగూడెం గ్రామంలో ఒక పామాయిల్ తోటలో జలగం వెంకట్రావు తన ఆత్మీయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలగం మాట్లాడుతూ ఈ సమావేశానికి ఎటువంటి రాజకీయ ప్రాధాన్యత లేదని తెలిపారు. తాను చేసిన అభివృద్ధిని డప్పుకొట్టుకుంటూ తిరిగే వ్యక్తిని కాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల ఆలోచన చాలా వ్యత్యాసంగా ఉందని తన 20 ఏళ్ళ రాజకీయ అనుభవంతో ప్రజల్లో తిరుగుతూ చెబుతున్నానని అన్నారు. తన రాజకీయ పంథా ప్రారంభం నాటి నుండి నేటి వరకు ఎటువంటి మార్పూ లేదని పేర్కొన్నారు. పీపుల్స్ మేండెట్ ప్రకారం తాను ప్రణాళికతో ముందుకు కొనసాగుతానని అన్నారు. తాను 2014 నుండి 2018 వరకు కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలను అందజేశానని పేర్కొన్నారు. కొత్తగూడెం ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందకపోతే చాలా వెనుకపడుతుందని గత 5 సంవత్సరాలుగా కొత్తగూడెం ప్రాంతం నుండి ప్రజలు ఉపాధి కోసం వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 2004 లో సత్తుపల్లి శాసన సభ్యుడిగా ఉన్నప్పుడు అశ్వారావుపేట, దమ్మపేట మండలాలలో ఐటిడిఎ ఆధ్వర్యంలో జామాయిల్ మొక్కలు నాటుతూ ఉంటే రైతులకు అవగాహన కల్పించి ఐటిడిఎ అధికారులతో మాట్లాడి పామాయిల్ తోటలు పెంచే విధంగా తాను కృషి చేశానని తెలిపారు. అశ్వారావుపేటలో ఏర్పాటు చేసినటువంటి అగ్రికల్చర్ కాలేజీలో తాను ప్రభుత్వంతో మాట్లాడి హార్టీకల్చర్ విభాగాన్ని సైతం ఏర్పాటు చేశానని, తాను లేని సమయంలో హార్టీ కల్చర్ విభాగాన్ని ఆంధ్రాలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తాను ఏర్పాటు చేసే ఆత్మీయ సమ్మేళనాలు రాజకీయ ప్రయోజనంతో కూడుకున్నవి కావని మన ప్రాంతం అభివృద్ధి చెందిందా, లేదా అనే ఆలోచనతో ప్రజా ప్రయోజనం కోసం తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. రాజకీయంగా ఎంతోమంది పార్టీల నుండి టిక్కెట్లు ఆశించడంలో తప్పేమీ లేదని వాటిని పట్టించుకోవలసిన అవసరం లేదని తన రాజకీయ జీవితంలో తాను ఎవరినీ వ్యక్తిగతంగా నిందించడంలేదని తెలిపారు. రాజకీయాలు మాట్లాడటానికి ఇంకా సమయం ఉందని నోటిఫికేషన్ వచ్చిన అనంతరం తాను మాట్లాడతానని ఆ సమయంలోనే అన్ని విషయాలు సూటిగా వివరిస్తానని తెలపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి వచ్చినటువంటి జలగం అభిమానులను స్వయంగా వెంకట్రావు స్వాగతం పలికి భోజన వసతులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, దమ్మపేట , మండలాలతో పాటు కొత్తగూడెం నియోజకవర్గం నుండి సుమారు 200 కార్ల కాన్వాయితో పట్వారిగూడెం చేరుకున్నారు.

కార్యకర్తలే నా బలం.. ప్రజలే నా దేవుళ్ళు

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే వనమా



నవతెలంగాణ-కొత్తగూడెం

కార్యకర్తలే నా బలమని, ప్రజలే నా దేవుళ్లని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని సుమారు15 వార్డులకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక రామ టాకీస్ ఏరియాలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమా ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే బీఆర్ఎస్ గెలుపుకు దోహదం చేస్తాయన్నారు. ఎవరిని కుట్రలు, కుతంత్రాలు చేసిన, వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం నుండి పోటీ చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ, కొత్తగూడెంలో వనమా గెలుపు ఆపే శక్తి ఎవరికీ లేదని ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.3వేల కోట్లుతో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, నాయకులు బీఆర్ఎస్ నాయకులు రజాక్, కాసుల వెంకట్, కౌన్సిలర్లు కోలాపూరి ధర్మరాజు, అఫ్జల్ ఉన్నీసా బేగం, అంబుల వేణు, పల్లపు లక్ష్మణ్, కో-ఆప్షన్ సభ్యులు కనుకుంట్ల పార్వతి, దుంపల అనురాధ, నాయకులు కెకె. శ్రీను, కొండా స్వామీ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకమే శిలలా నిలిచింది


- బస్టాండ్ బతుకును బాగు చేసేది ఎవరు
- రూ.41 లక్షల అభివృద్ధి పనులు ఇంకెప్పుడు ప్రారంభిస్తారు
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్

నవతెలంగాణ-పాల్వంచ

నవ్వి పోతారు గాక నాకేంటి సిగ్గు అనే విధంగా అధికార బీఆర్ఎస్ పార్టీ తీరు ఉందని బీఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన పాల్వంచ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పాల్వంచ బస్టాండ్‌ను సందర్శించి మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 5న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి పువ్వాడ అజయ్ చేతుల మీదుగా రూ 41 లక్షలతో పాల్వంచ బస్టాండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని అన్నారు. శంకుస్థాపన జరిగి నాలుగు నెలలు గడిచిన నేటికి పనులు ప్రారంభించకపోకపోవడంలోని ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ జాప్యం వల్ల వచ్చే వర్షాకాలంలో సైతం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఇంకా ఈ పనులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందని అయినా సూటిగా ప్రశ్నించారు. అభివృద్ధి అంటే కేవలం శిలాఫలకాలను చూస్తూ మురిసిపోతే సరిపోదని, పనులు కూడా జరగాలన్నారు. పాల్వంచ ప్రజలకు అన్ని సౌకర్యాలు ఉన్న ఒక బస్టాండును సైతం రవాణా శాఖ మంత్రిగా, జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్న పువ్వాడ కానీ, స్థానిక ఎమ్మెల్యే వనమా గాని ఇవ్వలేకపోయారని ఇది ఏమి దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం 41 లక్షల మరమత్తు పనులకే దిక్కు దివానం లేకుండా పోయిందని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. స్థానిక ఎమ్మెల్యే వనమా ఉండే పాల్వంచ పట్టణంలోనే అభివృద్ధి దారుణంగా ఉందని, పాల్వంచ బస్టాండ్‌లో ఉన్న సమస్యలపై తాను అనేకమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళనాని చెప్పారు. పాల్వంచ బస్టాండులో నీళ్ల నిలిచి ఉండడాన్ని చూసి మొక్కలు నాటిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పాల్వంచ బస్టాండ్ మరమ్మత్తుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని లేనిపక్షంలో పాల్వంచ పట్టణ ప్రజలను మమేకం చేస్తూ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయి, కేతిని కుమారి, ఏడెల్లి మర్థమ్మ, ఎర్రంశెట్టి రాజేశ్వరి, మంజు, గుంజ సరోజ తదితరులు పాల్గొన్నారు.

దేశ యువతకు ఆదర్శం రాజీవ్ గాంధీ

- టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఏడవల్లి కృష్ణ
- ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-కొత్తగూడెం

దేశ యువతకు ఆదర్శం రాజీవ్ గాంధీ అని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఏడవల్లి కృష్ణ అన్నారు. ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గం స్థానిక బస్టాండ్ సెంటర్ రైటర్ బస్తీలో గల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఏడవల్లి కృష్ణ అధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడవల్లి మాట్లాడుతూ ఇందిరాగాంధీ ఫిరోజ్ గాంధీ ల పెద్ద కుమారుడు భారత దేశ 6వ ప్రధాన మంత్రిగా అతి తక్కువ వయసులో దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని చెప్పారు. భారత దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార, ఐటి రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరు పేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు రాజీవ్ గాంధీఅని నివాళి అర్పించారు. ఈ కార్యక్రమములో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, అంతోటి పాల్, ఐఎన్‌టియూసి నాయకులు జలీల్, కాలం నాగభూషణం, సుబ్బా రెడ్డి, మహిళా మైనార్టీ పట్టణ అధ్యక్షురాలు జేరిన, అక్బర్, కొలిపాక సత్యనారాయణ, సారంగా పాణి తదితరులు పాల్గొన్నారు.

పినపాక : మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పినపాక మండలం ఈ.బయ్యారం గ్రామంలో గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రామనాథం మాట్లాడుతూ భారతదేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార, ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల రైతు కిసాన్ సెల్ అధ్యక్షులు ఏలూరి వెంకటేశ్వర రెడ్డి, పినపాక నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి బసీరుద్దీన్, మండల కార్యదర్శి జక్కా వెంకటేశ్వర్లు, పినపాక మండల ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె మదర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జాడి రాంబాబు, ఉపాధ్యక్షులు అత్తె లక్ష్మీనారాయణ, గంగిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, యాలం బుజ్జిబాబు, కొమరం రమేష్, మలకం మహేష్, బడే సుధాకర్, మలకం కార్తీక్, యాలం గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

చర్ల : యావత్ ప్రపంచంలోనే భారతదేశం సాంకేతికంగా అభివృద్ధి చెందిందంటే దానికి మూల కారణం రాజీవ్ గాంధీ అని టిపిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం భారత రత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా చర్ల మండలం సత్యనారాయణ పురం గ్రామం నందు గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలతో సాంకేతిక రంగంలో నేడు భారతదేశం పోటీ పడుతుందంటే దాని వెనుక రాజీవ్ గాంధీ కృషి వర్ణించలేనిదని ఆయన పునర్ఘాటించారు. భారతదేశ అభివృద్ధి కోసం ఎన్నో ప్రణాళికలు రూపొందించి దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఆయన కీర్తించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ కోదండరామయ్య, ఎంపీటీసీలు మడకం పద్మజ, కుంజా నాగేశ్వరరావు, తాటి రామకృష్ణ, ముత్యాల శివప్రసాద్, సర్పంచులు యలకం నరేంద్ర, ఉప సర్పంచ్ గడిదేసివిద్యాసాగర్, నాయకులు ఇందుకుర్తి సత్యనారయణ రాజు, ఇందుల బుజ్జి, రమేష్, భాస్కర్, పొగాకు సత్తిబాబు, సత్యనాదం బట్టా బాలకృష్ణ, సుధాకర్, నాగరాజు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : చివరి శ్వాస ఉన్నంత వరకు దేశం కోసం అవిశ్రాంతంగా శ్రమించిన ధీరుడు, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన అజరామరుడు, ప్రగతిశీలుడు, భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ తుమ్మ రాంబాబు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మూడు రోడ్ల కూడలిలో గల వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షులు ఉప్పల రాజశేఖర్, నాయకులు నరదల సర్వేశ్వరరావు, కొప్పుల శ్రీను, సత్యం రామకృష్ణ, నరదల మణికంఠ అశ్వారావుపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కేపీ షఫీ, పేరాయిగూడెం వార్డ్ నెంబర్, ఎస్.కె అన్వర్, రామకృష్ణ, చంద్రరావు, నార్లపాటి బుచ్చిబాబు, తగరం విశ్వనాథం తదిపర్లు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : సమాచార విప్లవకారుడు రాజీవ్ గాంధీయే అని, ఆయన కాలంలోనే టెలికాం రంగం అభివృద్ధికి నోచుకుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొగళ్ళపు చెన్నకేశవరావు అన్నారు. ఆయన వర్ధంతిని స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రం పటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం నివాళులు అర్పించారు. సాంకేతిక పరంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి లు భారతి, తిరుమల బాలగంగాధర్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్.కే పాషా, దస్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి : మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని ములకలపల్లిలో మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్రావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మెంబర్, జడ్పీటీసీ సున్నం నాగమణి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశాన్ని అనేకరంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, యువతకు 18ఏళ్లకే ఓటుహక్కును కల్పిస్తూ యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా చేసిన సంస్కరణ కర్త రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు పుష్పాల హనుమంతు, ఆర్ఎంపీ గోపి, కిసాన్ సెల్ వనమా వేదేశ్వరరావు, రత్నభూషణం, ఖాదర్ బాబా, మెడిశెట్టి సూరయ్య, పసుపులేటి గణపతి, వనమా వెంకయ్య, కారం రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.దేశానికి చెందిన సేవ పేద ప్రజలు కోసం చేసిన పనులను వర్ధంతిని సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి సెల్ మండల అధ్యక్షులు జమలయ్య, నరసింహ, మహేష్, చెన్నారావు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోయగూడెం ఉపరితల గనిలో పర్యటించిన డైరెక్టర్



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర రెడ్డి ఆదివారం ఏరియాలోని కోయగూడెం ఉపరితలగనిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఓసి పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుచున్న పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జిఎం ఎం.షాలెం రాజును అడిగి తెలుసుకున్నారు. తరువాత డైరెక్టర్(పిపి) జి.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధిగమించాలని, అలాగే వేసవి కాలంలో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జి.యం.ఎం.షాలెం రాజు, కేటసి ప్రాజెక్ట్ ఆఫీసర్ యస్.వి.ఆర్ ప్రహలాద్, మేనేజర్ సౌరబ్ సుమన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ శంకర్, ఏరియా క్వాలిటీ అధికారి యూసఫ్, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

సడలని సంకల్పానికి నిలువెత్తు రూపం. నిజాయితీకి నిబద్దతకి నిదర్శనం. నమ్మకానికి నారీశక్తికి మారుపేరు. ప్రతిభకు పారదర్శకతకు మరోపేరు. విజ్ఞానం వినయం విజయం కలబోసిన శిల్పం. కన్నకలల, కన్నవారి కలల కొలమానం. కళతో కవాతు చేస్తున్న నిత్య శ్రామికురాలు. కులమతాల కతీతమైన ఆత్మీయురాలు. చేతిగాజుల తయారీలో చెక్కుచెదరని చైతన్యం. గాజుల తయారీ ప్రాకారం. ఆమె మరెవరో కాదు నిర్మల్‌లోని మారుమూల సోన్ మండలానికి చెందిన ఉజ్మా బేగం.

కళతో కవాతు చేస్తున్న నిత్య శ్రామికురాలు







ఒకప్పుడు రెండువేల కోసం చెప్పులరిగేలా తిరిగినా అప్పు పుట్టలేదు. ఇప్పుడు రెండు వేలు, రెండు లక్షలు కాదు, పదిలక్షలిస్తామని, కాదు కాదు పదిహేను లక్షలిస్తామంటూ బ్యాంక్ వాళ్ళే తన దగ్గరకి వచ్చారు. చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న చేతి కళను, ఆత్మవిశ్వాసాన్నే పెట్టుబడిగా పెట్టి సాగించిన ప్రస్థానం ప్రస్తుతం శాఖోపశాఖలుగా విస్తరించింది. వందలాది మంది మహిళలకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు రెండు రాష్ట్రాలలో ఆర్సేట్‌లో ప్రభుత్వాల తరపున వందల మందికి శిక్షణ ఇచ్చే ఏకైక ఫ్యాకల్టీగా మారారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా, కట్టుబాట్లు, అడ్డంకులు, అవాంతరాలు అడుగడుగునా అడ్డు పడుతున్నా మొక్కవోని ధైర్యంతో ముందడుగేసి స్వయం కృషితో అంకురించిందే ఉజ్మా బేగం గాజుల తయారీ కుటీర పరిశ్రమ.

చదువు ఆగిపోయింది

తాను పెరిగిన నిజామాబాద్ జిల్లా, మాక్లూర్ మండల గవర్నమెంట్ స్కూల్లో స్కూల్ టాపర్‌గా నిలిచింది ఉజ్మా. అంతేకాదు ఆ మండలంలో కూడా తనే టాపర్. ఆ తర్వాత ఇంటర్‌లో కూడా కాలేజ్ టాపర్‌గా నిలిచింది. అలాంటి ఆమె కుటుంబ పరిస్థితులతో డిగ్రీ పూర్తీ చేయకుండానే పెండ్లి చేసుకోవాల్సి వచ్చింది. వరసైన సంబంధం మేనరికం ఉండడంతో తలవంచక తప్పలేదు ఆమెకు. అప్పటికీ పెండ్లయ్యాక చదివిస్తానని మామయ్య, చేసుకోబోయే భర్త వాగ్దానం చేయడంతో పెండ్లి చేసుకుంది. కానీ ఏడాదిలోపు బాబు పుట్టడం, కంప్యూటర్ సిస్టం ఆపరేటర్‌గా భర్త ఆదాయం అంతంత మాత్రం ఉండడం చదువుకు మంగళం పాడేలా చేసాయి.

సరదాగా నేర్చుకున్నదే...

కొత్త సంసారం, చిన్న చిన్న సరదాలు తీర్చుకునే పరిస్థితి కూడా లేదు. ఇంతలో రెండవ బాబు పుట్టాడు. డబ్బు సంపాదించేందుకు భర్త రెండేండ్లు విదేశాల్లో ఉండి వచ్చాడు. అయినా ఏ మాత్రం మారని ఆర్థిక పరిస్థితి. వ్యాపారం చేద్దామంటే చిల్లిగవ్వ లేదు. బంగారం అమ్ముదామంటే ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు. ఇద్దరు పిల్లలతో బతుకు పోరాటం చేయాల్సి వచ్చింది. తల్లి దగ్గర సహాయం అడగడానికి అభిమానం అడ్డుపడింది. ఇలాంటి పరిస్థితుల్లో బాగా ఆలోచించారు. చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న టెడ్డీ బేర్, చేతి సంచుల, సెల్ పౌచ్, వాల్ పేపర్, వాల్ మాట్, కీ చైన్స్ తదితర చేతి అల్లికల తయారీపై దృష్టి సారించారు. చేతిలో ఉన్న రెండు వందల రూపాయలతో మోతీపూసలు తదితర సామాగ్రి కొని తయారుచేసి అమ్మారు. దానికి నూటాయాభై రూపాయల లాభం రావడంతో మళ్ళీ ఆ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఏడువందలు సంపాదించారు. అలా ఇరవై వేలు జమ చేసుకొని డ్వాక్రా సమూహంలో చేరారు. అందులో లక్ష అప్పుతీసుకుని వ్యాపారం విస్తృతం చేసారు.

ఇద్దరూ కలిసి...

తన వ్యాపారంలో భర్త సహకారం మాటల్లో చెప్పలేనిదంటారామె. ఇంట్లో పనులు కూడా ఇద్దరూ కలిసి చేసుకుంటారు. మెట్‌పల్లి కోర్టులో పనిచేసే భర్త సంపాదన చాలా తక్కువ. అది ఏ మూలకూ సరిపోదు. అతని నిజాయితీ చూసి ఓ పోలీస్ స్టేషన్‌లో ఎక్కువ జీతం ఇస్తామని పిలిచారు. అక్కడ కూడా కొంత కాలం చేశాడు. అయితే దాన్నికన్నా గాజుల వ్యాపారంలో తనూ భాగస్వామి అయితే మరింత అభివృద్ధి చేసుకోవచ్చనే ఆలోచన వచ్చింది. దాంతో భర్త కూడా గాజుల వ్యాపారంలోకి వచ్చే శాడు. ఇద్దరూ కలిసి వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకుపోతున్నారు.

ఇతరులకు నేర్పుతూ...

మొదట కీ చైన్స్, పౌచెస్‌తో వ్యాపారం ప్రారంభించిన తర్వాత గాజుల తయారీపై దృష్టి కేంద్రీకరించారు. అందులో మెళకువలు తెలుసుకుని తయారీ మొదలుపెట్టారు. ఇప్పుడు ఈ వ్యాపారం ఇరు రాష్ట్రాలకు వ్యాపించి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది. దుకాణ దారులు ఆర్డర్లు ఇవ్వడం మొదలు పెట్టారు. ఇంతలో మాకూ ఆ కళ నేర్పమని ఎందరో మహిళలు ముందుకు వచ్చారు. దాంతో తనలోని కళను ఇతరులకు నేర్పుతూ ఆదాయం సంపాదించే వారు. వారిలో 18 నుండి ఇరవై మంది యువతులను గుర్తించి తనే వారికి ఆరువేల జీతం ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు.

సహకరించిన సంస్థలు

ప్రస్తుతం ఆమె దగ్గర నేర్చుకున్న వారు చాలా మంది వ్యాపారం మొదలుపెట్టారు. వారికి అవసరమైన మెటీరియల్ అంతా పెద్ద మొత్తంలో ముంబయి నుండి తెప్పించి వారికి అందిస్తూ కూడా ఆదాయం పొందడం మొదలుపెట్టారు. ఈ విషయంలో డీఆర్డీఏ స్టాఫ్ సపోర్టు మరువలేనిదని ఉజ్మా చెప్పారు. అంతేకాక ఇప్పటివరకు తీసుకున్న అప్పులు కూడా ఒక్కొక్కటి తీర్చుకుం టున్నారు. ఆమె నిబద్ధతను, నిజాయితీని గుర్తించి ఇప్పుడు బ్యాంకులు ఎక్కువ మొత్తంలో లోన్లు ఇస్తామంటు ముందుకు వస్తున్నాయి. వి హబ్ వారు కూడా వ్యాపారం విస్తరించాలంటూ సూచనలు, సలహాలు ఇస్తూ దిశానిర్దేశం చేస్తున్నారని ఆమె చెప్పారు.

అందరికి 'వదిన'గా

దసరా, దీపావళి, శివరాత్రి ఇలా ప్రతి పండుగ సందర్భంగా ఆమెకు వచ్చే ఆర్డర్లు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. అయితే ఉజ్మా ఇంత వ్యాపారం చేస్తున్నా తనలాగా చిన్నచిన్న షాప్ వాళ్ళ కూడా ఎదగాలని ఆలోచించి జాతరలో గాజులు, పిన్నులు అమ్మే దుకాణదారులకు తక్కువ ధరకు గాజులు సప్లై చేస్తున్నారు. ఈ విధంగా వారు లాభాలు పొందడంలో కూడా భాగం పంచుకున్నారు. ఇప్పుడు అందరూ ఆమెను ఆత్మీయంగా కుల, మతాలకు అతీతంగా 'వదిన' అని పిలుచుకుంటారు. వంద రూపాయలకు 12 గాజులు ఆమె సప్లై చేస్తే, వారు 150కి అమ్ముకుంటారు. తన దగ్గర పని చేసే అమ్మాయిలను కూడా ఆమె తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటారు. కాబట్టే తన వ్యాపార ఇంతగా అభివృద్ధి చెందిందని, ఇదే తన విజయ రహస్యం అని నవ్వుతూ చెప్పారు.



ముదితల్ నేర్వగరాని విద్యగలదే?

నిజానికి చదువుకొని లెక్చరర్ కావాలనేది ఆమె ఆశ. ఆ ఆశ నెరవేరకపోయినా, వెనకడుగు వేయక తనదైన కళలో సృజనాత్మకతతో ముందుకు దూసుకెళు తున్నారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాలలో ఎంతో మందికి పనిని, కళను నేర్పిస్తూ ఉపాధి చూపెడుతూ, తన దగ్గర నేర్చు కున్న వారికి మెటీరియల్స్ సప్లై చేస్తూ, అవసరమైన సూచనలు ఇస్తూ 'ముదితలు నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్' అని చిలకమర్తిగారు మాట లను నిజం చేశారు ఉజ్మా బేగం.

– నామని సుజనాదేవి,
7799305575

బరువు తగ్గేందుకు...

ఈ రోజుల్లో ఎక్కువ మంది ఎక్కువ బరువుతో బాధపడుతున్నారు. దాని వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు అన్నీ ఇన్నీ కావు. కానీ బరువు తగ్గడం ప్రతి ఒక్కరికీ సాధ్యం కాదు. ప్రణాళికాబద్ధంగా కృషి చేసే వారికి మాత్రమే బరువు కంట్రోల్‌లో ఉంటుంది. అవగాహన లేక చాలా మంది తోచినట్లు ఓ వారమో లేక పది రోజులో డైటింగ్ చేసి లాభం లేదనుకుని ప్రయత్నానికి గుడ్ బై చెబుతుంటారు. కొందరైతే త్వరగా తగ్గాలని ఓవర్ డైటింగ్ చేయటం వల్ల జీవక్రియ మీద ప్రభావం పడి ఇతర అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటుంటారు. అందుకే తగిన ఆహార ప్రణాళిక పాటిస్తే ఆరోగ్యంగా ఉంటూనే బరువు తగ్గే అవకాశం ఉంటుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

- రోజువారీ ఆహారంలో పొట్టుతీయని ధాన్యం, తృణ ధాన్యాలు, మొలకెత్తిన బఠాణీ, సోయా, శనగలు, అలసందలు, బొబ్బర్లు, పెసల వంటివి ఉండేలా చూసుకోవాలి.
- శరీరానికి ప్రోటీన్స్ అవసరం.. అందుకు గుడ్డు తెల్ల సొనతో వేసిన ఆమ్లెట్, లేత కోడి మాంసం వంటివి కూడా ఉండాలి.
- రోజులో మూడు సార్లు తప్పనిసరిగా ఒకటి, రెండు రకాల పండ్లు తీసుకోవాలి.
- ముల్లంగి, క్యాబేజీ వంటి కూరగాయలు, అన్ని రకాల ఆకుకూరల వినియోగం ఎంత ఎక్కువ ఉంటే అంత మంచిది.
- దాహంతో నిమిత్తం లేకుండా వీలైనన్ని మంచినీళ్లు తాగటం కూడా బరువు తగ్గేందుకు దోహదపడుతుంది.
- రోజూ పాలు, పాలఉత్పత్తులు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల ఆహార పరిమాణం తగ్గినా క్యాల్షియం లోపాలు రావు. అయితే వెన్న తీసినపాలు తాగటం మరువొద్దు.
- ఉదయం, సాయంత్రం వేళల్లో కప్పు గ్రీన్ టీ తాగటం వల్ల అందులోని పాలీ ఫినాల్స్ ట్రై-గ్లిసరైడ్స్ లను విచ్ఛిన్న పరచి బరువు తగ్గిస్తాయి.



కలిసికట్టుగా బీజేపీకి బుద్ధి చెబుదాం

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం ఉదయంబీహార్ ఉపముఖ్యమంత్రి, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌తో పాటు ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డులోని కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్నారు. వారితో పాటు పార్టీ నేతలు మనోజ్ ఝా, లలన్ సింగ్, సంజయ్ ఝాలు కూడా ఉన్నారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలంటే తమతో కలిసి రావాలని కేజ్రీవాల్‌ను కోరనున్నారు. ఢిల్లీలో పాలనాధికారాలకు సంబంధించి రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలతో కలిసి పోరాడుతామని కేజ్రీవాల్ ప్రకటించిన మరుసటి రోజే నితీశ్ కుమార్ భేటీ కావడం గమనార్హం. ఈ సమావేశంలో ఈ అంశంపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

పాలనావ్యవహారాల విషయంలో ఆప్ ప్రభుత్వానికి అనుకూలంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తప్పించేందుకు కేంద్రం ఆర్డినెన్స్‌ను తీసుకురావడం 'రాజ్యాంగ విరుద్ధం' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ విషయంలో నితీశ్ తనకు పూర్తి మద్దతు ప్రకటించారని, తాము కలిసి పోరాడతామని చెప్పారు. 'ఢిల్లీకి కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయంపై అందరం కలిసి పోరాడతామని, బీజేపీయేతర ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వస్తే.. రాజ్యసభలో బిల్లు రూపంలోని ఆర్డినెన్స్‌ను ఓడించవచ్చని సూచించానని అన్నారు. ఇది ఎన్నికలకు ముందు సెమీఫైనల్‌లా అవుతుందని, 2024లో బీజేపీ తిరిగి అధికారంలోకి రాదనే సందేశం దేశమంతటా వెళ్తుందని కేజ్రీవాల్ అన్నారు.

ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వం నుంచి అధికారాన్ని ఎలా లాక్కుంటుందని నితీశ్ కేంద్రాన్ని నిలదీశారు. సుప్రీం కోర్టు ఢిల్లీ ప్రభుత్వానికి ఇచ్చిన హక్కుని ఎలా లాక్కోగలరని ప్రశ్నించారు. ఈ విషయంలో తాము ఆప్‌కు మద్దతుగా ఉన్నామని, మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నామని, త్వరలో దేశవ్యాప్త ప్రచారాన్ని నిర్వహిస్తామని నితీశ్ స్పష్టం చేశారు. ఢిల్లీ విషయంలో కేంద్రం తీసుకుంటున్న చర్యలు.. ప్రజాస్వామ్యానికి ప్రమాదమని బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ హెచ్చరించారు.

ఆస్ట్రేలియన్ పార్లమెంట్‌లో
మోడీపై బీబీసీ డాక్యుమెంటరీ

న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్ల విషయంలో మోడీ పాత్రపై వచ్చిన బీబీసీ డాక్యుమెంటరీ 'ఇండియా– ది మోడీ క్వశ్చన్' ఆస్ట్రేలియన్ పార్లమెంటులో ప్రదర్శనకు సిద్ధమైంది. ఈనెల 24న కాన్‌బెర్రాలోని ఆస్ట్రేలియన్ పార్లమెంట్ హౌజ్‌లో ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించను న్నారు. ఈ కార్యక్రమాన్ని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, పెరియార్ అంబేద్కర్ థాట్స్ సర్కిల్–ఆస్ట్రేలియా వంటి కొన్ని ప్రవాస సంస్థల సమూహం చేపడుతున్నాయి. అయితే, ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. అదే వారం ప్రధాని మోడీ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో పర్యటించనుండటం చర్చనీయాంశంగా మారనున్నది.



ఇండియా: ది మోడీ క్వశ్చన్ అనేది రెండు భాగాల డాక్యుమెంటరీ సిరీస్. దీనిని ఇప్పటికే బీబీస ప్రదర్శించింది. 2002 గుజరాత్ అల్లర్ల గురించి, ఆ సమయంలో అప్పటి గుజరాత్ సీఎం, ప్రస్తుత భారత ప్రధాని మోడీ రాజకీయ జీవితాన్ని, అల్లర్లలో ఆయన పాత్ర గురించి ఈ డాక్యుమెంటరీ తెలియజేస్తుంది. అయితే, ఈ డాక్యుమెంటరీని భారత్‌లో ప్రదర్శితం కాకుండా మోడీ సర్కారు యూట్యూబ్, ట్విట్టర్ సంస్థలను ఆదేశించింది. దీంతో భారతీయులు ఈ డాక్యుమెంటరీని చూసే అవకాశాన్ని పొందలేకపోయారు. బీబీసీ డాక్యుమెంటరీ అనంతరం.. న్యూఢిల్లీలోని బీబీసీ కార్యాలయాలపై ఐటీ సోదాలు సైతం జరిగిన విషయం విదితమే.

పేదల గుడిసెలపై పోలీసుల దాష్టీకం



(మొదటిపేజీ తరువాయి)

అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పక్కనే ఉన్న పట్టా భూమి సర్వే నెంబర్లు వేసి యథేచ్ఛగా విక్రయాలకు తెగబడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నేతలు, నిరుపేదలు.. ఆ భూమిని పరిరక్షించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడంతో పేదలు గుడిసెలు వేశారు. మూడు నెలలుగా పేదలు ఒక్కొక్కరు 80 గజాల భూమిలో గుడిసె వేసుకొని నివసిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి ఇంటి నెంబర్ ఇవ్వాల్సిన అధికారులు.. అందుకు విరుద్ధంగా గుడిసెలు తొలగించే పనికి పూనుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గుడిసెల వద్దకు వచ్చారు. సుమారు 20 ఎకరాల్లో వేసిన 2000 గుడిసెల కూల్చివేతకు ఉపక్రమించారు. పేదలు, మహిళలు, గిరిజనులు పోలీస్ వాహనాన్ని అడ్డుకొని ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రొక్లెయిన్లు తీసుకువచ్చి గుడిసెలు కూల్చివేతకు పూనుకోగా మహిళలు అడ్డుకున్నారు. పోలీసులు, మహిళలకు మధ్య ఘర్షణ, తోపులాట జరగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పేదలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ భూమిలో గుడిసెలు కూల్చవద్దని పట్టాలివ్వాలని నినదించారు. మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాంతో పోలీసులు.. డీసీఎం తీసుకుని వచ్చి వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పేదల గుడిసెలు అన్యాయంగా కూల్చివేశారు
సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం

ప్రభుత్వ భూములు ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల అండదండలతోనే పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పేదల గుడిసెలను అన్యాయంగా కూల్చివేశారు. ప్రభుత్వం ఒకపక్క పేదలకు 58 జీవో ప్రకారం పేదల గుడిసెలకు పట్టాలిస్తామని చెబుతూనే.. మరోపక్క వారు వేసుకున్న గుడిసెలు కూల్చి వేయడం అన్యాయం. కొంతమంది రియల్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఆ భూముల రక్షణ కోసమే పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఆ గుడిసెలకు తక్షణమే పట్టాలు ఇవ్వాలి.



పోలీసు దాడి అమానుషం..: ఎస్ వీరయ్య

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై పోలీసులు దాడి చేయటం అమానుషమని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం తెల్లవారు జామున గుడిసెవాసులమీద పోలీసులు దాడి చేశారనీ, వాటిని నేల మట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన పేదలమీద నిర్దాక్షణ్యంగా లాఠీచార్జి చేసారని తెలిపారు. సుమారు వందమందిని అరెస్ట్ చేసి, వారిపై తప్పుడు కేసులు బనాయించారని పేర్కొన్నారు. నలభై మందిని బైండోవర్ చేశారని తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదలు ధైర్యంగా నిలబడాలనీ, ఐక్యంగా ఉద్యమించాలనీ, ఇండ్లు సాధించుకునేవరకూ పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. గుడిసెవాసులు పోరాటానికి ప్రజాసంఘాల పోరాట వేదిక సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని తెలిపారు. ఇండ్లు, ఇండ్లస్థలాల సమస్యపై ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలపై నిర్బంధాన్ని ప్రయోగించటం అన్యాయమని తెలిపారు. ఇంటి వసతి జీవించే హక్కులో భాగమేనని న్యాయస్థానం కూడా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వ స్థలాలు, మిగులు భూములు, వ్యవసాయం అంతరించిన శిఖం భూముల మీద పేదలకు హక్కు ఉంటుందని తెలిపారు. ధనికులు కబ్జా చేస్తే పట్టించుకోకుండా, పేదలు గుడిసెలు వేసుకుంటే దాడులు చేయటమేంటని ప్రశ్నించారు. దాడులతో పేదల ఉద్యమాన్ని ఆపలేరని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలని వీరయ్య కోరారు.

28న కొత్త పార్లమెంట్ భవన్ ముట్టడి

నవతెలంగాణ –న్యూఢిల్లీ బ్యూరో

46 డిగ్రీల మండుటెండలో రెజ్లర్ల ఆందోళన కొనసాగుతోంది. నేటితో (సోమవారం) ఉద్యమం నెల రోజులకు చేరుకుంది. రెజ్లర్లను లైంగికంగా వేధించినందుకు బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలనే అల్టిమేటం ఆదివారం ముగియడంతో హర్యానాలోని రైతులు, ఖాప్ పంచాయతీ నేతలు మహా పంచాయితీ చేపట్టారు. 28న ప్రధాని మోడీ ప్రారంభించనున్న కొత్త పార్లమెంట్ భవనాన్ని వేలాది మంది మహిళలు చుట్టుముట్టి మహా పంచాయితీ నిర్వహిస్తారని నేతలు ప్రకటించారు. భవిష్యత్ ఆందోళనపై ప్రకటన కూడా ఉంటుంది. హర్యానాలోని రోహ్‌తక్‌లోని మెహమ్ నగరంలో వేలాది మంది పాల్గొనే మహా పంచాయతీని నిర్వహించారు. హర్యానా, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల రైతులే కాకుండా సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్ తదితరులు కూడా ఇక్కడికి వెళ్లారు. పార్లమెంట్ ముట్టడి నిరసనలో దేశంలోని మహిళలందరూ పాల్గొనాలని అగ్రశ్రేణి రెజ్లర్లు విజ్ఞప్తి చేశారు. జాట్‌లు అధికంగా ఉండే రోహ్‌తక్, ఝజ్జర్, నార్నౌల్, ఫరీదాబాద్, రేవారీ, చర్కీ దాద్రీ , గురుగ్రామ్ జిల్లాల నుంచి వేలాదిగా మహిళలు తరలి వచ్చారు.

డిమాండ్లు ఇవే..

27వ తేదీలోగా బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసి నార్కోటెక్ పరీక్ష నిర్వహించాలని మహా పంచాయతీ డిమాండ్ చేసింది. 23న ఇండియా గేట్ వద్ద క్యాండిల్‌లైట్ మార్చ్‌లో పాల్గొంటామని, రెజ్లర్లు అడిగినప్పుడల్లా ఐదు గంటల్లో వేలాది మందిని జంతర్ మంతర్‌కు తీసుకువస్తామని నేతలు ప్రకటించారు. మహాపంచాయత్‌లో బీకేయూ నేత రాకేశ్ తికాయత్ మాట్లాడుతూ.. రైతు ఉద్యమం లాంటి సుదీర్ఘ పోరాటం కోసం ఎదురు చూస్తున్నామని అన్నారు. గాంధీ హత్య కేసులో నిందితుడైన సావర్కర్ 140వ జయంతి సందర్భంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకున్న బీజేపీకి మహా పంచాయతీ నిర్ణయం ఎదురుదెబ్బ తగిలింది. ఇంతలో, కుస్తీ ఆందోళన కూడా హర్యానాలోని బీజేపీ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించడం ప్రారంభించింది. జాట్ రైతుల మద్దతు ఉన్న బీజేపీ మిత్రపక్షమైన జేజేపీతో పోరు మరింత ముదిరింది. ముందుగా జేజేపీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌతాలా ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

బెంగళూరులో వాన బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

వాటి ద్వారా పైకి రాలేక విలవిల్లాడిపోయారు. అగ్నిమాపక సిబ్బంది నిచ్చెన వేసి, గజ ఈతగాళ్ల సహాయంతో ఐదుగురిని రక్షించగలిగారు. అప్పటికే తీవ్ర అస్వస్థతకు గురైన భానురేఖ (22)ను ఆస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ ఆమె చనిపోయారు. విహారయాత్రకు వెళ్లి..విగతజీవిగా మిగిలిన భానురేఖ మృతదేహాన్ని చూసినవారంతా తల్లడిల్లిపోయారు. బాధితులంతా ఏపికి చెందినవారిగా గుర్తించారు. భానురేఖ చికిత్స పొందిన ఆస్పత్రిని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సందర్శించి మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. అకాల వర్షాలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. అత్యవసర బలగాలను రంగంలోకి దించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు.

ధాన్యం కోనుగోళ్లలో జాప్యం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస రైస్ మిల్లులో దిగుమతి చేయడానికి రైతులు ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్లు, టాటా ఏసీ వాహనాల్లో బస్తాలను తీసుకువచ్చారు. మండుటెండలో హమాలీలు ఉదయం, సాయంత్రం వేళలో బస్తాలు దిగుమతి చేస్తున్నా ఆలస్యం కావడంతో వాహనాలు రోడ్డు పక్కన క్యూ లైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు శనివారం సాయంత్రం అకాల వర్షం కురవడంతో ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. దాంతో ఆగ్రహించిన రైతులు ధాన్యం బస్తాలను వెంటనే దిగుమతి చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఇమ్మడి వీరభద్రరావు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైస్ మిల్లు యాజమాన్యంతో మాట్లాడి ధాన్యం బస్తాలను వెంటనే దిగుమతి చేసుకోవాలని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం బస్తాలు దిగుమతి వెంటనే చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళన విరమింప చేశారు.

పెరుగుతున్న నిరుద్యోగం

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి, నైపుణ్యాల కల్పన విషయంలో మోడీ సర్కారు విఫలమైందనీ, ఈ విషయంలో పొరుగు దేశం చైనా చక్కటి ప్రదర్శనను కనబరుస్తున్నదని నిపుణులు విశ్లేషించారు. శ్రామిక శక్తిలో నైపుణ్యం లేకుంటే అంచనాలలో పేర్కొన్నవిధంగా దేశ శ్రామిక శక్తిలో 32 శాతం పెరుగుదల ఏమీ ఉండదని తెలిపారు. పైగా తగిన పని దొరకక వారు నిరుద్యోగులుగా మారుతారని హెచ్చరించారు.

శ్రామికశక్తి ఉన్నా...

(మొదటిపేజీ తరువాయి)

విభాగంలో 3.5 కోట్ల మంది, భవనం మరియు నిర్మాణంలో 3.3 కోట్ల మంది, దుస్తులు మరియు వస్త్రాలలో రంగంలో 2.6 కోట్ల మంది కొరత ఉంటుంది. అలాగే, రవాణా మరియు లాజిస్టిక్స్‌లో దాదాపు 1.8 కోట్ల మంది నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉంటుంది. వ్యవస్థీకత రిటైల్‌లో మరో 1.7 కోట్లుగా ఉండనున్నది. రియల్ ఎస్టేట్ సేవల్లో దాదాపు 1.4 కోట్ల మంది, ఆరోగ్య సంరక్షణలో సుమారు 1.3 కోట్ల మంది, ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఒక కోటి మంది, విద్యలో 60 లక్షల మంది కొరత ఉంటుంది. ఇది దేశంలో నైపుణ్యం లేని కార్మికుల కొరత తీవ్రతకు అద్దం పడుతున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. ఫలితంగా వారంతా నిరుద్యోగులుగానే మిగిలే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. అయితే, దేశ యువతకు, శ్రామికులకు నైపుణ్యాభివృద్ధి విషయంలో మోడీ సర్కారు మాటలు నీటి మీద రాతలుగానే మారాయన్నారు.

పెట్టుబడులు పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రముఖ కంపెనీ టెక్ జెన్స్ ముందుకొచ్చింది.

డెలవరీ సెంటర్‌తో 10 వేల మందికి ఉపాధి

టెక్నాలజీ దిగ్గజం వీఎక్స్‌ఐ గ్లోబల్ సొల్యూషన్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న డెలవరీ సెంటర్‌తో 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆ సంస్థ గ్లోబల్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ ఎరికా బోగర్ కింగ్ తెలిపారు. హ్యూస్టన్‌లో మంత్రి కేటీఆర్ సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతేడాది దేశవ్యాప్తంగా ఐటీ రంగంలో 4.50 లక్షల ఉద్యోగాలు ఏర్పడితే అందులో 1.5 లక్షల ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే వచ్చాయని తెలిపారు.

ఖతర్నాక్ కామెరూన్

201 పరుగుల లక్ష్యాన్ని ముంబయి ఇండియన్స్ ఊదేసింది. కామెరూన్ గ్రీన్ (100 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (56) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. కామెరూన్, రోహిత్ మెరుపులతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ముంబయి ఇండియన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పదో పరాజయంతో ఐపీఎల్16 నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ నిష్క్రమించింది.

● గ్రీన్ సెంచరీతో ముంబయి గెలుపు
● ఓటమితో సన్‌రైజర్స్ నిష్క్రమణ

నవతెలంగాణ-ముంబయి

కామెరూన్ గ్రీన్ (100 నాటౌట్, 47 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఖతర్నాక్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. 47 బంతుల్లోనే సెంచరీ సాధించిన కామెరూన్ గ్రీన్ చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఎదురులేని విజయాన్ని అందించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (56, 37 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) సైతం రాణించటంతో 201 పరుగుల లక్ష్యాన్ని ముంబయి ఇండియన్స్ 18 ఓవర్లలోనే ఛేదించింది. మరో 12 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 200 పరుగులు చేసింది. ఓపెనర్లు మయాంక్ అగర్వాల్ (83, 46 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), వివ్రాంత్ శర్మ (69, 47 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించారు. ఓపెనర్ల మెరుపులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు సాధించింది. ఛేదనలో శతక హీరో కామెరూన్ గ్రీన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఈ విజయంతో 16 పాయింట్లు సాధించిన ముంబయి ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌లో చోటుకు మరింత చేరువైంది!.

గ్రీన్ దంచికొట్టగా.. : ఛేదనలో ఓపెనర్ ఇషాన్ కిషన్ (14) ఆరంభంలోనే వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (56)తో జతకట్టిన కామెరూన్ గ్రీన్ (100 నాటౌట్) మ్యాచ్‌ను ముంబయి చేతుల్లోకి తీసుకున్నాడు. పవర్‌ప్లేలో ముంబయి 60 పరుగులు పిండుకోగా.. కామెరూన్ గ్రీన్ వచ్చీ రాగానే బౌండరీలపై విరుచుకుపడ్డాడు. ఐదు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన గ్రీన్.. ఛేదనను సులభతరం చేశాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 31 బంతుల్లో అర్ధ శతకం బాదాడు.



రోహిత్, గ్రీన్ జోడి రెండో వికెట్‌కు ఏకంగా 128 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసింది. కామెరూన్ దూకుడుగా విరుచుకుపడ్డాడు. సిక్సర్లు, ఫోర్ల రూపంలోనే 80 పరుగులు పిండుకున్న కామెరూన్ గ్రీన్.. సన్‌రైజర్స్ బౌలర్లను ఊచకోత కోశాడు. రోహిత్ నిష్క్రమించినా.. సూర్యకుమార్ యాదవ్ (25 నాటౌట్, 16 బంతుల్లో 4 ఫోర్లు) తోడుగా మరో 12 బంతులు ఉండగానే లాంఛనం ముగించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో భువనేశ్వర్, మయాంక్ డాగర్ చెరో వికెట్ తీసుకున్నారు. యువ పేసర్లు కార్తీక్ త్యాగి, ఉమ్రాన్ మాలిక్ భారీగా పరుగులు ఇచ్చారు.

ఓపెనర్ల మెరుపుల్ : సీజన్లో తొలిసారి సన్‌రైజర్స్‌కు అదిరే ఆరంభం లభించింది. ఆరంగేట్ర ఓపెనర్ వివ్రాంత్ శర్మ (69), మయాంక్ అగర్వాల్ (83) తొలి వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ముంబయి బౌలర్లను ఉతికారేసిన ఓపెనర్లు అలవోకగా పరుగులు పిండుకున్నారు. పవర్‌ప్లేలో 53 పరుగులు సాధించిన ఓపెనర్లు.. మిడిల్ ఓవర్లలో 104 పరుగులు జోడించారు. దీంతో హైదరాబాద్ భారీ స్కోరుకు గట్టి పునాది వేసుకుంది. వివ్రాంత్ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 36 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా.. మయాంక్ అగర్వాల్ సైతం ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 32 బంతుల్లో ఆ ఫిఫ్టీ చేశాడు. ఓపెనర్ల నిష్క్రమణతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ మందగించింది. క్లాసెన్ (18), ఫిలిప్స్ (1), బ్రూక్ (0) నిరాశపరిచారు. చివరి బంతికి సిక్సర్ బాదిన మార్క్‌రామ్ (13 నాటౌట్) జట్టు స్కోరు 200 చేశాడు. ముంబయి బౌలర్లలో ఆకాశ్ (4/37) నాలుగు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.



స్కోరు వివరాలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్ : వివ్రాంత్ శర్మ (సి) రమణ్‌దీప్ (బి) ఆకాశ్ 69, మయాంక్ అగర్వాల్ (సి) కిషన్ (బి) ఆకాశ్ 83, క్లాసెన్ (బి) ఆకాశ్ 18, గ్లెన్ ఫిలిప్స్ (సి) కార్తికేయ (బి) జోర్డాన్ 1, మార్క్‌రామ్ నాటౌట్ 13, హ్యారీ బ్రూక్ (బి) ఆకాశ్ 0, సన్వీర్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 200.**

వికెట్ల పతనం : 1-140, 2-174, 3-186, 4-186.

బౌలింగ్ : బెహ్రెన్‌డార్ఫ్ 3-0-36-0, కామెరూన్ 1-0-2-0, జోర్డాన్ 4-0-42-1, ఆకాశ్ 4-0-37-4, చావ్లా 4-0-39-0, కార్తికేయ 4-0-39-0.

ముంబయి ఇండియన్స్ : ఇషాన్ కిషన్ (సి) బ్రూక్ (బి) భువనేశ్వర్ 14, రోహిత్ శర్మ (సి) నితీశ్ (బి) మయాంక్ 56, కామెరూన్ నాటౌట్ 100, సూర్యకుమార్ నాటౌట్ 25, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (18 ఓవర్లలో 2 వికెట్లకు) 201.**

వికెట్ల పతనం : 1-20, 2-148,

బౌలింగ్ : భువనేశ్వర్ 4-0-26-1, నితీశ్ 3-0-35-0, మయాంక్ డాగర్ 4-0-37-1, కార్తిక్ త్యాగి 2.5-0-41-0, ఉమ్రాన్ 3-0-41-0, వివ్రాంత్ 1-0-19-0, మార్క్‌రామ్ 0.1-0-1-0.

ఆ ఇద్దరు ఉంటే.. భారతే ఫేవరేట్!

ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌పై ఇయాన్ చాపెల్



న్యూఢిల్లీ : ప్రపంచ క్రికెట్ ప్రియ ప్రత్యర్థులు భారత్, ఆస్ట్రేలియా. ఈ రెండు జట్లు ఏ ఫార్మాట్‌లో పోటీపడినా సమవుజ్జీల సమరమే. ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్, ఆస్ట్రేలియా సమరానికి సిద్ధమవుతున్నాయి. జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానం ప్రతిష్టాత్మక ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వేదిక. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 16 సీజన్ ముగిసిన వెంటనే ఇరు జట్లు ఇంగ్లాండ్‌కు చేరుకోనున్నాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్ ప్రాక్టీస్ లేకుండానే అంతిమ పోరులో ఢీకొట్టనున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్, ఆస్ట్రేలియా విజయావకాశాలు, ఇరు జట్లను ప్రభావితం చేయగల అంశాలపై ఆసీస్ మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ ఓ వ్యాసంలో రాశారు. ' ఐపీఎల్ అనుభవం తక్కువ చేయడానికి వీల్లేదు. ప్రత్యేకించి ఐపీఎల్‌లో బ్యాటర్లకు నాణ్యమైన సాధన లభిస్తుంది. 2009లో రవి బొపారా ఇది నిరూపించాడు. డబ్ల్యూటీసీ ఫైనల్ వేదిక ది ఓవల్. ఇంగ్లాండ్ పరిస్థితులు ఆస్ట్రేలియాకు కాస్త అనుకూలం. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ , జోశ్ హాజిల్‌వుడ్ పేస్ త్రయం భారత్‌కు సవాల్ విసరగలదు. మహ్మద్ షమి, మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లతో కూడిన భారత పేస్ త్రయం సైతం బాగుంది. కానీ వికెట్ల వేటలో ఆసీస్ త్రయం ముందుంటుంది. టెస్టుల్లో మానసిక ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. గాయాల బెడదల లేని ఆస్ట్రేలియా ఈ విషయంలో మెరుగ్గా ఉంది. భారత్‌కు గాయాల బెడద ఎక్కువ. గాయాలతో విలువైన ఆటగాళ్ల సేవలను రోహిత్‌సేన కోల్పోయింది. రిషబ్ పంత్, జశ్‌ప్రీత్ బుమ్రా ఫైనల్‌కు అందుబాటులో ఉండి ఉంటే.. కచ్చితంగా టీమ్ ఇండియా హాట్ ఫేవరేట్. కానీ ఇద్దరు మ్యాచ్ విన్నర్ల సేవలు కోల్పోయిన భారత్‌పై ఆ ప్రభావం ఉంటుంది. శుభ్‌మన్ గిల్, అజింక్య రహానెలు ఆసీస్‌కు సమస్య సృష్టించగలరు.

భారత్ ఇద్దరు స్పిన్నర్లు జడేజా, అశ్విన్‌తో బరిలోకి దిగితే.. ఆసీస్ ఏకైక స్పిన్నర్ నాథన్ లయాన్ మాయను నమ్ముకోనుంది. ఓవల్‌లో పదునైన పేస్ బౌలర్ కామెరూన్ గ్రీన్ ఆల్‌రౌండ్ నైపుణ్యం ఆసీస్‌కు అదనపు బలం. భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య టెస్టు క్రికెట్ ఆడకపోటం సైతం ఆ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ. పంత్, బుమ్రా, శ్రేయస్, రాహుల్ గాయాలతో దూరమయ్యారు. ఆ ప్రభావం భారత జట్టుపై ఉంటుంది. మ్యాచ్‌కు ముందు అంచనాలను ఎలాగున్నా.. మ్యాచ్ ఫలితం కచ్చితంగా ఆసక్తికరంగా ఉండనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ విజేతను అంత సులువుగా తేల్చలేమని' ఇయాన్ చాపెల్ రాసుకొచ్చారు. భారత కీలక బ్యాటర్ చతేశ్వర్ పుజారా, ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఇంగ్లీష్ కౌంటీ సీజన్లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌కు సన్నద్ధం అవుతున్న సంగతి తెలిసిందే.



జిల్లాల్లో గ్రామీణ అథ్లెట్ల షో

● నేటి నుంచి జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలు

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సిఎం కప్ 2023 పోటీలు రెండో అంచెకు చేరుకున్నాయి. 618 మండలాల్లో జరిగిన మండల స్థాయి పోటీల్లో 85000 మంది గ్రామీణ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నేటి నుంచి జరిగే జిల్లా స్థాయి సిఎం కప్ పోటీల్లో 85000 మంది గ్రామీణ క్రీడాకారులు సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నారు. 33 జిల్లాల్లో నేడు కలెక్టర్ సారథ్యంలోని నిర్వహణ కమిటీ పోటీలను పర్యవేక్షించనుంది. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా స్థానిక ప్రజా ప్రతినిధులు నేడు ప్రారంభ కార్యక్రమానికి హాజరు కానున్నారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా.. జిల్లా స్థాయి పోటీల్లో వాటికి అదనంగా బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో పోటీలు జరుగనున్నాయి. ఇక రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్చరీ, షూటింగ్, హాకీ, జిమ్నాస్టిక్స్, టెన్నిస్ క్రీడాంశాల్లో ట్రయల్స్ నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. మే 22-24 వరకు జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలు జరుగుతాయి.

ఉదయం 10 లోపే.. : భారీ ఉష్ణోగ్రతల నేపథ్యంలో పోటీల సమయంలో కీలక మార్పులు చేస్తూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ జిల్లా నిర్వహణ కమిటీలకు సూచనలు చేశారు. ఉదయం ఏడు గంటలకే పోటీలను ప్రారంభించి, పది గంటల లోపే ముగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం అథ్లెట్లకు పూర్తి విరామం ఇచ్చి.. సాయంత్రం పోటీలను తిరిగి నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి సిఎం కప్ పోటీల్లో పోటీపడనున్న 85000 మంది అథ్లెట్లకు వసతి, భోజన, రవాణ ఏర్పాట్లను నిర్వహణ కమిటీలు సిద్ధం చేశాయి.



33 జిల్లాల్లో పండుగ వాతావరణంలో సిఎం కప్ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశాం. మండల స్థాయి పోటీల్లో గ్రామీణ క్రీడాకారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. క్రీడాశాఖ యంత్రాంగం, క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు కలిసి జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేసేందుకు పని చేయాలి

- ఆంజనేయ గౌడ్, శాట్స్ చైర్మెన్

సంగీత సంచలనం రాజ్ ఇకలేరు



తెలుగు ప్రేక్షకులకు ఎన్నో మరపురాని పాటలను, పక్కా కమర్షియల్ బ్లాక్‌బస్టర్ హిట్స్ అందించిన రాజ్-కోటి ద్వయంలో సంగీత సంచలనం రాజ్ (68) ఆదివారం తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా తనదైన సంగీతంతో తెలుగు సినీ సంగీత ప్రపంచంలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన రాజ్ ఇకలేరనే వార్తను సంగీత లోకం జీర్ణించుకోలేక పోతోంది. తనకంటూ ఓ ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ని క్రియేట్ చేసుకున్న రాజ్ సుదీర్ఘ సంగీత ప్రయాణంలోని విశేషాల సమాహారం..

■ ప్రముఖ సంగీత దర్శకుడు రాజ్ అసలు పేరు తోటకూర సోమరాజు. తోటకూర వెంకటరాజు, సావిత్రి దంపతులకు చెన్నైలో 1954 జూలై 27వ తేదీన రాజ్ జన్మించారు. చదువులో యావరేజ్ స్టూడెంట్. స్కూల్ ఎగ్గొట్టి నాన్న రికార్డింగ్ థియేటర్లకు వెళ్ళేవారు. అక్కడ రకరకాల వాయిద్యకారులు ఇన్‌స్ట్రుమెంట్స్ వాయిస్తుంటే వాళ్ళ వైపు ఆశ్చర్యంగా, వింతగా చూస్తుండేవాడు. నాన్న ఎన్నిసార్లు కోప్పడినా తన ధోరణి మారలేదు. అయితే నాన్న నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఎస్ఎస్ఎల్‌సి పాస్ అయ్యేసరికి, తనని డాక్టర్ చదివించాలని ఆయన ఆశపడ్డారు. ఆయన కోరిక మేరకు ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నప్పటికీ అనారోగ్య కారణాల వల్ల తర్వాత కామర్స్ గ్రూప్‌కి మారారు.

■ రాజ్‌కి చదువు అబ్బదేమో అనే సందేహంతో చిన్నప్పట్నుంచే సంగీతం నేర్పించారు. ధన్‌రాజ్, ఫాప్స్ వంటి గురువుల దగ్గర పియానో, వెలైన్ నేర్చుకున్నారు. అలాగే కర్నాటక శాస్త్రీయ సంగీతం కూడా నేర్చుకున్నారు. పి.యు.సి.పరీక్షలు ఇంకొద్ది రోజులు ఉండగా ఓ రోజు హఠాత్తుగా నాన్న వెంకటరాజు గుండెపోటుతో చనిపోయారు.

■ 'జయసింహ', 'పాండురంగ మహత్యం', 'శ్రీకృష్ణపాండవీయం', 'ఉమ్మడి కుటుంబం', 'వరకట్నం', 'కథానాయకుడు', 'మంగమ్మశపథం', 'తిక్క శంకరయ్య' వంటి చరిత్రలో నిలిచిపోయే ఎన్నెన్నో అద్భుత చిత్రాలకు సంగీతం అందించిన నాన్న ఇకలేరన్న నిజాన్ని తట్టుకోవడం రాజ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు చాలా కష్టంగా అనిపించింది. అంతేకాదు జీవన పోరాటం కోసం సంగీత ప్రపంచంలోనే తనదైన స్థానం కోసం ప్రయత్నాలు ఆరంభించారు. నాన్న చనిపోయే నాటికి సాలూరి హనుమంతరావు (సాలూరి రాజేశ్వరరావు అన్నయ్య) దగ్గర అసిస్టెంట్‌గా పని చేశారు. అయితే ఆయనకు సినిమాలు ఎక్కువగా లేకపోవడంతో ఎస్.పి.కోదండపాణి దగ్గర మ్యూజిక్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యారు. కోదండపాణి వద్ద ఒక సంవత్సరం పని చేశాక సాలూరి రాజేశ్వరరావు దగ్గర చేరారు. ఈయన దగ్గరే రాజ్ సంగీత జీవితానికి నిజమైన, బలమైన పునాది పడింది. రాజేశ్వరరావుకి నలుగురు కుమారులు. నలుగూరు మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లోనే ఉన్నారు. వారిలో వాసూరావు, కోటి మ్యూజిక్ డైరెక్టర్స్ పాపులర్ అయ్యారు.

■ రాజ్ ప్రతిభ మీద ఉన్న నమ్మకంతో నందమూరి త్రివిక్రమరావు అప్పట్లోని గ్రేట్ మ్యూజిక్ డైరెక్టర్స్‌కి పరిచయం చేసి, వారందరి నొటేషన్స్ వర్క్ రాజ్‌తోనే చేయించి, ప్రోత్సహించారు. అలా పెండ్యాల నాగేశ్వరరావు, సుసర్ల దక్షిణామూర్తి, మాస్టర్ వేణు వంటి లెజెండ్స్ దగ్గర పని చేసే అరుదైన అవకాశాన్ని రాజ్ సొంతం చేసుకున్నారు. అంతా బాగుంది అనుకున్న టైమ్‌లో రాజేశ్వరరావుకి కూడా సినిమా అవకాశాలు తగ్గిపోవడంతో 1980 చివరలో అప్పటి సంగీత సంచలనం చక్రవర్తి వద్ద సహాయకుడిగా చేరే అవకాశం రాజ్‌కి లభించింది.

■ ఈ అవకాశం కూడా కృష్ణ-చక్ర సంగీత ద్వయంలో ఒకరైన చక్రధరరావు రికమండేషన్‌తో చక్రవర్తి దగ్గర చేరారు. ఆ టైమ్‌లో 'ప్రేమాభిషేకం' చిత్రానికి చక్రవర్తి పని చేస్తున్నారు. సంగీత దర్శకుడిగా చక్రవర్తి ఇరవై నాలుగు గంటలూ బిజీగా ఉండటంతో కెరీర్ పరంగా రాజ్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. అలాగే అదే సమయంలో కోటి కూడా చక్రవర్తి దగ్గరే పని చేసేవారు.

■ స్కూల్ డేస్ నుంచి కోటి తెలియడం, వాళ్ళ నాన్న దగ్గర శిష్యరికం చేయటం, ఇద్దరూ ఒకటే చోట పని చేయటం.. అన్నింటికిమించి ఇద్దరి అభిప్రాయాలు, అభిరుచులు కలవడంతో ఈ ఇద్దరూ మంచి స్నేహితులుగా మారిపోయారు. రాజ్‌కి సంగీత దర్శకుడిగా తొలిసారి అవకాశం వచ్చింది వాళ్ళ నాన్న స్నేహితుడు వెంకట్రామరాజు వల్ల. ఆయన మోహన్‌బాబు హీరోగా పి.సి.రెడ్డి దర్శకత్వంలో 'ప్రళయ గర్జన' చిత్రాన్ని నిర్మించారు. అయితే వచ్చిన తొలి అవకాశంలోనే స్నేహితుడైన కోటితో కలిసి ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ సినిమాతో రాజ్-కోటి సంగీత ద్వయంగా అందరికీ సుపరిచితులయ్యారు.

కోటితో విడిపోయాక నేను వెనుకబడిపోయాను, నష్టపోయాను అనే అభిప్రాయంతో నేను ఏకీభవించను. అయితే విడిపోయాక నేను రిలాక్స్ అయిన మాట వాస్తవం. 1973 నుండి దాదాపు 45 సంవత్సరాలుగా పని చేస్తూనే ఉన్నాను. దానికితోడు నేను ఎవ్వరినీ వర్క్ అడగను. నేను బయటకు వచ్చాక నాకై నేను అడిగింది నాగార్జునగారిని ఒక్కరినే. ఆయన 'సిసింద్రీ' సినిమా ఇచ్చారు. కోటితో విడిపోయాక తెలుగు, తమిళం, కన్నడ కలుపుకుని దాదాపు 60 నుంచి 70 సినిమాలు చేసి ఉంటాను. ఆ తర్వాత కేవలం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కే పరిమితమయ్యాను. సినిమా రంగం అన్నది ఒక అద్భుత ప్రపంచం. అందులోనూ సంగీతం అన్నది ఒక మహాసాగరం. సంగీత దర్శకుడిని అయినందుకు ఎప్పుడూ గర్వంగానే ఫీలవుతుంటాను. కేవలం మ్యూజిక్ డైరెక్టర్‌గానే కాకుండా నటుడిగా కూడా నా లైఫ్ మరొక టర్న్ తీసుకోవడం ఆందాన్నిచ్చింది. దాదాపు 17 సినిమాల్లో రకరకాల పాత్రలు పోషించాను. అలాగే మ్యూజిక్ డైరెక్టర్‌గా కొన్ని టీవీ సీరియల్స్‌కి కూడా వర్క్ చేశాను. మొత్తమ్మీద సినిమా అనే ఈ అద్భుత ప్రపంచంలో ఒక సంగీత దర్శకుడిగా, నటుడిగా ఉనికిని కొనసాగించడమే నా విజయంగా భావిస్తున్నా.

- రాజ్

రాజ్ సోలోగా చేసిన సినిమాలు

సిసింద్రీ, భరత సింహం, రాముడొచ్చాడు, మృగం, బొబ్బిలి బుల్లోడు, సంభవం, ప్రేమంటే ఇదేరా, చిన్ని చిన్ని ఆశ, సూర్యపుత్రిక, లగ్నపత్రిక వంటి తదితర చిత్రాలకు సంగీతంతోపాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ని రాజ్ సోలోగా ఇచ్చారు.



రాజ్-కోటి హిట్ సినిమాలు

టి.వి.రాజు, సాలూరి రాజేశ్వరరావు వంటి సుప్రసిద్ధ సంగీత దర్శకుల వారసులుగా రాజ్-కోటి వారి పేరు ప్రతిష్టలను కొనసాగిస్తూ దాదాపు దశాబ్దకాలం ఓ వెలుగు వెలిగారు. ఒక వైభవాన్ని చూశారు. తెలుగు సినీ సంగీత చరిత్రలో వీళ్ళిద్దరిదీ ఒక అధ్యాయం.. ఒక సంచలనం. అలాంటి సంచలన ద్వయం 'పోకిరిరాజా', 'ఆస్తి మూరెడు- ఆశ బారెడు' చిత్రాలకు పని చేస్తున్న తరుణంలో ఎవరికి వారే సంగీత దర్శకులుగా సినిమాలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

ప్రళయ గర్జన, ఉదయం, పున్నమి రాత్రి, సంసారం, జీవన జ్యోతి, యముడికి మొగుడు, ఖైదీ నెం.786, రౌడీ నెం.1, బజార్ రౌడీ, త్రినేత్రుడు, లంకేశ్వరుడు, విక్కీ దాదా, సాహసమే నా ఊపిరి, ముఠామేస్త్రీ, బాలగోపాలుడు, బంగారు బుల్లోడు, హలో బ్రదర్, బావా బావమరిది, గోవిందా గోవిందా, పోరికిరాజా వంటి తదితర ఎన్నో హిట్ చిత్రాలకు అత్యద్భుతమైన సంగీతాన్ని సమకూర్చి తిరుగులేని సంగీత దర్శకులుగా సువర్ణాధ్యాయాన్ని సృష్టించారు. 1994లో 'హలో‌బ్రదర్' చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకులుగా వీరికి నంది అవార్డు లభించింది.

■ 1983 నుంచి దాదాపు 40 చిత్రాలకు ఇద్దరూ కలిసి సంగీతం అందించినప్పటికీ కిక్ ఇచ్చే స్థాయిలో వీళ్ళకి సక్సెస్ రాలేదు. ఆ సమయంలో శోభన్‌బాబు హీరోగా నటించిన 'సంసారం' చిత్రం ఈ సంగీత ద్వయానికి పెద్ద కిక్ ఇచ్చేలా విజయం సాధించింది. అంతేకాదు వీళ్ళ కెరీర్‌లో తొలి శతదినోత్సవం జరుపుకున్న చిత్రమిది. ఆ తర్వాత కృష్ణ 'నా పిలుపే ప్రభంజనం' చిత్రంతో స్టార్స్ ఎరినాలోకి ఎంటర్ అయ్యారు. పద్మాలయా సంస్థకు బప్పీల హరి మ్యూజిక్ ఇచ్చిన చాలా చిత్రాలకూ రాజ్-కోటి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేశారు.

■ ఆ తర్వాత చిరంజీవి 'యముడికి మొగుడు' సూపర్ డూపర్ హిట్ అవ్వడంతో ఇండస్ట్రీలో రాజ్-కోటిల సంచలన యాత్ర ప్రారంభమైంది. తెలుగులో జంట సంగీత దర్శకులలో వీళ్ళు చేసినన్ని సినిమాలు వేరెవ్వరూ చెయ్యలేదు.

రాజ్‌కి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రాజ్ అంతిమ సంస్కారాలు నేడు (సోమవారం) హైదరాబాద్‌లోని మహా ప్రస్థానంలో జరుపుతామని కుటుంబ సభ్యులు తెలిపారు.

నవచిత్రం

తెలుగు చిత్ర సీమకి తీరని లోటు...

నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగు సినీ సంగీత ప్రపంచానికి రాజ్ చేసిన సేవలు అనిర్వచనీయం. సంగీత సంచలనాన్ని కోల్పోవడం తెలుగు చిత్ర సీమకే కాదు సంగీత ప్రపంచానికే తీరనిలోటు అంటూ రాజ్ అకాల మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ప్రముఖ సంగీత దర్శక ద్వయం 'రాజ్-కోటి'ల్లో 'రాజ్' ఇక లేరు అని తెలియడం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఎంతో ప్రతిభ గల రాజ్.. నా కెరీర్ ప్రారంభ దశలో నా చిత్రాలకు అందించిన బాణీలు.. ఆయా సినిమాల విజయంలో ప్రముఖ పాత్ర పోషించి.. ప్రేక్షకులను నన్ను మరింత దగ్గర చేర్చాయి. రాజ్ అకాల మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం.

- చిరంజీవి

సినీ సంగీత దర్శకుడు రాజ్ కన్నుమూశారని తెలిసి చింతించాను. అలనాటి సంగీత దర్శకుడు టి.వి.రాజుగారి వారసుడిగా రాజ్ తనదైన బాణీని చూపారు. తన మిత్రుడు కోటితో కలిసి రాజ్-కోటి ద్వయంగా చక్కని సంగీతం అందించారు. అన్నయ్య చిరంజీవి నటించిన 'యముడికి మొగుడు', 'ఖైదీనెం.786', 'త్రినేత్రుడు' వంటి తదితర చిత్రాలకు మంచి సంగీతం అందించడంలో రాజ్ భాగస్వామ్యం ఎంతో ఉంది.

- పవన్‌కళ్యాణ్

పాటల రూపంలో నా రాజ్ కలకాలం ఉంటాడు

నా రాజ్ మరణించారనే వార్త జీర్ణించుకోలేకపోతున్నా.. ఇటీవలే ఓ సినిమా పంక్షన్‌లో మేం కలుసుకున్నాం. ఆరోగ్య సమస్యలు ఉన్నాయని నాకు అనిపించలేదు. రాజ్ కూడా చెప్పలేదు. కానీ ఈ రోజు గుండెపోటుతో మరణించారని తెలిసి ఎంతో బాధగా ఉంది. రాజ్-కోటిగా మేం ఇద్దరం పలు సినిమాలకు పని చేసి.. ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ ఇచ్చాం. మేం విడిపోయిన తర్వాత కూడా కోటిగా నేను ఎన్ని సినిమాలు చేసినా.. వాటినీ రాజ్-కోటి పాటలు అనే వారు. మేమిద్దరం 24 గంటలూ పని చేసేవారం. చక్రవర్తి వద్ద మేమిద్దరం అసిస్టెంట్లుగా పని చేశాం.ముఠా మేస్త్రి, హలో బ్రదర్ వంటి ఎన్నో సినిమాలకు బ్లాక్ బస్టర్ హిట్లు ఇచ్చాం.



తెలుగులో మేం ఓ ట్రెండ్ క్రియేట్ చేశాం. మా పాటల రూపంలో నా రాజ్ కలకాలం ఉంటాడు. కాల ప్రభావం, పరిస్థితుల వల్ల మేం విడిపోయాం. నేను ఎన్ని సినిమాలు చేసినా రాజ్ నా పక్కనే ఉన్నాడనే ధైర్యంతోనే చేయగలిగా.. రాజ్‌కి నేనొక తమ్ముడి వంటి వాడిని. చిన్ననాటి స్నేహితులం. మేం ఇద్దరం విడిపోవడం ఇప్పటికీ నాకు బాధగానే ఉంటుంది. వద్దురా విడిపోవద్దు అని అన్నాడు. నాటి పరిస్థితుల వల్ల విడిపోయాం అని సంగీత దర్శకుడు కోటి కన్నీటి పర్యంతం అయ్యారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886